
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 310

మంగళవారం 31-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




..కూతుర్ని విజేతను చేసింది

ఏమైనా సరే నా కూతురు క్రికెట్ ఆడాలి అనుకుంది సావిత్రి.. -11లో



'ఏవీ' గ్యాస్ ఎగుమతులు షురూ

ఐఓసీ తాజాగా ఏవియేషన్ గ్యాస్ ఎగుమతులు ప్రారంభించింది. -13లో



6న మోదీ-బీబీసీ పిల్స్‌పై విచారణ

బీబీసీ డాక్యుమెంటరీపై కేంద్రం ఆంక్షలు విధించడంపై కొందరు సుప్రీంలో పిల్‌లు వేశారు. ఇవి 6న విచారణకు రానున్నాయి.

- వివరాలు 6లో▶



పాక్‌లో తాలిబన్ ఆత్మాహుతి దాడి

పెషావర్‌లో మసీదుకు వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకుని తాలిబన్లు జరిపిన దాడిలో 61 మంది ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో▶



బీజేపీతో మళ్లీ పొత్తు ప్రసక్తే లేదు

చావనైనా చస్తాను కానీ, బీజేపీతో మళ్లీ జట్టుకట్టేది లేదని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ తెగేసి చెప్పారు.

- వివరాలు 6లో▶



క్షిపణి దాడికి ఒక్క నిమిషం చాలు

ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యాను నిలువరించేందుకు ప్రయత్నించిన బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్‌ను పుతిన్ బెదిరించారా?

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

ఇంటర్ బోర్డు భద్రత వ్యవస్థ ట్యాంపర్



ఇంటర్మీడియెట్ బోర్డులో భద్రత వ్యవస్థ ట్యాంపరింగ్‌కు గురైందని, కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేశారని బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ వెల్లడించారు. అన్ని కోణాల్లో పరిశీలించాకే ఈ ఏడాది నుంచి ఇంటర్ సమాధాన పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడుతున్నట్లు చెప్పారు.

- వివరాలు 3లో▶

పాలమూరుకు రూ.13,500 కోట్ల రుణాలు



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.13,500 కోట్ల అదనపు రుణం ఇవ్వడానికి రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)లు సూత్రప్రాయంగా అంగీకరించాయి. చెరో రూ.6,750 కోట్ల చొప్పున రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చాయి.

- వివరాలు 14లో▶

హామీల అమలుపై ఆత్మపరిశీలన చేసుకోండి



బీఆర్‌ఎస్ నేతలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎంతమేరకు అమలు చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఏ ఒక్క మాటనూ నిలబెట్టుకోలేదని, ఏడున్నరేళ్లలో అనేక అవమానాల పాలయ్యానన్నారు.

- వివరాలు 5లో▶

టీచర్ల బదిలీల దరఖాస్తుకు మరికొంత గడువు

ఫిబ్రవరి 1 వరకు పొడిగించిన ప్రభుత్వం.. అన్నీ పూర్తయ్యాకే ఎస్జీటీ స్పౌజ్‌ల బదిలీలు 3 లో

ఇదండీ బాత్



యువతకు తలా ఒక ల్యాప్‌టాప్ ఇస్తే వాళ్లే తమ భవిష్యత్తును 'బంగారం' చేసుకుంటారట సార్!

గవర్నర్ స్పీచ్‌తోనే బడ్జెట్

అసెంబ్లీ, మండలి సమావేశాలపై వీడిన సందిగ్ధత

బడ్జెట్‌ను ఆమోదించనున్న గవర్నర్ తమిళిసై

ఉభయసభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించేందుకు ప్రభుత్వం ఓకే

- అంతకుముందు దీనిపై హైకోర్టు విచారణ
- గవర్నర్ సమాంతర ప్రభుత్వం నడపకూడదన్న ప్రభుత్వ న్యాయవాది
- ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని వ్యాఖ్య
- ప్రభుత్వం హుందాగా వ్యవహరించడం లేదన్న గవర్నర్ న్యాయవాది
- ఎట్ హోంకు పిలిచినా సీఎం రాలేదని వెల్లడి
- ధర్మాసనం సూచన మేరకు ఇరువర్గాల చర్చలు.. ఒప్పందం



బడ్జెట్ సమావేశాలకు ఆహ్వానించేందుకు రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిసిన మంత్రి ప్రశాంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై చిక్కుముడి వీడింది. ఉభయ సభలను ఉద్దేశిస్తూ గవర్నర్ చేసే ప్రసంగంతోనే బడ్జెట్ సమావేశాలను ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏర్పడిన వివాదం హైకోర్టు వరకు వెళ్లినా.. ఇరువర్గాల మధ్య ఒప్పందంతో సద్దుమణిగింది. కోర్టు సూచనల మేరకు.. బడ్జెట్‌ను ఉభయ సభల్లో ప్రవేశపెట్టడానికి గవర్నర్ అనుమతి ఇచ్చేలా, సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం అంగీకరించేలా ఏర్పాటు జరిగింది. రాష్ట్ర బడ్జెట్ 2023-24 సమావేశాలు గవర్నర్ ప్రసంగంతోనే ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఇరువర్గాల విజ్ఞప్తి మేరకు కోర్టు ఈ పిటిషన్‌లో వాదనలను ముగించింది.

ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్

రాష్ట్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 3న అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని సర్కారు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ గడువు సమీపిస్తున్నా బడ్జెట్‌కు గవర్నర్ నుంచి ఆమోదం రాలేదు. దీంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలపాలంటూ ఈనెల 21వ తేదీనే గవర్నర్‌కు లేఖ రాశామని, ఇప్పటివరకు ఎలాంటి సమాధానం రాలేదని పేర్కొంది. వెంటనే అనుమతి ఇచ్చేలా రాజ్‌భవన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరింది. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా లంచ్ మోషన్‌లో విచారించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనానికి అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సోమవారం ఉదయం విజ్ఞప్తి చేశారు. అయితే ''గవర్నర్ విధుల్లో కోర్టు న్యాయ సమీక్ష చేయవచ్చా? నోటీసులు ఇవ్వవచ్చా? కోర్టులు అతిగా జోక్యం చేసుకుంటున్నాయని మీరే చెప్తుంటారు కదా?'' అని ధర్మాసనం ప్రశ్నించింది. మధ్యాహ్నం విచారణకు

మిగతా 2వ పేజీలో ▶

6న రాష్ట్ర బడ్జెట్

ఫిబ్రవరి 3 నుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

అదేరోజు గవర్నర్ ప్రసంగం.. 4న ధన్యవాద తీర్మానంపై చర్చ

సభను ప్రొరోగ్ చేసి నేడు మరో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం

రాజ్‌భవన్‌కు మంత్రి వేముల

గవర్నర్ తమిళిసైతో భేటీ అనంతరం తిరిగి ప్రగతిభవన్‌కు..

శరవేగంగా పరిణామాలు

10 లో

..బాసటగా ఉండాలి

కేంద్ర బడ్జెట్‌తో ఉపశమనం ఉండాలంటున్న పేదలు, మధ్యతరగతి

పన్నుల భారం తగ్గించాలి.. ధరలను కట్టడి చేయాలి

పేదలు వాడే వస్తువులపై జీఎస్టీ తగ్గించాలి

- ఆదాయ పన్ను మినహాయింపు 5 లక్షలకు పెంచాలి
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి రావాలి
- చిరు వ్యాపారులకు ఊరటనిచ్చే చర్యలు చేపట్టాలనే విజ్ఞప్తులు
- ఎన్నికల ముందు బడ్జెట్ నేపథ్యంలో అన్నివర్గాలకు ఆశలు



సాక్షి, హైదరాబాద్: మరో రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న బడ్జెట్‌పై అన్ని వర్గాలు గంపెడు ఆశలు పెట్టుకున్నాయి. ఎన్నికలకు ముందటి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో ఏమైనా ఊరట లభిస్తుందేమోనని భావిస్తున్నాయి. ముఖ్యంగా కరోనా దెబ్బ నుంచి ఇంకా కోలుకోలేని పరిస్థితి ఉందని.. పన్నులు, ధరల నుంచి ఉపశమనం ఉండాలని పేద, మధ్యతరగతి వర్గాలు కోరుతున్నాయి. ఆదాయ పన్ను

మిగతా 2వ పేజీలో ▶

బతుకు భారం కాకుండా చూడాలి



పెట్రోల్ ధరలు పెరిగినప్పుడల్లా ఇంట్లో వాడే నిత్యావసరాలకు కోత పెట్టుకునే పరిస్థితి ఉంది. సరదాగా ఎక్కడికైనా వెళ్తే జీఎస్టీ పేరుతో పిండేస్తున్నారు. ఇంటి బడ్జెట్ రెండేళ్లలోనే డబుల్ అయింది. ప్రతీ దానిపైనా పన్నులేస్తే బతికేదెట్లా? చిన్న ఉద్యోగులకు ఆర్థిక వెసులుబాటు ఉండేలా బడ్జెట్ ఉండాలి. జీఎస్టీ నుంచి పేద వర్గాలు ఉపయోగించే వస్తువులను తొలగించాలి. - కె.రూపాదేవి, గృహిణి

పెట్టుబడులు పెంచాలి

హెచ్‌సీయూ పూర్వ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి

2 లో

రూ.45 లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టాలి

ఆర్థికరంగ విశ్లేషకుడు డాక్టర్ అందె సత్యం

మధ్యతరగతికి ఊరటనివ్వాలి

ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



రేపు బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి సీతారామన్

- తొలి విడత ఫిబ్రవరి 14 వరకు.. రెండో విడత మార్చి 12 నుంచి ఏప్రిల్ 6 వరకు నిర్వహణ
- అన్ని పార్టీల సహకారం కోరిన కేంద్రం

రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించనున్న బీఆర్ఎస్, ఆప్

సాక్షి, న్యూఢిల్లీ: వాడీవేడీ చర్చలకు వేదికగా నిలిచే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. రాష్ట్రపతిగా ఉభయసభలనుద్దేశిస్తూ ఆమె చేస్తున్న తొలి ప్రసంగం ఇది. ఆ తర్వాత సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. బుధవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2023-24 బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. రాజ్యసభ, లోక్‌సభలో దీనిపై ప్రధాని మోదీ సమాధానం ఇవ్వనున్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లోనే నిర్వహిస్తామని లోక్‌సభ స్పీకర్ బిర్లా గతంలో ప్రకటించారు. ఈసారి సమావేశాలు రెండు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత ఫిబ్రవరి 14 వరకు, ఆ తర్వాతి విడత మార్చి 12న మొదలై ఏప్రిల్ ఆరో తేదీన పూర్తికానుంది.

ప్రధాన సమస్యలపై నిలదీత!

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం ఓ వైపు సన్నాహాలు చేస్తుండగా, మరో వైపు కేంద్రాన్ని నిలదీసేందుకు విపక్షాలు కత్తులు నూరుతున్నాయి. పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, తాజా ఆర్థిక పరిస్థితి, సన్నగిల్లిన కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, పెరిగిన చైనా సరిహద్దు వివాదం, బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల్లో గవర్నర్ల జోక్యం, గౌతమ్ అదానీ షేర్లపై హిండెన్‌బర్గ్ సంచలనాత్మక నివేదిక, జాతీయస్థాయి కుల గణన, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని

మిగతా 6వ పేజీలో ▶

హింసను ప్రేరేపిస్తున్నారు

'స్నో'గన్: జోడో యాత్ర ముగింపు సభలో ప్రసంగిస్తున్న రాహుల్‌గాంధీ

మోదీ, అమిత్ షాలపై రాహుల్‌గాంధీ ధ్వజం

ఆ నొప్పి వారికి అర్థం కాదంటూ చురకలు

కశ్మీర్లో పాదయాత్ర చేయాలంటూ సవాలు

ఘనంగా ముగిసిన భారత్ జోడో యాత్ర

శ్రీనగర్‌లో వణికించే చలిలో ముగింపు సభ

నా కోసం కాదు, దేశం కోసమే పాదయాత్ర

మంచులో తడుస్తూనే మాట్లాడిన రాహుల్

హాజరై సంఘీభావం ప్రకటించిన 9 విపక్షాలు



శ్రీనగర్: ''దేశంలో స్వేచ్ఛాయుత, లౌకిక విలువలపై ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ, ఆరెస్సెస్ నిత్యం దాడి చేస్తున్నాయి. వాటికి పాతర వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందుకోసం నిరంతరం హింసను ప్రేరేపిస్తున్నాయి'' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఆ విలువల పరిరక్షణకే భారత్ జోడో యాత్ర చేపట్టినట్టు పునరుద్ఘాటించారు. జోడో యాత్ర సోమవారం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ముగిసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీని, షేర్ ఏ కశ్మీర్ క్రికెట్ స్టేడియంలో సభ నిర్వహించింది. దీనిలో తొమ్మిది విపక్ష పార్టీల నేతలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా విపరీతంగా కురుస్తున్న మంచులో తడుస్తూనే రాహుల్ మాట్లాడారు. హింస ఎంతటి బాధాకరమో మోదీ లాంటివారికి ఎన్నటికీ అర్థం కాదంటూ ఆక్షేపించారు. తన నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీల హత్యోదంతాలను గుర్తు చేసుకున్నారు. ''వారిక లేరని ఫోన్ కాల్స్ ద్వారానే తెలుసుకున్నా. ఆ దుర్వార్తలు విని

మిగతా 6వ పేజీలో ▶

గవర్నర్ వ్యవస్థ ఎందుకు?



ప్రధాని మోదీని ప్రశ్నించిన కేటీఆర్

- బ్రిటిష్ కాలంనాటి గవర్నర్ వ్యవస్థను తొలగించాలి..
- ప్రధాని మోదీకి ఇదే చివరి బడ్జెట్
- పీఎం కిసాన్ కింద ఎకరానికి రూ.10 వేలు ఇవ్వాలి.. ఎనిమిదేళ్లలో కేంద్రం రాష్ట్రానికి చేసిందేమీ లేదు

సిరిసిల్ల: 'ప్రజలు ఎన్నుకున్న సభ్యులతో పార్లమెంట్, శాసన సభలు ఉండగా గవర్నర్ వ్యవస్థ ఎందుకు.. అది బ్రిటిష్ కాలం నాటిది కదా? రాజ్‌భవన్‌లు రాజకీయ వేదికలుగా మారిపోయాయి' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. సోమవారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తూ బానిసత్వ చిహ్నాలు పోవాలన్నారని, ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా.. గవర్నర్ వ్యవస్థ ఎందుకని ప్రశ్నించారని గుర్తుచేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ

పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

- దండుపల్లిలో ఐటీసీ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీని ప్రారంభించిన మంత్రి
- స్థానికులకు ఉపాధి, రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచన

వివరాలు 2లో



5 రకాల పోస్టులకు అర్హత పరీక్షల తేదీలు ఖరారు

షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షల తేదీలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. సోమవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్ రెడ్డి అధ్యక్షతన కమిషన్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో భాగంగా ఐదు రకాల పోస్టులకు సంబంధించి పరీక్షల నిర్వహణపై చర్చించి తేదీలను ఖరారు చేశారు. తేదీలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్షలను ఉదయం పూట ఒక సెషన్, మధ్యాహ్నం పూట మరో సెషన్‌లో నిర్వహిస్తారు. హాల్‌టికెట్లను పరీక్షకు వారం రోజుల ముందు వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టనున్నారు.

ఐదు పరీక్షల షెడ్యూల్ - 3లో

'అధ్యక్షులు' అసెంబ్లీకే!

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకే ప్రధాన పార్టీల అధ్యక్షుల మొగ్గు

కేసీఆర్ శాసనసభ బరిలో దిగడం ఖాయమంటున్న పార్టీవర్గాలు

- ఆ తర్వాతే జాతీయ రాజకీయాలపై నజర్ అని స్పష్టీకరణ
- తొలుత గజ్వేల్ నుంచి అసెంబ్లీకి.. ఆ తర్వాత అవసరమైతే మెదక్ లోక్‌సభకు!
- కొడంగల్ నుంచి రేవంత్.. కాకుంటే ఎల్బీనగర్ లేదా ఉప్పల్!
- కరీంనగర్ నుంచి పోటీ చేస్తానని సంజయ్ సంకేతాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబర్‌లోపు అసెంబ్లీ ఎన్నికల ఘట్టం పూర్తి కావాల్సి ఉంది. దీంతో రాష్ట్రంలో రాజకీయం క్రమంగా వేడెక్కుతోంది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు తమ సీట్లను ఖరారు చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. కొందరు ఇప్పటికే నియోజకవర్గాల్లో పని ప్రారంభించగా, మరికొందరు తాము పోటీ చేసే స్థానాలను నిర్ధారించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అంశాన్ని పక్కన పెడితే.. వామపక్ష పార్టీల కార్యదర్శులతో సహా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులందరూ (ఎంఐఎం మినహా) ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. బీఆర్ఎస్ ఏర్పాటు చేసి జాతీయ రాజకీయాల్లో క్రియాశీలం అవుతున్న ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేస్తారని పార్టీవర్గాలు చెబుతుండగా.. ఎంపీలుగా ఉన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అసెంబ్లీ బరిలో దిగడం ఖాయంగా కన్పిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తర్వాత మూడు, నాలుగు నెలలకు పార్లమెంటు ఎన్నికలు జరగనుండడంతో, ముందు అసెంబ్లీకి పోటీ చేసి ఆ తర్వాతి పరిస్థితులను బట్టి లోక్‌సభ బరిలో దిగే అంశాన్ని వీరు పరిశీలించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ సహా వివిధ పార్టీలకు అధ్యక్షులుగా ఉన్నవారు



మిగతా 3వ పేజీలో ▶

బడ్జెట్ బాసటగా ఉండాలి

▶ మొదటి పేజీ తరువాయి
మినహాయింపు పెరుగుతుందా అని వేతన జీవులు.. పలు రకాల పన్నుల నుంచి ఉపశమనం ఏదైనా ఉంటుందా అని చిన్నా, పెద్దా వ్యాపారులు ఉత్కంఠగా చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో సామాన్యులపై భారం, వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొని నిధుల కేటాయింపులు, పన్నుల విధింపు ఉంటే బాగుంటుందని అంతా ఆశిస్తున్నారు. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో పలువర్గాల వారి నుంచి 'సాక్షి' అభిప్రాయాలను సేకరించింది. ఆ వివరాలు..



కుటుంబ ఖర్చు పెరిగింది..

రోజువారీ సాధారణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. కోవిడ్ ముందు మా కుటుంబ నెలవారీ ఖర్చు రూ.18 వేలు ఉండేది. ఇప్పుడది రూ.28 వేలకు పెరిగింది. ఆదాయంమాత్రం ఆ మేరకు పెరగలేదు. ప్రతిదాని ధర పెరిగి.. సామాన్యుల జీవనం అతలాకుతలం అవుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గుర్తించి ఆ దిశగా ధరలు తగ్గేలా చూడాలి. – కావలి నర్సింహ, ప్రైవేటు ఉద్యోగి, పరిగి

పన్నుల భారం తగ్గించాలి




సామాన్యులపై పన్నుల భారం తగ్గించేలా కేంద్ర బడ్జెట్ ఉండాలి. నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, నా భార్య గృహిణి. మా వృత్తిలో వేతనాలు పెరిగినా.. అంతే స్థాయిలో పన్నుల భారం తప్పడం లేదు. నిత్యావసరాల ధరలు చూస్తే చుక్కల్లోకి చేరుతున్నాయి. కోట్లలో బ్యాంకులను ముంచేస్తున్న వారికి మాఫీలు చేస్తున్న ప్రభుత్వం.. మాలాగా నిజాయితీగా పన్నులు చెల్లించే వారిపై భారాన్ని ఎందుకు తగ్గించకూడదు? – ఉదయ, నాగేందర్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఆదాయ పన్ను మినహాయింపు రూ.5 లక్షలకు పెంచాలి



ఉద్యోగులపై ఆదాయ పన్ను భారం తగ్గించాలి. మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలి. ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50వేల నుంచి రూ.లక్షకు పెంచాలి. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పలు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అన్ని వర్గాలకు తప్పనిసరి అయ్యాయి. అలాంటి వాటి ధరలు తగ్గేలా చూడాలి. పెట్రోల్, డీజిల్‌ల ధరలు తగ్గేలా జీఎస్టీ పరిధిలోకి తేవాలి. – శ్రీవిందు, శ్రీనివాసరావు, ప్రైవేటు ఉద్యోగి



మందుల ధరలు తగ్గాలి

వృద్ధాప్యంలో మందుల ఖర్చే ఎక్కువ. రిటైర్ అయినప్పటి నుంచీ పెన్షన్‌లో సగం మందుల కోసమే ఖర్చు చేస్తున్నాను. కామన్‌గా వాడే మందుల ధరలు తగ్గిస్తే పెన్షనర్లకు మేలు చేసినట్టు అవుతుంది. – పి.మోహన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి

మెరుగైన విద్య, వైద్యం అందాలి



దేశంలో ఉద్యోగుల పిల్లలతోపాటు ప్రతి ఒక్కరికి మెరుగైన విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత. ఆ దిశగా బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలి. యూనివర్సిటీలు, గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తే బాగుంటుంది. టెక్నాలజీ రంగంలో ఇతర దేశాలతో పోటీ పడేలా నిధులు ఇవ్వాలి. – ఏవీ సుధాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఇబ్రహీంపట్నం

స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా ప్రోత్సాహకాలు ఉండాలి



ఆర్థిక మాంద్యం భయపెడుతోంది. పెద్ద పెద్ద కంపెనీలు లేఆఫ్‌లు అంటున్నాయి. సమర్థత ఉన్న ఐటీ నిపుణులు స్టార్టప్‌లు పెట్టుకునేందుకు ఊతం ఇవ్వాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు ఉండాలి. – ఆదిత్య కొండూరు, ఐటీ ఉద్యోగి

చిరు వ్యాపారులకు రాయితీలు ఇవ్వాలి



పెద్దపెద్ద మాల్స్ వచ్చాక చిరు వ్యాపారులు బతికే అవకాశం లేకుండా పోయింది. బడ్జెట్ వచ్చినప్పుడల్లా మా గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పన్నుల భారం పడుతూనే ఉంది. మాల్స్‌లో ఒకదానిపై తగ్గించినా, మరోదానిపై రాబడతారు. ఎక్కువ వ్యాపారం ఉంటుంది కాబట్టి కలిసి వస్తుంది. కానీ చిరు వ్యాపారాలు రోడ్డున పడే పరిస్థితి ఉంది. మా లాంటి వారికి ఊరటనిచ్చేలా రాయితీలు ప్రకటిస్తే బాగుంటుంది. – కాకి వీరభద్రం, చిరు వ్యాపారి

డీజిల్ ధర అతలాకుతలం చేస్తోంది



భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు రవాణా రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గత ఏడాది కాలంలో తెలంగాణలో 19 మంది లారీ యజమానులు ఆత్మహత్య చేసుకున్నారు. డీజిల్ ధర లీటరుకు రూ.50–60 ఉన్నప్పుడు ఖరారు చేసిన చార్జీలనే వ్యాపారులు ఇప్పటికీ అమలు చేస్తున్నారు. ఇందులో డీజిల్‌కే ఎక్కువగా ఖర్చవుతోంది. బీమా చార్జీలు రెండింతలు అయ్యాయి. రవాణా వాహనాల యజమానులు బ్యాంకు కిస్తీలు కట్టలేని దుస్థితిలో ఉన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం డీజిల్ ధరలను తగ్గించి తీపి అందించాలి. – మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, తెలంగాణ లారీ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మధ్యతరగతికి ఊరటనివ్వాలి

ఆదాయపన్ను పరిమితిని రూ. 5 లక్షలకు పెంచాలి
- ప్రజలపై పరోక్ష పన్నుల భారం తగ్గించాలి...
- కార్పొరేట్లకు పన్నులు పెంచాలి
- ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్య పరిస్థితుల ప్రభావం అత్యధికంగా మధ్యతరగతిపై పడుతున్నందున కేంద్ర బడ్జెట్‌లో ఈ వర్గానికి వివిధ రూపాల్లో ఉపశమనాలు అవసరమని ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. 'ప్రైస్' అనే సంస్థ ఇటీవల జరిపిన పరిశీలనలో భారత్‌లో 30 శాతం మధ్యతరగతి వారే ఉన్నట్లు వెల్లడైందని చెప్పారు. అందువల్ల మధ్యతరగతి అనుకూల చర్యలను బడ్జెట్‌లో పొందుపరచాలని సూచించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

ఐటీ ఉపశమనం కల్పించాలి...

నగరాల్లో జీవన వ్యయం విపరీతంగా పెరిగింది. ప్రస్తుత లెక్కల ప్రకారం చూస్తే నెలకు రూ. 21 వేలకుపైగా సంపాదించే వారు ఐటీ పరిధిలోకి వస్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఒక కుటుంబం అద్దె ఇంట్లో నివసించేందుకు కనీసం రూ. 6–7 వేలు చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు నెలవారీ రవాణాకు కనీసం రూ. 2–3 వేలు ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలో ఐటీ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలి. దీనివల్ల మధ్యతరగతికి ఏటా రూ. 10 వేల దాకా ఉపశమనం లభిస్తుంది. అలాగే ఆర్థిక మాంద్యం నుంచి బయటపడటానికి ప్రజల చేతుల్లో డబ్బు ఉంచాలి. ఇందుకోసం కోట్లాది మంది మధ్యతరగతి ప్రజలకు అదనంగా రూ. 5 నుంచి 10 వేల దాకా పన్ను రాయితీ కల్పించాలి. తద్వారా మార్కెట్‌లో డిమాండ్ పెరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. అలాగే పేదల అభ్యున్నతికి అధిక కేటాయింపులు చేయాలి.

కార్పొరేట్లకు పన్నులు పెంచాలి...

2019 సెప్టెంబర్‌లో కార్పొరేట్ రంగానికి ఐటీ పన్నును 32 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. వాస్తవానికి కార్పొరేట్లకు అనేక పైకి కనిపించని ఉపశమనాలు ఉంటాయి. కార్పొరేట్లు ఖర్చులను ఎక్కువగా చూపి అనేక రాయితీలు పొందుతుంటారు. అదే నా వంటి వృత్తి నిపుణులు మాత్రం వార్షిక ఆదాయంలో 30 శాతం పన్ను కట్టాలి. ఉద్యోగులకు ఖర్చులు చూపే అవకాశం లేదు. జపాన్, జర్మనీలలో 30 శాతం, అమెరికాలో 25 శాతం కార్పొరేట్ ట్యాక్స్ ఉంటే భారత్‌లో 22 శాతమే ఉంది. అందువల్ల కార్పొరేట్ ట్యాక్స్‌ను పెంచాలి.

పరోక్షపన్నుల భారం తగ్గించాలి...

2022–23లో జీఎస్టీ, ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు, ఇతర రూపాల్లో పరోక్ష పన్నులే 53 శాతంగా ఉన్నాయి. ధనిక దేశాల్లో 66% ప్రత్యక్షపన్నులుంటే 33 శాతమే పరోక్ష పన్నులుంటాయి. అందుకు విరుద్ధంగా భారత్‌లో 53% పరోక్ష పన్నులు ఉన్నాయి. కార్పొరేట్లకు రాయితీలిస్తూ ప్రజలపై పరోక్ష పన్నుల భారం మోపడం సరికాదు. ఈ భారాన్ని తగ్గించాలి.

విద్య, వైద్యానికి భారీ కేటాయింపులు ఉండాలి



బడ్జెట్‌లో విద్య, వైద్యానికి కేటాయింపులను భారీగా పెంచాలి. ఈ రంగాలకు కేవలం ఒకట్రెండు శాతం నిధులు కేటాయిస్తే దేశంలో మార్పు రాదు. యూకేలో వైద్యానికి జీడీపీలో 14 శాతాన్ని కేటాయిస్తారు. అందుకే అక్కడి వైద్య సేవలు బాగుండటంతోపాటు భారత్ సహా ప్రపంచ దేశాల నుంచి వలసలు పెరిగిపోయాయి. ఆయుష్మాన్ భారత్ పథకంతో సామాన్యులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. మరోవైపు విద్యారంగాన్ని పటిష్టపరచాలి. పట్టణ నిరుద్యోగులకు భృతి మంజూరు చేయాలి. ఈసారైనా రెండో దశ ఎంఎంటీఎస్ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వాలి. మూడో దశ కింద ఎంఎంటీఎస్‌ను శంషాబాద్ విమానాశ్రయం వరకు విస్తరించాలి. – వి. నాగిరెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ఐటీ కొలువుల భద్రతకు నిధి కావాలి



దేశవ్యాప్తంగా ఐటీ రంగంలో సుమారు 45 లక్షల మంది పనిచేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారు. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఐటీ ఉద్యోగుల లేఆఫ్‌ల వల్ల ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు కోల్పోతున్న ఐటీ నిపుణులకు అండగా నిలబడేందుకు కేంద్రం బడ్జెట్‌లో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి. ఫ్రాన్స్ తరహాలో కేంద్రం ఏర్పాటు చేసే ప్రత్యేక నిధి నుంచి తాత్కాలిక భృతి చెల్లించాలి. ఉద్యోగాలు కోల్పోయిన వారికి కొత్త టెక్నాలజీలపై నైపుణ్య శిక్షణ ఇప్పించాలి. ఎమర్జింగ్ టెక్నాలజీ రంగంలో 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 9.7 కోట్ల ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నందున ఏఐ, బ్లాక్‌చెయిన్ వంటి టెక్నాలజీ శిక్షణకు ఎక్కువ నిధులు ఇవ్వాలి. స్టార్టప్ రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలకు నిధులు కేటాయించాలి. ఐటీ రంగంలో మరింత మందికి ఉద్యోగాల కల్పన కోసం హైదరాబాద్‌లో ప్రతిపాదిత ఐటీఐఆర్ ప్రాజెక్టును పునరుద్ధరించాలి. – సందీప్ కుమార్ మక్తాల, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ అధ్యక్షుడు

గవర్నర్ స్పీచ్‌తోనే బడ్జెట్

▶ మొదటి పేజీ తరువాయి
సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే హాజరై దీనిపై వివరణ ఇస్తారని ఏజీ వివరించారు. ఈ మేరకు ధర్మాసనం మధ్యాహ్నం విచారణ చేపట్టగా.. ప్రభుత్వం తరఫున దుష్యంత్ దవే వాదన వినిపించారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమే సుప్రీం..
''బడ్జెట్ అనేది కోట్లాది మంది ప్రజలతో ముడిపడిన సున్నితమైన అంశం. దీనిపై గవర్నర్, సర్కార్ మధ్య ప్రతిష్టంభన సరికాదు. ప్రజాస్వామ్యంలో అంతిమంగా ప్రభుత్వమే సుప్రీం. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా పలు తీర్పుల సందర్భంగా వెల్లడించింది. కారణం లేకుండా బడ్జెట్‌కు ఆమోదం తెలపకపోవడం సరికాదు. గవర్నర్ రాజ్యాంగానికి లోబడి ఉండాలి, ప్రభుత్వంతో కలసి పనిచేయాలే తప్ప.. సమాంతర ప్రభుత్వాన్ని నడపకూడదు. వ్యక్తిగతంగా తీసుకోకూడదు. ఓ పార్టీ చెప్పిన వాటిని వినకూడదు'' అని దవే పేర్కొన్నారు. ఇక గవర్నర్ కార్యాలయం తరఫున వాదన వినిపించేందుకు సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్ కుమార్ హాజరయ్యారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. భోజన విరామంలో ఇరువర్గాల న్యాయవాదులు చర్చించుకోవాలని సూచించింది.

ప్రభుత్వ తీరు సరిగా లేదు..
అశోక్ ఆనంద్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ''ప్రభుత్వం హుందాగా వ్యవహరించడం లేదు. బడ్జెట్ ఫైల్ పంపాలని గవర్నర్ కోరినా సీఎంవో నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. గవర్నర్ ప్రసంగం ఉంటుందా, ఉండదా? అనేది కూడా చెప్పడం లేదు. గత ఏడాది కూడా గవర్నర్ ప్రసంగం లేదు. గణతంత్ర వేడుకలకు సీఎం హాజరుకాలేదు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్‌పై మంత్రులు అనుచిత, అభ్యంతర వ్యాఖ్యలు చేస్తున్నారు. మహిళ అని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. వాటిని సీఎం తప్పు బట్టడం లేదు. రాష్ట్రంలో రిపబ్లిక్ డే వేడుకలను కూడా కోర్టు ఆదేశాలతో జరపాల్సి వచ్చింది. ఎట్ హోంకు సీఎంను పిలిచినా రాలేదు. ప్రభుత్వం వ్యవహరించాల్సిన తీరు ఇది కాదు. ప్రభుత్వానికి రాజ్‌భవన్ నుంచి ఎలాంటి అడ్డంకులు ఉండవు..'' అని పేర్కొన్నారు. అయితే ఇలాంటి వాటిని ఖండించాల్సిందేనని, సీఎం దృష్టికి తీసుకెళ్తానని దవే వివరణ ఇచ్చారు.

ఇరువర్గాల ఒప్పందంతో..
ధర్మాసనం సూచన మేరకు భోజన విరామ సమయంలో న్యాయవాదులు ప్రభుత్వం, రాజ్‌భవన్‌తో మాట్లాడి, చర్చించుకున్నారు. ఈ వివరాలను కోర్టుకు తెలిపారు. తమ సమస్య పరిష్కారమైందని వివరించారు. ''మంత్రి వెళ్లి గవర్నర్‌ను ఆహ్వానిస్తారు. గవర్నర్ బడ్జెట్‌కు ఆమోదం తెలపాలి. ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని చదవాలి. పెండింగ్ బిల్లులపైనా చర్చ జరిగింది. న్యాయపరమైన అంశాలుంటే సంబంధిత అధికారులు వివరణ ఇస్తారు.'' అని దుష్యంత్ దవే కోర్టుకు చెప్పారు. బడ్జెట్‌కు ఆమోదం తెలిపేలా గవర్నర్ కార్యాలయం చర్యలు తీసుకుంటుందని అశోక్ ఆనంద్ వెల్లడించారు. ఈ పిటిషన్‌లో వాదనలను ముగించాలని ఇద్దరు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విచారణ ముగిస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. మొత్తంగా బడ్జెట్ సమావేశాలకు సంబంధించి గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏర్పడిన వివాదానికి తెరపడింది.

ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి

పేదలను ఆదుకోవాలి... ఉపాధి హామీకి వెన్నుదన్నుగా నిలవాలి
- పట్టణ పేదలకూ అర్బన్ ఉపాధి హామీ అమలు చేయాలి
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రముఖ ఆర్థికవేత్త, హెచ్‌సీయూ పూర్వ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం 'పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్'ను గణనీయంగా పెంచాల్సిన అవసరముందని ప్రముఖ ఆర్థికవేత్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ పూర్వ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ప్రజలు పొదుపు చేయడం బాగా తగ్గినందున వారి చేతుల్లో డబ్బు ఆడేలా చర్యలను చేపట్టాలని సూచించారు. కోవిడ్ పరిస్థితుల ప్రభావంతో కొంతమేర దేశంలో ప్రైవేటు మూలధన పెట్టుబడులు కూడా తగ్గడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో 2023–24 బడ్జెట్‌లో ప్రభుత్వపరంగా పెట్టుబడులు, ప్రోత్సాహకాలు పెరిగితే ప్రైవేటు పెట్టుబడులు కూడా పెరుగుతాయని చెప్పారు. అలాగే కోవిడ్‌కు ముందున్న ఆర్థిక స్థితికి దేశం చేరుకొనేలా కేంద్రం బడ్జెట్‌లో పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో బడ్జెట్‌లో పెరగాల్సిన కేటాయింపులు, ప్రాధాన్యతలను 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రొ. డి.నర్సింహారెడ్డి వివరించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

పేదల ఖాతాల్లో డబ్బు వేయాలి..

బడ్జెట్‌లో పేద వర్గాలను ఆదుకోవాలి. నేరుగా వారి ఖాతాల్లోకి డబ్బులు జమచేసే దిశగా వెంటనే చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా ఫ్యాక్టరీలు, ఇతర ఉత్పత్తి సంస్థల్లో పనిచేసే కార్మికులకు లబ్ధి చేకూర్చే నిర్ణయాలు తీసుకోవాలి. అలాగే మధ్యతరగతి ప్రజలనూ ఆదుకోవాలి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇస్తున్న మొత్తాన్ని రూ. 6 వేల నుంచి రూ. 8 వేలకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నా దీని ద్వారా కొంతమేర మాత్రమే ప్రయోజనం కలుగుతుంది.

ఉపాధి హామీపై నియంత్రణ వద్దు...

కరోనా కాలంలో కూలీలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆదుకుంది. అయితే ఆ తర్వాత కేంద్రం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం ఉపాధి కూలీలు చేసిన పనికి కూడా నెలా, రెండు నెలలపాటు కూలీ డబ్బు కోసం వేచి చూడాల్సి వస్తోంది. రాష్ట్రాల్లో ఈ పథకం అమలు విషయంలోనూ కేంద్రం కొత్త నిబంధనలు తేవడంతో కూలీలు దీని నుంచి క్రమంగా దూరమవుతున్నారు. తెలంగాణలో ఈ పథకం కింద రైతు కల్లాలను నిర్మిస్తే ఈ పనులు పథకం జాబితాలో లేనందున దానికి చేసిన ఖర్చును తిరిగివ్వాలని కేంద్రం పట్టుబడుతోంది. ఇది రైతులకు, ప్రజలకు ఉపయోగపడేదే అయినప్పుడు నియంత్రణలు ఎందుకు? అందువల్ల ఈ పథకాన్ని మరింత విస్తృతపరచాలి. కూలీలకు సత్వరమే చెల్లింపులు జరిగేలా రాష్ట్రాలకు నిధులు అందుబాటులో ఉంచాలి.

అర్బన్ ఉపాధిహామీ అమలు చేయాలి...

ప్రస్తుతం పట్టణాల్లో 15–29 ఏళ్ల యువతలో నిరుద్యోగిత శాతం 22 దాకా ఉన్నట్టు 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్' తాజా సర్వే వెల్లడించింది. ఈ నేపథ్యంలో పట్టణ పేదలు, నిరుద్యోగులను ఆదుకునేందుకు రాజస్తాన్‌లో అమలవుతున్న తరహాలో పట్టణ ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా తీసుకురావాలి. స్వల్పకాలికంగానైనా వారికి పని కల్పించి ఆదుకొనేలా కేంద్రం బడ్జెట్‌లో చర్యలు చేపట్టాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకం లాగానే 90 శాతం నిధులను కేంద్రం పట్టణ ఉపాధి పథకానికి కూడా ఖర్చు చేయాలి.

రూ. 45 లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టాలి

- అప్పుడే అన్ని రంగాలకు తగిన కేటాయింపులు సాధ్యం
- ప్రముఖ ఆర్థికరంగ విశ్లేషకుడు డాక్టర్. అందె సత్యం



సాక్షి, హైదరాబాద్: ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో 2023–24 కేంద్ర బడ్జెట్ పద్దును కనీసం రూ. 45 లక్షల కోట్లకు (2022–23 బడ్జెట్ సుమారు 39.4 లక్షల కోట్లు) పెంచాలని, అప్పుడే పెరిగిన ధరలకు అనుగుణంగా అన్ని రంగాలకు తగిన కేటాయింపులు సాధ్యమవుతాయని ప్రముఖ ఆర్థిక రంగ విశ్లేషకుడు డాక్టర్ అందె సత్యం అభిప్రాయపడ్డారు. కేంద్రం బుధవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో బడ్జెట్ ప్రాధాన్యతలపై ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఆయన ఏమన్నారంటే...
- వ్యవసాయ రంగానికి 2023–24 బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
- ప్రస్తుతం రైతు కుటుంబాలకు ఏటా మూడు విడతల్లో అందిస్తున్న రూ. 6 వేల పెట్టుబడి సాయాన్ని తెలంగాణ తరహాలో ఏటా ఎకరాకు రూ. 10 వేల చొప్పున పెంచాలి.
- పన్నుల్లో రాష్ట్ర వాటాను 42 శాతం నుంచి 45 శాతానికి పెంచితేనే రాష్ట్రాల రెవెన్యూ సర్దుబాటు కష్టాలు కొంత తీరుతాయి.
- స్టార్టప్ సంస్థలకు ప్రోత్సాహకాలు ప్రకటించాలి.
- దేశంలోని రైతాంగానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలి. ఇందుకు అయ్యే ఖర్చు రూ. 2.5 లక్షల కోట్లు మాత్రమే. ఉచిత విద్యుత్ వల్ల మెట్టప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగం.
- దేశంలో ఆర్థిక కేంద్రీకరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సంపన్నులపై విధించే పురోగామి ఆదాయ పన్నును పెద్ద ఎత్తున పెంచాలి.
- పింఛన్‌దారులకు పన్ను రద్దు చేయాలి.
- గతంలో ఆమోదించిన పంచాయతీరాజ్ చట్టాలు, సర్కారియా కమిషన్ సిఫారసుల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీకి చర్యలు చేపట్టాలి.
- జీఎస్టీ ఎగవేతను నిరోధించి చేనేత లాంటి వాటిని మినహాయించాలి.
- జీడీపీలో విద్యా రంగానికి 6 శాతం, వైద్య రంగానికి 3 శాతం కేటాయింపులు చేయాలి.

గవర్నర్ వ్యవస్థ ఎందుకు?

▶ మొదటి పేజీ తరువాయి
రాజ్యాంగ బద్ధంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రధాని మోదీకి చివరిదన్నారు. బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సోయం బాపూరావు, అరవింద్‌లు సోయి తెచ్చుకుని రాష్ట్రానికి నిధులు సాధించాలని సూచించారు. గత ఎనిమిదేళ్లలో తెలంగాణకు ఒక్క పని కూడా కేంద్రం చేయలేదని కేటీఆర్ విమర్శించారు. బీజేపీ ఎంపీలకు తెలివి ఉంటే.. ఈ సారి బడ్జెట్‌లో ఎక్కువ నిధులు సాధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు మంజూరు చేయాలని కోరారు.

రైల్వే ప్రాజెక్టులన్నీ అథోగతి
రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులన్నీ అథోగతి పాలయ్యాయని, ఒక్క కొత్త రైల్వే మార్గం వేయలేదని కేటీఆర్ విమర్శించారు తెలంగాణలో రైల్వే వ్యవస్థ కేవలం 3 శాతం మేరకే ఉందని, అందులోనూ సింగిల్‌ట్రాక్ వ్యవస్థ 57 శాతం ఉందని పేర్కొన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వమే మొత్తం రైల్వేలైన్ వేసేదని, ప్రస్తుతం ప్రధాని మోదీ మాత్రం కేంద్రం 50 శాతం, రాష్ట్రం 50 శాతం.. అంటూ కొత్తవిధానాన్ని ప్రవేశపెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతుబంధును చూసి మోదీ కాపీ కొట్టారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు రావాల్సిన రైల్వే ప్రాజెక్టులపై ఆ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారని చెప్పారు. రైతులకు పీఎం కిసాన్ పథకం కింద ఎకరానికి రూ.2 వేలు ఇస్తున్నారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు కేంద్రం కూడా ఏటా ఎకరానికి రూ.10 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పాలమూరు ఎత్తిపోతలకు జాతీయహోదా ఇవ్వాలని, సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్ మంజూరు చేయాలని, అలాగే వరంగల్‌కు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంపై ఏమాత్రం ప్రేమ ఉన్నా.. బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు.

'కోర్టు మొట్టే వరకు కేసీఆర్ బుర్ర పనిచేయలేదు'



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ విషయంలో కోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప కేసీఆర్‌కు బుర్ర పనిచేయలేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తూ.. కోర్టుల్లో అడ్డంగా దొరికిపోయారని ఆమె పేర్కొన్నారు. గతంలో రెండుసార్లు గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ ప్రవేశపెట్టిన కేసీఆర్.. ఈసారి భంగపాటుకు గురయ్యారని వ్యాఖ్యానించారు. బడ్జెట్ ఆమోదానికి గవర్నర్‌ను ఆదేశించాలని కోర్టుకెళ్లే ఆయన.. నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో మాట్లాడే ధైర్యం లేదా? అని ప్రశ్నించారు. 80వేల పుస్తకాలు చదివానని గొప్పలు చెప్పుకోవడం కాదు.. ముందు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని చదవాలని షర్మిల హితవు పలికారు

ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా రాష్ట్రం

పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- దండుపల్లిలో ఐటీసీ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీని ప్రారంభించిన మంత్రి
- స్థానికులకు ఉపాధి, రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచన



ఐటీసీ పరిశ్రమలో తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

తూప్రాన్, మనోహరాబాద్(తూప్రాన్): దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రం ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఆవిర్భవిస్తోందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లిలో రూ.450 కోట్ల పెట్టుబడితో 59 ఎకరాల్లో ఐటీసీ సంస్థ నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ లాజిస్టిక్స్ ఫెసిలిటీని పరిశ్రమ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌పూరితో కలసి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం పరిశ్రమలో తయారు చేసిన ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఇంత పెద్ద పరిశ్రమ రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కంపెనీ భవిష్యత్‌లో మరో రూ.350 కోట్లు వెచ్చించి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనుందన్నారు. పరిశ్రమ యాజమాన్యం స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు కంపెనీలో తయారు చేసే చిప్స్, బిస్కెట్ల కోసం ఆలుగడ్డలు, గోధుమలను ఇక్కడే కొనుగోలు చేయాలన్నారు. ఇందుకోసం స్థానిక రైతులను ప్రోత్సహించాలని కోరారు. అప్పుడే రైతులు ఆర్థికంగా ఎదుగుతారన్నారు.

కాళేశ్వరం ద్వారా 10 టీఎంసీల నీరు..
ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఒకటైన కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను తక్కువ సమయంలో పూర్తి చేసి నీటి వనరుల్లో విప్లవం సాధించామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దీనితో సాగునీరు, తాగునీటికి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ద్వారా పరిశ్రమలకు 10 టీఎంసీల నీటిని అందిస్తున్నామని తెలిపారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్న ఘనత తెలంగాణకే దక్కుతుందని, మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను బాగు చేశామని వివరించారు. పాడిపంటలతోనే రాష్ట్రం సుభిక్షం అవుతుందని, అందుకు అనుగుణంగా సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు.

20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్: పాడి అభివృద్ధికి కృషి చేయడంతో పాటు విజయ డెయిరీ ద్వారా పాల ఉత్పత్తులను కూడా పెంపొందిస్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ కోసం ప్రత్యేకంగా సెజ్‌ను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందేనని అన్నారు. రాష్ట్రంలో విస్తృతంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని, వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా ఇతర దేశాల నుంచి వంట నూనెల దిగుమతిని తగ్గించడానికి చర్యలు చేపట్టామని వివరించారు. ఇక్కడ ఏర్పాటు అవుతున్న పరిశ్రమలకు స్థానికులు, నాయకులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలతాశేఖర్ గౌడ్, సర్పంచ్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మైనారిటీ గురుకుల దరఖాస్తుల గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీలో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లతో పాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగించినట్లు మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ సెక్రెటరీ షఫీవుల్లా ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సలహాలు, సూచనల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 040–23437909లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఫిబ్రవరి 3 వరకు గ్రూప్‌-4 దరఖాస్తుల స్వీకరణ

గడువు తేదీని పొడిగించిన టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) గ్రూప్‌–4 ఆశావహులకు శుభవార్త. దరఖాస్తుల స్వీకరణ గడువును ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గత డిసెంబర్ 30వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకాగా జనవరి 30వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉన్న విషయం తెలిసిందే. గ్రూప్‌–4 కేటగిరీలో మరికొన్ని కొలువులు జతచేస్తూ అనుబంధ ప్రకటన విడుదల చేయడం, అభ్యర్థుల నుంచి వినతులు రావడంతో గడువును పొడిగిస్తూ టీఎస్‌పీఎస్సీ నిర్ణయం తీసుకుంది. గ్రూప్‌–4 ఉద్యోగాల కోసం ఇప్పటివరకు 8,47,277 దరఖాస్తులు వచ్చాయి. ఆదివారం 49 వేలు, సోమవారం 34,247 దరఖాస్తులు వచ్చాయి. మరో నాలుగు రోజులు గడువు ఉండటంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు టీఎస్‌పీఎస్సీ వర్గాలు భావిస్తున్నాయి.

మరో ఆరు డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు డాక్టర్‌పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్‌ఇచ్చింది. వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) పరిధిలోని ఈఎన్టీ విభాగంలో 3 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మరో 3 స్పీచ్‌పాథాలజిస్టులను నియమించనుంది. మెడికల్‌రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీ జరగనుంది. మరిన్ని వివరాలకు తమ బోర్డు వెబ్ సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

'అంతర్జాతీయ' సౌకర్యాలతో జీస్క్వేర్ హౌసింగ్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ శ్రేణి సౌకర్యాలు, ఫీచర్లను తమ వినియోగదారులకు అందించడమే జీస్క్వేర్ హౌసింగ్ లక్ష్యమని సంస్థ సీఈవో ఎన్.ఈశ్వరన్ అన్నారు. జీస్క్వేర్ ప్లాట్ ప్రాజెక్టులు విస్తృత శ్రేణి ఫీచర్లు, సేవలందిస్తాయని, ఈ ప్లాట్స్ ప్రైమ్ లొకేషన్స్‌లో గేటెడ్ ప్లాట్ కమ్యూనిటీలుగా ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు. భూగర్భ విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలతో పాటుగా అంతర్గత బ్లాక్ టాప్ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, ల్యాండ్‌స్కేపింగ్ వంటి సదుపాయాలుంటాయని వివరించారు. త్వరలోనే ఉత్తర భారతదేశంలో కూడా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ప్లాట్ ప్రమోటర్ జీస్క్వేర్ హౌసింగ్ ఇటీవలే దక్షిణ భారతదేశంలో రెండు ముఖ్య నగరాలు హైదరాబాద్, మైసూరులకు విస్తరించిందన్నారు.



మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కచవాని సింగారంలోని ప్రకృతి వనం

ప్రకృతి వనం... ఆక్సి'జనం'

కాలుష్య నియంత్రణ కోసం నగర శివారులో సరికొత్త ప్రయోగం

వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి నుంచి ఉపశమనం

శివారుల్లో 1,541 పట్టణ, పల్లె ప్రకృతి వనాలు

అర ఎకరం నుంచి 4 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగరీకరణ శరవేగంగా పెరుగుతోంది. దీంతోపాటే కాలుష్యమూ పెచ్చుమీరుతోంది. దీంతో తలెత్తుతున్న అనారోగ్య సమస్యలతోపాటు ఉద్యోగ, వ్యాపారాల్లో ఎదురవుతున్న మానసిక ఒత్తిళ్లు సరేసరి. వీటితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులకు చక్కటి సాంత్వన కల్పిస్తున్నాయి ప్రకృతి వనం, లంగ్స్ స్పేస్. హరితహారంలో భాగంగా ఆహ్లాదం, ఆరోగ్యాన్ని పంచేందుకు ప్రభుత్వం సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. గ్రేటర్ తోసహా శివారు పట్టణాలు, సెమీఅర్బన్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే లక్షలాది మొక్కలు నాటిన సర్కారు పల్లె, పట్టణ ప్రకృతి వనాలను పెంచుతోంది. వీటిలో వాకింగ్ పాత్‌లు, చిల్డ్రన్ కార్నర్స్ ఏర్పాటుచేయడంతో పాటు ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ప్రత్యేక ఏర్పాటుచేస్తోంది.

80 లక్షల వాహనాలు... ఎన్నో పరిశ్రమలు

గ్రేటర్ పరిధిలో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో వాయు కాలుష్యం అవధులు దాటుతోంది. సుమారు 80 లక్షల మేర ఉన్న వాహనాలు వెదజల్లుతున్న పొగతో 'సిటీ'జన్ల ముక్కుపుటాలు, శ్వాసకోశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. పలుప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగలబెట్టడంతో కాలుష్య తీవ్రత మరింత పెరుగుతోంది. వీటికితోడు పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంతో సమీప ప్రాంతాలు పొగచూరుతున్నాయి. ఫలితంగా పీల్చే గాలిలో సూక్ష్మధూళికణాలు చేరి సమీప ప్రాంతాల్లోని ప్రజల ఊపిరితిత్తుల్లోకి చేరుతున్నాయి. ఘనపు మీటరు గాలిలో సూక్ష్మధూళికణాల (పీఎం 2.5) మోతాదు 40 మైక్రోగ్రాములకు మించరాదు. కానీ పలు కూడళ్లలో అంతకు రెట్టింపు స్థాయిలో ధూళికాలుష్యం నమోదవుతోంది.

పుర, పంచాయతీల్లో వనాలు

పుర, పంచాయతీల్లో అర ఎకరం నుంచి 4 ఎకరాల పరిధిలో ప్రకృతి వనాలను ఏర్పాటుచేశారు. గ్రేటర్ శివారు (మేడ్చల్ జిల్లా + రంగారెడ్డి జిల్లా)లోని 29 పురపాలక సంఘాల్లో 595 పట్టణ ప్రకృతి వనాలున్నాయి. వీటిని పురపాలక సంఘాలు నిర్వహిస్తున్నాయి. అలాగే, 619 పంచాయతీల పరిధిలో 946 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి ఎకరాకు 2,500 మొక్కల చొప్పున పెంచారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రకృతి వనాలు..

రంగారెడ్డి జిల్లాలో:	
16 పురపాలక సంఘాల్లో ఉన్నవి	380
558 పంచాయతీల్లో ఉన్నవి	867
మేడ్చల్‌-మల్కాజిగిరిలో:	
13 పురపాలక సంఘాల్లో ఉన్నవి	215
61 పంచాయతీల్లో ఉన్నవి	79
మొత్తం	1,541

నిర్మాణ వ్యయం ఎంత?

ఒక్కో ప్రకృతి వనానికి రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షలు

ఒక్కో లంగ్స్ స్పేస్‌కు: రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు

లంగ్స్ స్పేస్ ఎక్కడెక్కడ?



హైదరాబాద్ శివారుల్లో ఏడు అర్బన్ లంగ్స్ స్పేస్‌లున్నాయి.

- → మేడిపల్లి ఫారెస్టు బ్లాకులో 100 ఎకరాల్లో శాంతివనం
- → దూలపల్లి ఫారెస్టు బ్లాకులోని ప్రశాంత వనం
- → నారపల్లిలోని భాగ్యనగరం నందన వనం
- → బహదూర్‌పల్లి ఫారెస్టు బ్లాకులోని 50 ఎకరాల్లో
- → నాగారం ఫారెస్టు బ్లాకులోని 70 ఎకరాల్లో..
- → నారపల్లి–పర్వతాపూర్ ఫారెస్టు బ్లాకులోని 60 ఎకరాల్లో..
- → కండ్లకోయలోని ఆక్సిజన్ పార్కు

హైదరాబాద్‌లో ఏడాదికి సగం రోజులకుపైగా కాలుష్యం నమోదవుతున్న ప్రాంతాలు

- → బాలానగర్, ఉప్పల్, జూబ్లీహిల్స్, చార్మినార్, ప్యారడైజ్, జూపార్క్, పంజగుట్ట, కూకట్‌పల్లి, చిక్కడపల్లి, ఎంజీబీఎస్

మరిన్ని అభివృద్ధి చేస్తాం



నగర శివారుల్లో పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, లంగ్స్ స్పేస్‌లను మరింత అభివృద్ధి పరుస్తాం. ఇందు కోసం ప్రభుత్వ భూములను కూడా గుర్తిస్తున్నాం. పెరుగుతున్న జనాభా, నగరీకరణ నేపథ్యంలో వీటి అవసరం ఎంతో ఉంది. పెరుగుతున్న కాలుష్యం కట్టడికి ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయి.

– డా.ఎస్. హరీశ్, మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్

స్వచ్ఛమైన గాలి..



ప్రకృతి వనాలు, లంగ్ స్పేస్‌లు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయి. కాలుష్యం బారి నుంచి రక్షిస్తున్నాయి. సెలవు రోజుల్లో కుటుంబ సభ్యులతో కలిసి వెళుతున్నాం. రోజంతా అక్కడే ఉండాలనిపిస్తుంది.

– కె. ఆంజనేయులు, పోచారం

గొప్ప ఉపశమనం..



నారపల్లి–పర్వతాపూర్‌లోని 60 ఎకరాల్లో ఉన్న అర్బన్ లంగ్స్ స్పేస్ పిల్లలతోపాటు పెద్దలనూ ఆహ్లాదపరుస్తోంది. నగరానికి సమీపంలో ఉండటం వల్ల ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు వస్తారు. ఆటపాటలతో అందరూ ఆనందంలో మునిగితేలుతారు.

–పి. రవికిరణ్, పీర్జాదిగూడ

టీచర్ల బదిలీల దరఖాస్తుకు మరికొంత గడువు

- ఫిబ్రవరి 1 వరకు పొడిగించిన ప్రభుత్వం
- అన్నీ పూర్తయ్యాకే ఎస్జీటీ స్పౌజ్‌ల బదిలీలు
- అవసరమైతే డిప్యూటేషన్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీల కోసం దరఖాస్తు గడువును పొడిగించారు. వాస్తవానికి ఈ గడువు సోమవారంతో ముగిసింది. అయితే ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు ఫిబ్రవరి 1వ తేదీ వరకు గడువును పెంచారు. షెడ్యూల్‌లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. టీచర్లు దరఖాస్తు చేసిన తర్వాత హెచ్ఎంలు.. వాటిని డీఈవోలకు సమర్పించే మూడు రోజుల కాలపరిమితిని కుదించనున్నారు. ఈ నెల 28 నుంచి బదిలీల ప్రక్రియ మొదలైనా, తొలి రోజు పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఇబ్బందుల వల్ల టీచర్లు తికమక పడ్డారు. కొన్ని ఆప్షన్లు తెరుచుకోలేదు. మరికొన్ని అప్‌గ్రేడ్ కాలేదు. మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలూ ఎదురైనట్టు వార్తలు వచ్చాయి. దీంతో దరఖాస్తు గడువును పొడిగించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి.

ఇప్పటికే 55 వేల మంది

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 55,479 మంది టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎక్కువగా నల్లగొండ (3,423), రంగారెడ్డి (3,034), నిజామాబాద్ (3,247), సంగారెడ్డి (3,042) దరఖాస్తులు అందినట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అత్యల్పంగా దరఖాస్తులు అందిన జిల్లాల్లో హనుమకొండ (635), జయశంకర్ భూపాలపల్లి (500), ములుగు (379) ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 వేల మంది టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో 20 వేల వరకూ అప్లికేషన్లు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు, సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎస్జీటీ స్పౌజ్‌ల సంగతి ఆఖరునే

వివిధ జిల్లాల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ దంపతుల (ఎస్జీటీ స్పౌజ్‌లు) బదిలీ విషయాన్ని ఆఖరులో పరిశీలించే వీలుందని అధికారులు చెబుతున్నారు. 317 జీవో కారణంగా వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిన టీచర్లు రెండు వేలకు పైగా ఉన్నారు. వీరిలో 615 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీకి అవకాశం కల్పించారు. కాగా, హెచ్ఎంల పదోన్నతి, స్కూల్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత ఎస్జీటీల బదిలీల ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. అవసరమైతే డిప్యూటేషన్ ఇచ్చైనా సరే వారి ప్రాంతాలకు పంపాలని నిర్ణయించినట్టు ఓ అధికారి తెలిపారు.

'అధ్యక్షులు' అసెంబ్లీకే!

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే చర్చ ప్రారంభమైంది.

ఈసారి కూడా గజ్వేల్ నుంచే..

సీఎం కేసీఆర్ ఈసారి కూడా గజ్వేల్ నియోజకవర్గం నుంచే అసెంబ్లీకి పోటీ చేయనున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెపుతున్నాయి. జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఖచ్చితంగా పోటీ చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపించే నాటికి రాజకీయ సమీకరణల ప్రకారం అవసరమైతే మెదక్ నుంచి ఆయన లోక్‌సభకు పోటీ చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి ఈసారి దుబ్బాక అసెంబ్లీకి పోటీ చేయనుండడం, పార్టీ ఏర్పాటైన నాటి నుంచి మెదక్ ఎంపీ స్థానం టీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న నేపథ్యంలో అవసరమనుకుంటే కేసీఆర్ అక్కడి నుంచే పోటీ చేస్తారని అంటున్నారు.

రసకందాయంలో కొడంగల్

రేవంత్‌రెడ్డి గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన కొడంగల్ స్థానం నుంచే పోటీ చేస్తారనే భావన కాంగ్రెస్ వర్గాల్లో ఉండేది. అయితే బీఆర్ఎస్ అసంతృప్త నేత, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి కాంగ్రెస్ గూటిలో చేరడంతో అక్కడ రాజకీయం ఆసక్తికరంగా మారింది. గుర్నాథ్‌రెడ్డి లేదా ఆయన కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి బరిలో ఉంటారని, ఈ ఒక్కసారి తమకు అవకాశమివ్వాలని వారు కోరుతున్నారనే చర్చ జరుగుతోంది. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి హైదరాబాద్ చుట్టుపక్కల పోటీచేస్తే ఇతర నియోజకవర్గాలపై కూడా కొంత ప్రభావం ఉంటుందని, మాస్ క్రేజ్ ఉన్న నాయకుడిగా ఆయన మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోని ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే బాగుంటుందనే చర్చ జరుగుతోంది. దీంతో కొడంగల్ కాకుంటే ఎల్బీనగర్ లేదా ఉప్పల్ అసెంబ్లీ స్థానాల నుంచి రేవంత్ పోటీ చేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కరీంనగర్ అసెంబ్లీపై బండి కన్ను!

బండి సంజయ్ ప్రస్తుతం కరీంనగర్ ఎంపీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే తాను ఈసారి కరీంనగర్ అసెంబ్లీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన సంకేతాలిచ్చారు. ఆ మేరకు కరీంనగర్ నుంచే పోటీ చేస్తారా? లేక వేములవాడ నుంచా? అనే చర్చ బీజేపీలో జరుగుతోంది. అయితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా వారంలో ఒకరోజు కరీంనగర్‌లో అందుబాటులో ఉండేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండడంతో కరీంనగర్ అసెంబ్లీ బరిలో నిలుస్తారనే చర్చ ఊపందుకుంది.

పాలేరు నుంచి తమ్మినేని, కొత్తగూడెం నుంచి కూనంనేని

వామపక్షాల విషయానికొస్తే.. ఆ పార్టీలకు బీఆర్ఎస్‌తో పొత్తు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులిద్దరూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రెండు జనరల్ స్థానాల నుంచి పోటీకి దిగుతారనే చర్చ జరుగుతోంది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి పోటీ చేస్తారనే చర్చ జరుగుతోంది.

కోదండరాం, ప్రవీణ్‌కుమార్, షర్మిల కూడా..

టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం ఈసారి అసెంబ్లీ బరిలో ఉండాలా వద్దా అనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కానీ ఆయన పోటీ చేయాల్సిందేనని పార్టీ నేతలు పట్టుబడుతున్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గమైన మంచిర్యాల లేదంటే సికింద్రాబాద్, ఉప్పల్ స్థానాల్లో ఏదో ఒక చోట నుంచి ఆయన పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉమ్మడి మహబూబ్‌నగర్ (సొంత జిల్లా) పరిధిలోని ఆలంపూర్, లేదంటే అచ్చంపేట నుంచి పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఇక వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల.. తాను ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇలావుండగా ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ మాత్రం మరోసారి హైదరాబాద్ లోక్‌సభకే పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఇంటర్ బోర్డు భద్రత వ్యవస్థ ట్యాంపర్

- బోర్డు అధికారిని భయపెట్టి పాస్‌వర్డ్‌ను తస్కరించారు
- సూత్రధారులెవరో దర్యాప్తులో తేలుతుంది
- ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రయోజనకరమే
- బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న నవీన్ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ బోర్డులో భద్రత వ్యవస్థ ట్యాంపరింగ్‌కు గురైందని, కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేశారని బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ వెల్లడించారు. బోర్డులో అత్యంత కీలకమైన సీసీ కెమెరా లకు సంబంధించిన పాస్‌వర్డ్ చోరీ అయిందని తెలియడంతో అప్రమత్తమైనట్టు తెలిపారు. ఈ విషయం గుర్తించిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దీని వెనుక సూత్రధా రులెవరో, ఏ అవసరాల కోసం ఈ కుట్రకు పాల్పడ్డారో దర్యాప్తులో తేలుతుందన్నారు. నేర చరిత్ర ఉన్న ఓ వ్యక్తి బోర్డు అధికారిని బెదిరించి, భయపెట్టి పాస్‌వర్డ్‌ను తస్కరించినట్టు ప్రాథమికంగా తెలిసిందన్నారు. దీనిపై శాఖాపరమైన విచారణకు ఆదేశాలిచ్చినట్టు మిత్తల్ వెల్లడించారు.

ఆన్‌లైన్ మూల్యాంకనం పూర్తి పారదర్శకం

అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే ఈ ఏడాది నుంచి ఇంటర్ సమా ధాన పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడుతున్నట్టు మిత్తల్ తెలిపారు. దీనివల్ల మూల్యాంకనం పారదర్శకంగా ఉండటంతోపాటు తప్పుల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. గతంలో విద్యార్థి రీవ్యాల్యూయేషన్ కోరితే జిల్లాల నుంచి పేపర్లు తెప్పించడంలో తీవ్ర జాప్యం జరిగేదని, ఇప్పుడు ఆన్‌లైన్ చేయడం వల్ల వేగవంతంగా పూర్తవుతుందని చెప్పారు. పేపర్లు దిద్దేవారికి ఇచ్చే టీఏ, డీఏ ఖర్చునూ నివారించవచ్చన్నారు. ఇప్పటికే అన్ని దేశాలూ, విశ్వవిద్యా లయాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయని, ఆన్‌లైన్ మూల్యాంకనం కోసం అధ్యాపకులకు అవసరమైన శిక్షణ కూడా ఇస్తామని వివరించారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా ఆర్ట్స్, కామర్స్, లాంగ్వేజ్‌లకు సంబంధించిన 35 లక్షల పేపర్లను ఆన్‌లైన్ ద్వారా వ్యాల్యుయేషన్ చేస్తున్నామని, రెండేళ్లలో ఈ విధానాన్ని పూర్తిగా విస్తరిస్తామన్నారు. గతంలో జరిగిన విధానంలో ప్రైవేటు కాలేజీలు సమాధాన పత్రాలు ఎక్కడకు వెళ్తున్నాయో తెలుసుకుని వారికి అనుకూలమైన విధానాలు అనుసరించారనే ఆరోపణలున్నాయని, ఇలాంటివి ఇప్పుడు సాగవనే ఉద్దేశంతో ఏసీబీ కేసులున్న ఓ వ్యక్తి పనిగట్టుకుని బోర్డు ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాడని మిత్తల్ చెప్పారు.

మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డిపై సోమవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇంటర్మీడియెట్ బోర్డు ప్రధాన కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి ఓ కంప్యూటర్‌లో పాస్‌వర్డ్స్ మార్చినట్లు ఇంటర్‌బోర్డు ఉప సంచాలకులు ఈ నెల 28న మధుసూదన్ రెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ శంకర్ చెప్పారు. ఘటనాస్థలికి వెళ్లి విచారణ జరిపిన అనంతరం ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీడీ పోస్టులకు అనుమతించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఎడ్యుకేషన్ జారీ చేసిన పీడీ పోస్టుల పరీక్షకు అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన 192 మందిని పీడీ పోస్టు పరీక్ష రాసేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే తాము వెల్లడించే వరకు ఫలితాలు విడుదల చేయవద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చి 13కు వాయిదా వేసింది. ఎంపీఈడీ పూర్తిచేసిన తమను ఇంటర్ ఎడ్యుకేషన్ జారీ చేసిన పీడీ పోస్టుల పరీక్ష రాసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తికి చెందిన ఆర్.శ్రీనుతో పాటు మరో 191 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పోస్టులకు గత నెల నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం.. ఎంపీఈడీతోపాటు పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారు మాత్రమే అర్హులని పేర్కొంది. ఇది చట్టవిరుద్ధమని.. డిగ్రీ పూర్తి చేసిన తమను పరీక్ష రాసేందుకు అనుమతించాలని, ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను కొట్టివేయాలని అభ్యర్థులు హైకో ర్టును ఆశ్ర యించారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున రవిచందర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మా సనం.. పరీక్ష రాసేందుకు పిటిషనర్లకు అను మతి ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.

ఏఓ పోస్టు దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సహకార శాఖ పరిధిలోని అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణను ఫిబ్రవరి 2 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు టీఎస్‌పీఎస్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పరిపాలనకు సంబంధించిన కారణాల వల్ల తేదీ పొడిగించినట్లు వివరించింది. పూర్తి వివరాల కోసం కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది

నేడు వెబ్‌సైట్‌లో సీడీపీఓ పరీక్ష తుది కీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో శిశు సంక్షేమాధికారి (సీడీపీఓ, ఏసీడీపీఓ), వేర్ హౌజ్ శాఖ పరిధిలో మేనేజర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్ష తుది కీని టీఎస్‌పీఎస్సీ ఖరారు చేసింది. సోమవారం కమిషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తుది కీని మంగళవారం కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

రైతు ఆత్మహత్యలపై విష ప్రచారం

- రైతుబంధు భూస్వాములకు అంటూ ప్రచారం చేస్తున్నారు
- ఎమ్మెల్సీ పల్లా, ప్రభుత్వ విప్ గువ్వల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ సంబంధ రైతు ఆత్మహత్యలు లేకున్నా కొందరు విష ప్రచారం చేస్తూ లేనివి ఉన్నట్లుగా చిత్రీకరిస్తున్నారని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వంపై గుడ్డి వ్యతిరేకతతోనే తప్పుడు ప్రచారం చేస్తూ నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో లెక్కలను కూడా వక్రీకరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విప్‌లు గువ్వల బాలరాజు, ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్‌తో కలిసి ఆయన సోమవారం బీఆర్ఎస్ శాసనసభా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా చెప్పిందని, 2014 నుంచి ఇప్పటి వరకు 400 శాతం మేర రైతు ఆత్మహత్యలు తగ్గాయని పల్లా అన్నారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు జీరో స్థాయికి చేరుకున్నా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పదివేల ఆత్మహత్యలు జరిగాయంటూ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలతో రైతు ఆత్మహత్యలు తగ్గాయని, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం తెలంగాణలో వ్యవసాయం నంబర్ వన్ స్థానానికి చేరుకుందన్నారు. రైతుబంధు పథకం భూస్వాములకే దక్కుతోందంటూ కొందరు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రవీణ్ డబ్బులు కూడబెట్టుకున్నారు: గువ్వల

విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు ప్రభుత్వం అప్పజెప్పిన బాధ్యతను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దుర్వినియోగం చేశారని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఆరోపించారు. స్వేరో వ్యవస్థను సృష్టించి తన భవిష్యత్తు రాజకీయాల కోసం డబ్బులు కూడబెట్టుకున్నారని, ఆయన నోట నీతులు, సిద్ధాంతాలు రావడం విడ్డూరంగా ఉందన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ప్రవీణ్ కుమార్ ఎవరికి వత్తాసు పలికారో అందరికీ తెలుసని, కాన్షీరాం సిద్ధాంతాలకు మాయావతి తిలోదకాలు ఇచ్చినట్లే ప్రవీణ్ కుమార్ బీజేపీకి మద్దతు ఇస్తున్నారన్నారు. దళితుల కోసం పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేసే హక్కు ఆయనకు లేదన్నారు.

5 రకాల పోస్టులకు అర్హత పరీక్షల తేదీలు

పోస్టు	ఖాళీలు	పరీక్ష విధానం	పరీక్ష తేదీ
అగ్రికల్చర్ ఆఫీసర్	148	కంప్యూటర్ బేస్డ్ టెస్ట్	25-04-2023
డ్రగ్ ఇన్‌స్పెక్టర్	18	కంప్యూటర్ బేస్డ్ టెస్ట్	07-05-2023
పాలిటెక్నిక్ లెక్చరర్	247	ఓఎంఆర్ బేస్డ్ టెస్ట్	13-05-2023
ఫిజికల్ డైరెక్టర్	128	కంప్యూటర్ బేస్డ్ టెస్ట్	17-05-2023
లైబ్రేరియన్	71	కంప్యూటర్ బేస్డ్ టెస్ట్	17-05-2023

వారంలోగా పోడు పట్టాలు: సత్యవతిరాథోడ్

సాక్షి, హైదరాబాద్: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు వారంలోగా పట్టాలు సిద్ధం చేసి పంపిణీ చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఫిబ్రవరిలో పోడు రైతులకు పట్టాల పంపిణీని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు లక్ష్యంగా నిర్దేశించినట్లు వెల్లడించారు. ఈమేరకు అన్ని రకాల ఏర్పాట్లు వారంలోగా పూర్తి చేసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. పోడు రైతులకు పట్టాల పంపిణీపై సోమవారం అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో బీఆర్‌కేఆర్ భవన్ నుంచి జిల్లా కలెక్టర్లతో సత్యవతి రాథోడ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పోడు భూములకు పట్టాలిస్తామన్నారు.

గవర్నర్ వ్యవస్థపై చర్చ జరగాల్సిందే

బీఆర్ఎస్ ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు





సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని గవర్నర్ వ్యవస్థపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరగాలని బీఆర్ఎస్ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావులు పాల్గొని పార్టీ వైఖరిని కేంద్ర ప్రభుత్వానికి తెలియచేశారు. అనంతరం వీరిద్దరూ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కోసం కోర్టు సహాయం కోరాల్సి రావడం వంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ ఎదురుకాలేదన్నారు. బడ్జెట్‌కు ఆమోదం తెలపకుండా గవర్నర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ, ఢిల్లీ, తమిళనాడు, కేరళసహా అనేక రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు గవర్నర్ వ్యవస్థతో ఇబ్బందులు పడుతున్నాయని.. అందువల్ల గవర్నర్ వ్యవస్థతో పాటు సమాఖ్య వ్యవస్థపై పార్లమెంట్‌లో చర్చ జరగాలన్నారు. అంతేగాక అఖిలపక్ష సమావేశంలో రైతుల పంటల మద్దతు ధర రెట్టింపు చేయలేదన్న అంశంతో పాటు, నిరుద్యోగం అంశంపైనా చర్చ జరగాలని కోరామన్నారు. వీటితో పాటు పార్లమెంట్ సమావేశాలు కేవలం బిల్లుల ఆమోదం కోసం ఏర్పాటు చేయడం కాదని... ప్రజా సమస్యలతో పాటు దేశంలోని అనేక సమస్యలపై చర్చ జరపాలని కోరామని కేకే, నామా తెలిపారు. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన సమస్యలను పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో లేవనెత్తి పోరాడతామని పేర్కొన్నారు.

ఇబ్బందులు సృష్టించడం సరికాదు: గుత్తా



విలేకరుల సమావేశంలో పోచారం, గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ప్రజాస్వామ్య వ్యవస్థను అందరమూ గౌరవించాలి. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వ్యవహరించడం సరైనది కాదు. గవర్నర్, ప్రభుత్వం, శాసనమండలి, శాసనసభలు రాజ్యాంగానికి లోబడి ఒకరినొకరు గౌరవిస్తూ నడుచుకోవాలి' అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గవర్నర్‌కు, ప్రభుత్వానికి మధ్య నెలకొన్న సమస్యలు దివంగత జాతిపిత మహాత్మాగాంధీ ఆశీస్సులతో సద్దుమణుగుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం శాసనసభ ఆవరణలో గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. గాంధీ విగ్రహం వద్ద సుఖేందర్‌రెడ్డితో పాటు శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, ఫారూక్ హుస్సేన్, బండా ప్రకాశ్ ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ మహాత్ముడి బోధనల వెలుగులోనే సాధ్యం. ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య వ్యవస్థను కాపాడుకునే బాధ్యత దేశ పౌరులందరిపైనా ఉంది. వక్రబుద్ధితో ఆలోచించే నాయకులకు ఆ మహనీయులు మంచి బుద్ధిని ప్రసాదించాలని ఆశిస్తున్నా' అని గుత్తా వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో తెలంగాణ లెజిస్లేచర్ సెక్రెటరీ నరసింహాచార్యులు, బీఆర్ఎస్ఎల్పీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి

మంగళవారం, జనవరి, 31

కొత్త పొద్దుపొడుపు

అవును... భారత క్రికెట్‌లో ఇది కొత్త పొద్దుపొడుపు. దక్షిణాఫ్రికాలో మహిళల తొలి అండర్–19 టీ20 వరల్డ్ కప్‌లో ఆదివారం సాయంత్రం భారతీయ బాలికలు ఇంగ్లండ్ జట్టును మట్టికరిపించి, ప్రపంచ విజేతలుగా నిలిచిన క్షణాలు అలాంటివి. షఫాలీ వర్మ సారథ్యంలో తెలుగమ్మాయి సునీత గొంగడి సహా 15 మంది సభ్యుల టీనేజ్ బాలికల జట్టు తమ విజయంతో దేశ మహిళా క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, స్వయంగా దక్షిణాఫ్రికాకు వచ్చి ఫైనల్‌కు ముందు స్ఫూర్తి నింపిన ఒలింపిక్స్ జావెలిన్ త్రో ఛాంపియన్ నీరజ్ చోప్రా సహా అందరి ఆశలనూ, అంచనాలనూ నిజం చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో పురుషులకు సమానంగా మహిళలకూ వేతనమివ్వాలని గత అక్టోబర్ చివరలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించిన వేళ... తాజాగా మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఏర్పాటైన క్షణాన... వీస్తున్న మార్పు పవనాలకు ప్రపంచ కప్ సాధన ఓ కొత్త జోడింపు.

సరిగ్గా 40 ఏళ్ళ క్రితం 1983లో పురుషుల ప్రపంచ కప్‌లో భారత క్రికెట్ జట్టు అనూహ్య విజయం సాధించింది. ఆ తర్వాత భారత క్రికెట్ మరింత మెరుగైన రీతిలో సమూలంగా మారిపోయింది. తాజాగా మన బాలికలు సాధించిన విజయం మన మహిళా క్రికెట్‌కు సరిగ్గా అలాంటి ఉత్ప్రేరకమే. గతంలో మన మహిళా క్రికెట్ జట్టు ఒకటి కన్నా ఎక్కువ సార్లే ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరింది. అయితే, ఏ ఫార్మట్‌లోనైనా మన మహిళా క్రికెటర్లు వరల్డ్ కప్ సాధించడం ఇదే తొలిసారి. బీసీసీఐ మహిళా క్రికెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన సమయంలో ఈ విజయం ఒక కొత్త ఉత్సాహం, ఊపునిచ్చాయి.

విరాట్ కోహ్లీ తదితరులది ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) తరం కాగా, షఫాలీ వర్మ సారథ్యంలోని అండర్–19 వరల్డ్ ఛాంపియన్ బాలికలను రానున్న డబ్ల్యూపీఎల్ (ఉమెన్స్ ఇండియన్ ప్రీమియర్ లీగ్) తరం అనుకోవచ్చు. 2008 బాలుర అండర్–19 వరల్డ్ కప్‌లో కోహ్లీ బృందం ఇలాగే విజయం అందుకుంది. అదే సమయంలో ఐపీఎల్ రావడంతో రాత్రికి రాత్రి పలువురు లక్షాధికారులయ్యారు. ఆటకు అవతార మూర్తులై, ఇంటింటా పాపులర్ అయ్యారు. భారత క్రికెట్ స్వరూప స్వభావాలే మారిపోయాయి. ఇప్పుడు మన బాలికల జట్టు ప్రపంచ ఛాంపియన్లుగా అవతరించిన సమయానికి డబ్ల్యూపీఎల్ కొత్తగా వచ్చింది. త్వరలో తొలి డబ్ల్యూపీఎల్ వేలంతో ఈ క్రికెటర్లలో కొందరు లక్షాధికారులు కానున్నారు. కష్టాలు కడతేరి, ఆర్థిక, సామాజిక హోదా మారిపోనుంది. ఈ మ్యాచ్‌ల ప్రసార హక్కులు, పలు ఫ్రాంఛైజీల బిడ్లు దాదాపు రూ. 5.5 వేల కోట్ల పైగా పలికినట్టు వార్త. మహిళా క్రికెట్‌కు ఇవి బంగారు క్షణాలంటున్నది అందుకే.

అయితే, ఎన్ని లీగ్‌లు వచ్చినా అంతిమంగా అగ్రభాగాన నిలిపేది ప్రతిభే. భారత అండర్–19 బాలికల క్రికెట్ జట్టు ఈ ఐసీసీ వరల్డ్ కప్‌లో మొదటి నుంచి తన సత్తా చాటుతూ వచ్చింది. ఎప్పటికప్పుడు ఆట మెరుగుపరుచుకుంటూ ఆస్ట్రేలియా (ప్రాక్టీస్ మ్యాచ్‌లో) సహా అనేక జట్లను అధిగమించి, ఫైనల్స్‌కు చేరింది. కప్ సాధించింది. మన బాలికల క్రికెట్ ఈ వరల్డ్ కప్ ఘనత సాధించడం వెనుక ఆటగాళ్ళతో పాటు పలువురి పాత్ర ఉంది. జాతీయ క్రికెట్ అకాడెమీ (ఎన్సీఏ) శ్రద్ధ, మహిళా కోచ్ నూషిన్ అల్ ఖదీర్ అసాధారణ అంకితభావం లాంటివి అండగా నిలిచాయి. పద్దెనిమిదేళ్ళ క్రితం వరల్డ్ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత సీనియర్ మహిళా జట్టులో సభ్యురాలైన నూషిన్ ఆకలిగొన్న పులిలా బరిలోకి దిగి, ఈ టీనేజ్ బాలికలను తీర్చిదిద్దారు. పోటీలోని వివిధ జట్ల క్రికెటర్ల కన్నా ప్రతిభావంతులుగా నిలిపారు.

ఈ ప్రతిభాపాటవాలు భారత మహిళా క్రికెట్ భవిష్యత్తుకు బలమైన పునాది. కాలగతిలో సీనియర్ల స్థానాన్ని భర్తీ చేసే సామర్థ్యంతో బాలికలు ఉరకలెత్తుతున్నారు. దేశంలో మహిళా క్రికెట్ ప్రమాణాలు మెరుగవుతున్నాయనడానికి ఇది ఓ సూచన. నిజానికి, అర్ధశతాబ్ద కాలంలో మన మహిళా క్రికెట్ అనేక శృంఖలాలు తెంచుకొంది. పంజరాలను దాటింది. సామాన్య స్థాయి నుంచి అసామాన్యతకు ఎదిగింది. గడచిన రెండు సీనియర్ల టీ20 వరల్డ్ కప్‌లలో మన మహిళా జట్టు సెమీ ఫైనలిస్టుగా, ఫైనలిస్టుగా నిలిచింది. దక్షిణాఫ్రికాలో ఈ తొలి అండర్–19 టీ20 కప్‌లో బాలికలు ఏకంగా విజేతలయ్యారు. ఇది వారి జీవితాల్లోనే కాదు... మొత్తం భారత మహిళా క్రికెట్ చరిత్రలోనే కీలక మలుపు.

దేశంలో ఆడపిల్లలకు ప్రత్యేక క్రికెట్ అకాడెమీలు వెలుస్తున్న రోజులివి. ఈ విజయం వాటికి కొత్త ఉత్తేజం. విజేతలకు ఆత్మవిశ్వాసం పెంచే ఔషధం. పురుషులకు భిన్నంగా తగిన పారితోషికం లేకున్నా, ఇంటా బయటా అవమానాలు ఎదురైనా, ఆర్థిక – సామాజిక అవరోధాలున్నా – అవన్నీ దాటుకొని వచ్చిన స్త్రీలు కాబట్టి తాజా విజయం మరింత గొప్పది. ఇది... కూతురు సోనా యాదవ్ క్రికెట్ షూస్ కోసం అదనపు షిఫ్టులు పనిచేసిన గ్లాస్ ఫ్యాక్టరీ కార్మికుడు, ఆడబిడ్డ త్రిష శిక్షణ కోసం ఉద్యోగం వదిలి భద్రాచలం నుంచి హైదరాబాద్ మారిన తండ్రి... ఇలా ఎందరో తల్లితండ్రుల త్యాగఫలం. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే వారు కుటుంబానికే కాదు... దేశానికీ ఎంతటి పేరు తెస్తారో చెప్పడానికి ఇది తాజా దర్పణం. బ్యాడ్మింటన్ తర్వాత భారత మహిళా క్రీడాంగణంలో ఇక క్రికెట్ కొత్త దీపశిఖ. దీన్ని మరింత ప్రజ్వరిల్లేలా చేయాల్సింది ఆటల సంఘాలు, అధికారంలోని పెద్దలే.

ముంచే గాలివాటు రాజకీయాలు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ఆంధ్రప్రదేశ్ గత శాసనసభ ఎన్నికల్లో 'బింకానికి' పోయి రెండు చోట్ల నిలబడి, ఘోరాతిఘోరమైన ఓటమి పాలయ్యాడు పవన్ కల్యాణ్. పరువూ పోయింది, 'పవరూ' రాలేదు. అయినా తన దంబపు 'పవనిజం' స్లోగన్‌ను వదులుకోలేదు. అంతవరకే అయితే సరే అనవచ్చు. కానీ ఆయన ఏ నిశ్చితాభిప్రాయం లేని 'వ్యామోహాల పుట్ట' అని రోజురోజుకూ రుజువవుతోంది. అదే ఆయనతో 'నేనెవరితోనైనా సరే పొత్తులకు సిద్ధం' అనేలా చేస్తోంది. అన్నట్టూ– పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికి పెడుతుందట అన్న సామెత మనకు ఉండనే ఉంది.

శతాబ్దాలకు సరిపడా నీతుల్ని శతక వాఙ్మయ కర్తలు ఎందుకు బోధించి పోయారోగానీ, అవి నేటి భ్రష్ట రాజకీయ సంస్కృతికి ప్రత్యక్షర సాక్ష్యాలుగా నిలిచి పోతున్నాయి. 'గాలి వాటు' రాజకీయాలకు పేరు మోసిన పవన్ కల్యాణ్ నిశ్చితాభిప్రాయం లేని 'వ్యామోహాల పుట్ట' అని రోజు రోజుకూ రుజువవుతోంది. 'వారాహి' వాహనాన్ని చూపి దాన్నొక బెదిరింపు సాధనంగా చూపెడుతున్నాడు. 'వ్యామోహాలు' ఎలాంటివో వేమన నిర్వచించి పోయాడు: ''ఈ దేహమే వ్యామోహాల పుట్ట. కానీ అశాశ్వతమై పగిలిపోయే ఓ కుండ. ఈ శరీరం తొమ్మిది కంతల తిత్తి. ఆ 'తిత్తి'కి ఒంటి నిండా దిగేసే సొమ్ములు చాలక కులాలు, గోత్రాల పేర్లు కూడా ఆభరణాలుగా తగిలించుకుని ఊరేగుతున్నారు''. అల్ప బుద్ధివాడు అధికారంలోకి వస్తే మంచివాళ్లందర్నీ తొలగ్గొడతాడనీ, ఇదెలాంటిదంటే 'పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికి పెట్టిందన్న' సామెత లాంటిదనీ అన్నాడు.

బహుశా అందుకనే పోతనామాత్యుడు కూడా మనిషి బుద్ధుల్ని నాలుగైదు రకాలుగా వర్ణించి పోయాడు. అవి: 'కుబుద్ధి, మంద బుద్ధి, అల్ప బుద్ధి, దుర్బుద్ధి' అని! ఈ అవకాశవాద బుద్ధే, ఇప్పుడు 'నేనెవరితోనైనా సరే పొత్తులకు సిద్ధం' అని పవన్ చేత అనిపిస్తోంది. గత ఎన్నికల్లో 'బింకానికి' పోయి రెండు చోట్ల నిలబడి, అభాసుపాలై ఘోరాతిఘోరమైన ఓటమి పాలయ్యాడు. ఫలితంగా పరువూ పోయింది, 'పవరూ' దూరమై పోయింది. ఇన్ని దారుణ అనుభవాల నుంచి కూడా పవన్ తన 'పవనిజం' అన్న పాత స్లోగన్‌ను మాత్రం వదులుకో లేకుండా ఉన్నాడు.

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల అభ్యున్నతికి రాజ్యాంగపరంగా రక్షణ కల్పించే అవసరాన్ని తొలిసారిగా గుర్తించి దానికి చట్టరూపం ఇవ్వాలన్న తలంపు మొదటిసారిగా 2001లోనే ప్రతిపక్ష నాయక హోదాలో వైఎస్ రాజశేఖర రెడ్డికి వచ్చింది. ఆయన ప్రతిపాదించిన దరిమిలానే దళిత వర్గాలకు 'సబ్ ప్లాన్' చట్టం వచ్చింది. ఆ చట్టం కాలపరిమితి మొన్నటి జనవరి 23తో ముగియవలసింది. కానీ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్

రెండో మాట



జగన్ మోహన్ రెడ్డి మరో ముందడుగు వేసి దాన్ని మరొక పదేళ్లకు పొడిగిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించడం వల్ల దళితుల, ఆదివాసీల అభ్యున్నతికి ఈ చర్య ఎంతో దోహదం చేస్తుంది. సకల దళిత శక్తులు వివిధ దశల్లో సమీకృతమైన ఫలితమే 'సబ్ ప్లాన్'. ఆ నిధులు దుర్వినియోగమై పక్కదారులు పడుతున్నాయని సబ్ ప్లాన్ లక్ష్యాల గురించిన అవగాహన లేని పవన్ వాపోవడం కేవలం ఆయన ద్వేష భావననే బట్టబయలు చేస్తోందని చెప్పక తప్పదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజా బాహుళ్యానికి మాత్రం గణనీయమైన స్థాయిలో ఒరిగిందేమీ లేదంటూ అంబేడ్కర్ తన బాధను చివరి శ్వాస వరకూ వ్యక్తం చేస్తూనే వచ్చారు. ''షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల బతుకుతెరువులు ఆచరణలో బాగుపడనంత కాలం, ఆ వైపుగా సమూలమైన, సమగ్రమైన మార్పులు రానంత కాలం భారతదేశ భవిష్యత్తు ఆశాజనకంగా ఉండబోదని అంబేడ్కర్ స్పష్టం చేశారని సుప్రసిద్ధ జాతీయ వ్యంగ్య చిత్ర వారపత్రిక 'శంకర్స్ వీక్లీ' (1953 ఫిబ్రవరి) నివేదించింది. అంతేగాదు, కళావంతులైన దేవదాసీలకు చెందిన కేసరీబాయి కేర్కర్ (1892–1977) స్వరంతో 'వందేమాతరం' గ్రామఫోన్ రికార్డును సిద్ధం చేయాలనీ, ఆ తొలి కాపీని తానే కొంటాననీ ప్రకటించినవారు అంబేడ్కర్! ఎందుకంటే 'సురశ్రీ'గా పేరొందిన కేర్కర్, జైపూర్‌కు చెందిన అత్రౌలి ఘరానాలో 20వ శతాబ్దపు క్లాసికల్ సింగర్‌గా పేరొందిన హిందూస్తానీ సంగీత విద్వాంసుడు అల్లాదియా ఖాన్ వద్ద శిక్షణ పొందిన విషయాన్ని బహిర్గతం చేశారు అంబేడ్కర్.

హైందవంలోని కుల వ్యవస్థను, పరమత విద్వేష భావాలను వ్యతిరేకించిన అంబేడ్కర్ చివరికి బౌద్ధ ధర్మాన్ని ప్రేమించి ఆహ్వానించవలసి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర శాసన వేదికలలో పాల్గొనే సభ్యులపై ఏయే అనర్హతా నిబంధనలను విధించాలో 1951లోనే ప్రత్యేక బిల్లును ఆయన రూపొందించారు. శాసన వేదికల్లోని సభ్యులకు రాజకీయ పదవుల ఆశ జూపడం ద్వారానో, మరే ఇతర ప్రయోజనాలు కల్పిస్తామనో ప్రలోభాలకు గురిచేసే పార్లమెంట్ వేదిక వల్ల ప్రయోజనం లేదు. ఎలాంటి భీతి లేదా ప్రలోభమో ప్రభుత్వం నుంచి లేకుండా పార్లమెంట్ సభ్యులు స్వతంత్రంగా వ్యవహరించలేకపోతే అలాంటి 'పార్లమెంట్' వల్ల గానీ, శాసనసభ వల్లగానీ ప్రజలకు ఉపయోగం ఉండదు. అలాంటి స్థితిలోనే పాలకులకు 'డూడూ బసవన్న'లుగా వ్యవహరిస్తారని అంబేడ్కర్ హెచ్చరించారు. అలాంటి పరిస్థితుల్లోనే పార్లమెంట్ (లేదా శాసన వేదిక) కాస్తా స్టాక్ ఎక్స్ఛేంజి వ్యాపార మార్కెట్‌గా ఎలా మారిపోతుందో అంబేడ్కర్ ఉదాహరించారు.

అంతేగాదు, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వంలో ఉన్న షెడ్యూల్డ్ కులాల అభ్యర్థుల సంఖ్యకన్నా స్వతంత్ర భారత ప్రభుత్వ కొలువులో ఉన్న వారి సంఖ్య బహు తక్కువనీ, ఆ మాటకు వస్తే తన స్వతంత్ర భారత రాజ్యాంగ ముసాయిదా ప్రతినే తారుమారు చేయడానికి ముసాయిదా సంఘంలోని కొందరు సభ్యులు సాహసించిన విషయాన్నీ కూడా అంబేడ్కర్ బయట పెట్టాల్సి వచ్చిందని మరచి పోరాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ రోజున ఆంధ్రప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలలో అధికారం కోసం, దళిత వర్గాలపై ఆధిపత్యం కోసం కేవల పదవీ కాంక్షతో కక్షిదారులైన కొందరు అగ్ర – అర్ధ అగ్రవర్ణాలకు చెందిన 'వినాయకులు' పని చేస్తున్నారన్నది పచ్చి నగ్న సత్యం. బహుపరాక్, ప్రసిద్ధ ఫ్రెంచి చిత్రకారుడు పియరీ నోరా అన్నట్టు– ''జ్ఞాపక శక్తి ఉన్న చోటునే మరుపు పెద్దమ్మ కూడా వెన్నంటే ఉంటుంది''!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే సిగ్నల్



మా ఇల్లు పూర్తిగా వాస్తుకు అనుగుణంగా ఉంది. ఉత్తరంలో ఎయిర్‌టెల్ సిగ్నల్స్ వస్తాయి. దక్షిణంలో వొడాఫోన్ సిగ్నల్స్ అందుతాయి. మీది కూడా అంతేనా?

– రౌనక్ మహాజన్, వ్యాఖ్యాత

తగ్గిన స్థానం



గౌతమ్ అదానీ ప్రపంచ ధనవంతుల జాబితాలో తొమ్మిదో స్థానానికి పడిపోయారు. శుక్రవారం ఆయన మూడు నుంచి ఏడో స్థానంలోకి వచ్చారు.

– ప్రశాంత్ కనోజియా, ఆర్‌ఎల్‌డీ క్యాంపెయిన్ ఇంచార్జ్

చరిత్రను మార్చడమా?



మొఘల్ గార్డెన్స్‌కు పోటీగా మరొక ఉద్యానాన్ని నిర్మించి దానికి నువ్వు కోరుకున్న పేరు పెట్టుకోవచ్చు కదా! ఈ పేర్ల మార్పు మీద అంత పట్టింపు ఎందుకు? చరిత్రను తుడిచిపెట్టడానికి చేస్తున్న ప్రయత్నం ఇక నిలిచిపోయేట్టు లేదు.

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

జాగ్రత్త అవసరం



ఆస్ట్రేలియాలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నాయి. భారత జాతీయ పతాకాన్ని చూపినందుకుగానూ హిందూ సమాజానికి చెందిన భారతీయులను ఖాలీస్తానీలు ఆస్ట్రేలియా వీధుల్లో కొట్టారు. ఖాలిస్తానీ తీవ్రవాదం అనేది ఏ క్షణమైనా పేలే బాంబు.

– మోనికా వర్మ, వ్యాఖ్యాత

పరిష్కారమే కానీ...



ఒకవేళ పాకిస్తాన్ ఎప్పటికీ భారత్‌తో విడిపోక పోయివుంటే, వాళ్ల పరిస్థితి ఇలా ఉండేది కాదు. పాకిస్తాన్‌ను కాపాడటానికి ఉన్న ఏకైక పరిష్కారం 'అఖండ్ భారత్' మాత్రమే. కానీ ఒకవేళ ఈ సమయంలో ఇండియాతో పాకిస్తాన్ కలిస్తే అది ఇండియా ప్రగతిని కూడా ఆపుతుంది.

– షాయన్ అలీ, స్వేచ్ఛావాది

సయోధ్యే తారకమంత్రం



యావజ్జీవితం హిందూ ముస్లిం ఐక్యత కోసం కృషి చేసినందుకు 75 ఏళ్ల క్రితం ఈ రోజున (జనవరి 30) మహాత్మా గాంధీ హత్యకు గురయ్యారు. మహాత్ముడికి నివాళులు అర్పిస్తున్నవారు సామాజిక సయోధ్య అనేదాన్ని జీవించేందుకు ఒక విశ్వాస నియమంగా పెట్టుకోవాలి. పెదవుల మీద రామ్, హృదయాల్లో నాథూరామ్ ఉండకూడదు.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

వాళ్లెందుకు వినాలి?



సౌదీ అరేబియా అంతటా మసీదుల్లో బయటి లౌడ్‌స్పీకర్ల వాడకాన్ని నియంత్రించారు. అల్లాహ్ మాత్రమే అసలైన, అత్యున్నత దేవుడు అని రోజుకు ఐదుసార్లు నిరంతరం బిగ్గరగా చెప్పుకొనే 'అజాన్'ను ఇండియా కూడా తప్పక నిషేధించాలి. 'కాఫీర్లు' దాన్ని బలవంతంగా ఎందుకు వినాలి?

– ఖాలిద్ ఉమర్, సెక్యులర్ హ్యూమనిస్ట్

భారత రత్న ఇవ్వాలి!

ఈ ఏడాది పద్మ పురస్కారాలు ప్రకటించారు కానీ దేశ అత్యున్నత పురస్కారం 'భారత రత్న'ను ప్రకటించలేదు. ఎన్నో త్యాగాలూ, సేవలూ చేసినవారికి ప్రదానం చేసే ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రతి ఏడాదీ ప్రకటించి వారిని గౌరవించుకోవడం మన విధి. 1954 నుండి భారత రత్న పురస్కారాన్ని ఇస్తున్నారు. ఇప్పటివరకు 48 మందికి ఈ అవార్డును అందించారు. చివరిసారిగా 2019లో ముగ్గురికి ఇచ్చారు. సామాజిక సేవకుడు నానాజీ దేశ్‌ముఖ్ (మరణానంతరం), కళాకారుడు డాక్టర్ భూపేన్ హజారికా (మరణానంతరం), మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీలకు ఈ అవార్డును ప్రదానం చేశారు.

భారత రత్నకు వ్యక్తులను ఎంపిక చేసే ప్రక్రియ పద్మ అవార్డుల కంటే భిన్నంగా ఉంటుంది. ఈ అవార్డుకు వ్యక్తులను సిఫార్సు చేసే ప్రక్రియ ప్రధాన మంత్రి నుంచి మొదలవుతుంది. వ్యక్తుల పేర్లను ఆయనే భారత రాష్ట్రపతికి పంపిస్తారు. కులం, వృత్తి, జెండర్... ఇలా ఎలాంటి భేదం లేకుండా ఎవరి పేరునైనా భారత రత్నకు పరిశీలించొచ్చు. ప్రతి ఏటా ముగ్గురికి భారత రత్న ఇవ్వొచ్చు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా పద్మ పురస్కారాలను ప్రకటించినట్లుగా భారత రత్న పురస్కారాన్ని ప్రకటించడం లేదు. అలా ప్రకటించాలని ప్రత్యేక నిబంధనలు ఏమీ లేకపోయినప్పటికీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు అయిన సందర్భంగా ఈ ఏడాది దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్ వంటి మహనీయులకూ గొప్ప సంఘ సంస్కర్తలైన పూలే దంపతులకూ, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వంటి త్యాగ ధనులకూ, ధ్యాన్ చంద్ వంటి క్రీడాకారులకూ భారత రత్న పురస్కారం ఇచ్చి ఉంటే బాగుండేది.

ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజాభివృద్ధి కోసం పాటుపడిన విశిష్ట వ్యక్తులకు భారత రత్నను ప్రదానం చేయడం ద్వారా వారి త్యాగాలను ఈ తరానికి మరొక్కసారి పరిచయం చేసినట్లు అవుతుంది. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– ఎం. రాం ప్రదీప్, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా

'పెద్దలు' కుమ్మక్కైతే న్యాయం గతేమిటి?

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్


మన రాజ్యాంగం ఎవరో ఒకరు రచించిన పుస్తకం కాదు. అది అంబేడ్కర్ వంటి మహానుభావులు నిర్మించిన ఒక సంవిధానం. రాజ్యాంగ నియమాలతో పాటు కొన్ని సంప్రదాయాలూ అనేక ఏళ్ల నుంచీ కొనసాగుతున్నాయి. అందులో సుప్రీం కోర్టు కొలీజియం వ్యవస్థ ఒకటి. ఈ వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామకాలనూ, బదిలీలనూ చేపడతారు. అయితే ఈ కొలీజియం వ్యవస్థ పార్లమెంట్ చేసిన చట్టం ద్వారానో లేదా రాజ్యాంగ నిబంధనలను అనుసరించో ఏర్పడింది కాదు. అది సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా పరిణామం చెందిన వ్యవస్థ. సుప్రీంకోర్టు కొలీజియానికి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి మార్గదర్శకత్వం వహిస్తారు. నలుగురు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. హైకోర్టు కొలీజియానికి ఆ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నాయకత్వం వహిస్తారు. ఇద్దరు సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. కొలీజియం సిఫార్సు చేసినవారిని ప్రభుత్వం నియమిస్తుంది. అయితే ఇటీవల కేంద్ర న్యాయ శాఖా మంత్రి కిరణ్ రిజిజు కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధి ఉండాలనే ప్రతిపాదన చేస్తూ సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖ వివాదాస్పదమయింది.

సుప్రీం కోర్టు ధర్మాసనాలు ఇచ్చిన అనేక తీర్పుల వల్ల... నియమాల కన్నా ఎక్కువగా సంప్రదాయాల ఆధారంగానే స్వతంత్ర న్యాయవ్యవస్థ నిర్మితమవుతూ వస్తోంది. ఈ క్రమంలోనే కొలీజియం వచ్చింది. ఇప్పుడు ఆ వ్యవస్థలో ప్రభుత్వ ప్రతినిధి ఉండాలనే ప్రతిపాదన న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తినే దెబ్బ తీసేవిధంగా ఉందని పలువురు న్యాయనిపుణులు అంటున్నారు.

కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధికి స్థానం గురించి మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ... ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజుల అభిప్రాయాలను ప్రస్తావించారు. ఆ సందర్భంగా రాజ్యాంగ మౌలిక నిర్మాణం లేదా స్వభావాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే సమాఖ్య, కార్యనిర్వాహకవర్గం, స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ ముఖ్య విభాగాలు అని రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశించిన సంగతిని పేర్కొన్నారు.

కొలీజియంలో పార్లమెంట్, ప్రభుత్వ పెద్దలకు స్థానం కల్పించడానికి చేసిన 99వ రాజ్యాంగ సవరణ చట్టాన్నీ, జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్నీ సుప్రీం కోర్టు కొట్టివేసిన విషయాన్నీ ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న 'పెద్దలు' (ముగ్గురు) పరోక్షంగా సుప్రీం ఇచ్చిన ఈ తీర్పును ఒప్పుకోవడం లేదనీ, ఆ నిర్ణయాన్ని మరో దారిలో అమలుచేయాలని చూస్తున్నారనీ ట్విట్టర్ వేదికగా ఆయన అన్నారు.

'1967–77 సంవత్సరాల మధ్య దేశ చరిత్రను ధన్‌ఖర్, బిర్లా, రిజిజులు చదివే ఉంటారని నేను భావిస్తున్నాను. రెండు భిన్న విషయాలను ధన్‌ఖర్ కలగలిపి వేశారు. రాజ్యాంగంలోని



ప్రతీ లేదా ఏదైనా ఒక నిబంధనను పార్లమెంటు సవరించగలదా; ఆ సవరణ న్యాయ వ్యవస్థ సమీక్ష పరిధిలోకి రాదా అన్నది ఒక అంశం. 99వ రాజ్యాంగ సవరణను, జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు సరైనదేనా అన్నది రెండో అంశం. సుప్రీం కోర్టు కేశవానంద భారతి కేసులో తీసుకున్న నిర్ణయం సరైనదనీ, జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టం కేసులో తప్పుడు నిర్ణయం తీసుకున్నదనీ అభిప్రాయపడేందుకు ఆస్కారమున్నది. నిజానికి న్యాయశాస్త్ర పండితులు అనేక మంది ఇదే విధంగా అభిప్రాయపడుతున్నారు' అని చిదంబరం అన్నారు.

అంతేకాదు ''న్యాయవ్యవస్థ నిర్ణయాల కంటే పార్లమెంటు నిర్ణయాలే సర్వోన్నతమైనవనే వాదనను అంగీకరించామనుకోండి. జరిగేదేమిటి? నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. జమ్మూ–కశ్మీర్‌లో వలే ఒక రాష్ట్రాన్ని విభజించి పలు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేయడాన్ని మీరు ఆమోదిస్తారా? వాక్ స్వాతంత్ర్యాన్నీ, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా నివసించే స్వేచ్ఛనూ, ఏ వృత్తినైనా ఆచరించే, ఏ వ్యాపారాన్ని అయినా చేసే స్వేచ్ఛను రద్దుచేయడాన్ని మీరు ఒప్పుకుంటారా? స్త్రీ పురుషులను సమానంగా పరిగణించని, హిందువులు, ముస్లింల పట్ల రాజ్య వ్యవస్థ భిన్న రీతుల్లో వ్యవహరించడాన్ని అనుమతించి... స్వలింగ సంపర్కులకు హక్కులు నిరాకరించే చట్టాలను మీరు ఆమోదిస్తారా? ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు, జైనులు, బౌద్ధులు, యూదులు, ఇతర మైనారిటీ వర్గాలకు రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులను రద్దు చేయడాన్ని మీరు అంగీకరిస్తారా? ఏడవ షెడ్యూలు నుంచి రాష్ట్ర జాబితాను తొలగించి, శాసన నిర్మాణాధికారాలు అన్నిటినీ పార్లమెంటుకు అప్పగించడాన్ని మీరు సమ్మతిస్తారా? ఒక నిర్దిష్ట భాషను యావద్భారతీయులు తప్పనిసరిగా నేర్చుకు తీరాలనే ఆదేశాన్ని మీరు పాటిస్తారా? నేరారోపణకు గురైన ప్రతీ వ్యక్తి అమాయకుడుగా నిరూపణ కానంతవరకు అతడిని అపరాధిగా భావించాలని నిర్దేశిస్తున్న చట్టాన్ని మీరు అంగీకరిస్తారా? పార్లమెంటు నేడు అటువంటి చట్టాలు చేయదు, చేయలేదు. చేసినా వాటిని సమీక్షించి తిరస్కరించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉన్నది. ఇందుకు భిన్నంగా 'పార్లమెంటరీ పూర్ణాధిపత్యం, న్యాయవ్యవస్థ సంయమనం' సిద్ధాంతం కింద అటువంటి చట్టాలపై న్యాయ సమీక్ష జరగదు'' అని చిదంబరం పేర్కొన్నారు.

రాజ్యాంగ సంవిధాన మౌలిక స్వభావాన్ని మార్చడానికి వీలులేదని సుప్రీంకోర్టు అనేక సార్లు చెప్పినా, దశాబ్దాలుగా స్థాపితమైన సంప్రదాయాలు మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 99వ రాజ్యాంగ సవరణను, జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినా... ప్రధానమంత్రీ, ఇతర ముఖ్యమైన మంత్రులూ, నాయకులూ తమ బాధ్యతను మరచి రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీయడానికి ఏదో విధంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

కొలీజియంలోని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు కాకుండా చీఫ్ జస్టిస్, ప్రధాన మంత్రి, న్యాయమంత్రి కలిసి న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో పాల్గొనే విషయాన్ని ఈ 'ముగ్గురు' పెద్దలు నిర్ణయిస్తారట. ఇదే జరిగితే న్యాయం బతుకుతుందా?

వ్యాసకర్త డీన్, స్కూల్ ఆఫ్ లా, మహీంద్రా యూనివర్సిటీ

అగతాసువులు

'అర్జునా! యుద్ధభూమికి వచ్చి కీలక సమయంలో అస్త్ర సన్యాసం చేస్తానంటున్నావు. పెద్ద పెద్ద మాటలన్నీ చెప్తున్నావు. కానీ నిజంగా ప్రజ్ఞాశాలులైన వారు 'గతాసువు'లను గురించి గానీ, 'అగతాసువు'లను గురించి గానీ ఇలా శోకించరు' అంటూ శ్రీకృష్ణ పరమాత్మ తన గీతాబోధ ఆరంభిస్తాడు.

'గత అసువు'లంటే అసువులు కోల్పోయిన వాళ్ళు. 'అగత –అసువు'లంటే బ్రతికి ఉన్నవాళ్ళు. ఇంకొంత కచ్చితంగా అనువదిస్తే, 'అ–గత–అసువు'లంటే 'ఇంకా ప్రాణాలు కోల్పోని వాళ్ళు' అని చెప్పాలి. బతుకుతున్న వాళ్లందరినీ పట్టు కొని, కేవలం 'ఇంకా మరణించనివాళ్ళు'గా ప్రస్తావించడం కొంచెం కటువుగా ఉన్నా, అది ఎంతో అర్థవంతమైన మాట.



ఈ జీవన స్రవంతి ఒక నిరంతర ప్రవాహం. పాత నీటిని తోసుకొంటూ కొత్త నీరు రావటం ప్రవాహ ధర్మం. జాతస్య హి ధ్రువో మృత్యుః – పుట్టిన వాడికి మరణం తథ్యం. ధ్రువం జన్మ మృతస్య చ– మరణించినవాడు కర్మఫల శేషం అనుభవించడానికి మళ్ళీ పుట్టక తప్పదు. ఇది ఇంద్రియ గోచరం కాక పోయినా, శాస్త్రాలు చెప్పే ఆప్తవాక్య రూపమైన సత్యం. 'ఇంకా పుట్టని వాళ్ళు పుట్టా లంటే,ఇంకా మరణించని వాళ్ళే చోటివ్వాలి' అని చమత్కరిస్తారు స్వామి చిన్మయానంద.

'నేను మర్త్యుడిని. నా జీవితం క్షణ భంగురం' అని తరచుగా గుర్తుచేసుకొంటుంటే, జీవితాలను మరింత ఎక్కువ నిశ్చింతగానూ, అత్యాశలకూ అధర్మాలకూ దూరంగానూ జీవించవచ్చని పెద్దలెందరో ఉద్బోధిస్తూ వచ్చారు. ప్రాణి కోటిలో యావన్మందికీ తప్పనిసరి అని తెలిసిన విషయాల గురించి శోకించటం వల్ల ప్రయోజనం శూన్యం. మన నియంత్రణలో లేని విషయాల చింత మాని, మన వల్ల కావలసిన పని మీద దృష్టి ఉంచితే సమర్థత పెరుగుతుంది అన్నది వ్యక్తిత్వ వికాస ప్రాథ మిక సూత్రాలలో ఒకటి.

'త్రికరణ శుద్ధితో నీ స్వధర్మం నువ్వు నిర్వహించు. లాభాలాభాలూ, జయాపజయాలూ సమంగా భావించి, ఫలాపేక్ష లేకుండా కర్తవ్యతా భావంతో పని చేయటమే కర్మ యోగం. కర్మ మీద ధ్యాస ఉంచు, ఫలం మీద ఆసక్తి వదులు. 'కర్మణి ఏవ అధికారః తే, మా ఫలేషు!' అంటూ గీతా బోధ ఆరంభమౌతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.దశమి ప.2.34 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: రోహిణి రా.2.59 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: సా.6.32 నుండి 8.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.46 వరకు, అమృతఘడియలు: రా.11.33 నుండి 1.12 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.37, సూర్యాస్తమయం: 5.50.

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదం

- నూతన ఇన్‌చార్జి చైర్మన్‌గా గోలి శ్రీనివాస్
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ రవి


బోగ శ్రావణి


గోలి శ్రీనివాస్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి రాజీనామాను జిల్లా కలెక్టర్ రవి ఆమోదించారు. ఈ నెల 25న శ్రావణి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రవి సోమవారం ఆమెను కలెక్టరేట్‌కు పిలిపించారు. రాజీనామా నిర్ణయాన్ని ఎవరి ఒత్తిడితోనైనా తీసుకున్నారా ? లేక సొంతంగా నిర్ణయం తీసుకున్నారా? అని కారణాలు అడిగి తెలుసుకున్నారు. తన ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశానని స్పష్టం చేసిన శ్రావణి.. మరోసారి లేఖ రాసివ్వడంతో కలెక్టర్ ఆమె రాజీనామా లేఖకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. కాగా, ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు రాగానే నూతన చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జగిత్యాల మున్సిపాలిటీలో కొందరు కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాసానికి ప్రయత్నించడంతో శ్రావణి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.

గుంజీలు తీయించి.. గాయపరచి..

- దుర్భాషలాడారని విద్యార్థినులకు టీచర్ల శిక్ష
- నడవలేని స్థితిలో విద్యార్థినులు
- తిరుమలాయపాలెం కేజీబీవీలో దారుణం

తిరుమలాయపాలెం: విద్యార్థులు తప్పు చేస్తే సహనంతో సంస్కరించాలి. కానీ ఆ పాఠశాల టీచర్లు ఆ విషయమే మరిచిపోయారు. బాత్‌రూమ్ తలుపుపై తమ గురించి అసభ్యంగా రాశారంటూ కొందరు విద్యార్థినులతో గుంజీలు తీయించి తీవ్రంగా కొట్టారు. దీంతో ప్రస్తుతం ఆ విద్యార్థినులు నడవలేని స్థితిలో ఉన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. తిరుమలాయపాలెం కేజీబీవీలో చదువుతున్న కొందరు విద్యార్థినులు పాఠశాలలోని గణితం, ఫిజిక్స్ మహిళా టీచర్లు సరిగ్గా పాఠాలు చెప్పడం లేదని బాత్‌రూమ్ తలుపులపై అసభ్య పదజాలంతో రాశారు. ఈ విషయాన్ని ఇంకో విద్యార్థిని ఫిజిక్స్ టీచర్‌కు చేరవేసింది. దీనిపై ఆగ్రహించిన గణితం, ఫిజిక్స్ టీచర్లు జనవరి 27న.. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థినులతో ఎస్‌వో ఎదుట గుంజీలు తీయించడంతోపాటు వారిని విచక్షణారహితంగా కొట్టారు. దీంతో ప్రస్తుతం విద్యార్థినులు పైఅంతస్తులోని తమ గదికి వెళ్లేందుకు వీల్లేని పరిస్థితిలో ఉన్నారు. సోమవారం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి ఎస్‌వోను ప్రశ్నించగా.. పిల్లలతో వ్యాయామం చేయించామని సర్దిచెప్పి పంపించారు. ఈ విషయమై ఎస్‌వో రమాకుమారిని వివరణ కోరగా టీచర్లపై అసభ్య పదజాలంతో రాసిన విద్యార్థినులను మందలించామని స్పష్టం చేశారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చూస్తామని పేర్కొన్నారు.

12 కోట్ల పనిదినాలు కల్పించండి: ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థికసంవత్సరంలో రాష్ట్రానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 12 కోట్ల పనిదినాలు కల్పించాలని కేంద్రానికి పంచాయతీ రాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ పథకం కింద ఈ ఏడాది 10.5 కోట్ల పనిదినాలు పూర్తి చేసినందున పనిదినాలకు పెంచాలని పంపించిన ప్రతిపాదనలను అధికారులు పర్యవేక్షించాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.800 కోట్లను కేంద్రం ఇంకా విడుదల చేయలేదని తెలిపారు. సోమవారం పంచాయతీరాజ్ రోడ్ల నిర్వహణ, మరమ్మతులు, కొత్త రోడ్ల పనుల పురోగతి, ఉపాధి హామీ పనిదినాలు, మెటీరియల్ కాంపోనెంట్ పనులు–నిధులపై ఎర్రబెల్లి సమీక్ష నిర్వహించారు. పీఆర్ కింద మంజూరు చేసిన సీసీ రోడ్ల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సర్పంచ్ దంపతుల ఆత్మహత్యాయత్నం

- అభివృద్ధి పనుల కోసం చేసిన అప్పులు భారంగా మారాయని వెల్లడి
- నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఘటన


ఆత్మహత్యకు యత్నించిన సర్పంచ్ దంపతులు వాణి, తిరుపతి

సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ జిల్లా నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి, ఆమె భర్త తిరుపతి సోమవారం కలెక్టరేట్‌లో ఆత్మ హత్యకు యత్నించారు. బిల్లుల(ఎంబీల)పై ఉప సర్పంచ్ సంతకాలు పెట్టడంలేదని, దీనితో రూ.2 కోట్లకుపైగా ఆగిపోయాయంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. సమీపంలో ఉన్నవారు వెంటనే అడ్డుకుని దంపతుల నుంచి అగ్గిపెట్టెను లాక్కొని విసిరేశారు. బీజేపీ మద్దతుతో వాణి సర్పంచ్‌గా గెలుపొందడంతో సాకులు చూపి వేధింపులకు గురిచేస్తున్నారని, పంచాయతీ నిధులు మింగేశామని ఆరోపిస్తూ సస్పెండ్ చేశారని తిరుపతి కన్నీళ్లు పెట్టుకున్నారు. పార్టీ మారినా ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి బిల్లులు, చెక్ పవర్ ఇప్పించలేకపోయారని పేర్కొన్నారు. బిల్లులు రాక గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టలేక ప్రజలకు ముఖం చాటేయాల్సి వస్తోందన్నారు. వడ్డీ సహా మొత్తం రూ.4 కోట్ల వరకు అప్పులు అయ్యాయని.. ఈ దిగులుతో తన భార్య, సర్పంచ్ వాణి ఆస్పత్రి పాలైందన్నారు. అయితే కలెక్టర్ వచ్చే వరకూ కలెక్టరేట్ నుంచి కదిలేది లేదంటూ వాణి, తిరుపతి అక్కడే బైఠాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీపీవో జయసుధ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. ఉప సర్పంచ్ సంతకాలు పెట్టకపోవడంపై విచారణ చేపడతామని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

హామీల అమలుపై ఆత్మపరిశీలన చేసుకోండి

బీఆర్ఎస్ నేతలకు పొంగులేటి హితవు


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బోనకల్: బీఆర్ఎస్ నేతలు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఎంతమేరకు అమలు చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మధిర నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చిన తాను, ఖమ్మం జిల్లా ప్రజల అభిమానంతో ఎంపీగా గెలి చానని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత స్థానిక పరిస్థితుల దృష్ట్యా సీఎం కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ఆనాడు టీఆర్ఎస్‌లో చేరాన న్నా రు. అయితే, కేసీఆర్, కేటీఆర్ ఏ ఒక్క మాటను కూడా నిలబెట్టుకోలేదని, ఏడున్నరేళ్ల పాటు తాను అనేక అవమానాలను ఎదుర్కొన్నా నని తెలి పారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యు త్, రైతులకు రుణమాఫీ వంటి వాగ్దానాలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్లు కలగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాభిమానం పొందలేక ఓడిపోయిన అభ్యర్థులందరినీ తానే ఓడించాననే అపనింద మోపి ఎంపీ టికెట్ ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేశానని పొంగులేటి తెలిపారు. జిలాల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకలాపాలకు సహకారం అందించానన్నారు.

సింగరేణిలో ఇద్దరు డైరెక్టర్ల నియామకం


ఎన్‌వీకే శ్రీనివాస్


జి.వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థలో రెండు డైరెక్టర్ పోస్టుల నియామక ప్రక్రియ సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో జరిగింది. పోటీ పడుతున్న వారి వివరాలను పరిగణనలోకి తీసుకున్నాక ఇద్దరిని ఎంపిక చేశారు. మణుగూరు ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డిని డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్‌గా, ఆండ్రియాల ప్రాజెక్ట్ జీఎం ఎన్‌వీకే శ్రీనివాస్‌ను డైరెక్టర్(ఆపరేషన్స్)గా నియమిస్తూ సింగరేణి సీఎండీ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీకాలం రెండేళ్లు. కాగా, సింగరేణిలో డైరెక్టర్(పా) పోస్టు ఖాళీగానే ఉంది.

వచ్చే నెల 13లోపు నిర్ణయం చెప్పండి

- కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి మాస్టర్ ప్లాన్ కొనసాగుతుందా? రద్దయిందా? ఫిబ్రవరి 13వ తేదీలోగా నిర్ణయం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రైతులను సంప్రదించకుండానే కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రూపొందించారని, ఇది చట్టవిరుద్ధ మని పేర్కొంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కేఏ పాల్ పార్టీ ఇన్ పర్సన్‌గా హాజరై వాదనలు వినిపించారు. మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేసినట్లు మున్సిపల్ కౌన్సిల్ ప్రకటించిందన్నారు. కౌన్సిల్‌కు ఆ అధికారం లేదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ నిర్ణ యం చెప్పాలంటూ విచారణను వాయిదా వేసింది.

'బయ్యారం స్టీల్'పై కేసీఆర్‌వి అబద్ధాలు: సంజయ్



సాక్షి, హైదరాబాద్ /ఖైరతాబాద్: బయ్యారం స్టీల్ ప్లాంట్ విషయంలో అబద్ధాలు చెప్పి మోసం చేసినందుకు ప్రజలకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఇటీవల డీజీపీ ఆఫీస్ ముట్టడిలో గాయపడ్డ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్‌ను సోమవారం గ్లోబల్ ఆసుపత్రిలో సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బయ్యారంపై డీపీఆర్ ఇవ్వాలన్న తమ లేఖకు మూడున్నరేళ్లుగా స్పందనే లేదని కేంద్రం స్పష్టం చేసినందున ఇప్పుడు కేసీఆర్ ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. 'బడ్జెట్ ఫైల్‌కు మూడురోజులుగా గవర్నర్ తమిళిసై ఆమోదం తెలపడం లేదని కోర్టుకెక్కిన కేసీఆర్... ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు ఫైల్‌ను ఏళ్ల తరబడి అసెంబ్లీ స్పీకర్ పెండింగ్‌లో పెడితే ఎందుకు మాట్లాడటం లేదు?'అని నిలదీశారు. కేసీఆర్ పాలనలో సర్పంచ్‌లు కూడా ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కాగా, కేసీఆర్ కుటుంబసభ్యులు తాము నిజాం రాజులమని అనుకుంటున్నారని, వారు ఏ ప్రాంతానికి వెళ్లినా ముందస్తు అరెస్టులు చేయిస్తున్నారని సంజయ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. మంగళవారం మంత్రి కేటీఆర్ కమలాపూర్ పర్యటన నేపథ్యంలో కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లోని బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీటిపారుదల శాఖలో 'కాడా' రద్దు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ పరిధిలోని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ (కాడా) విభాగాన్ని మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నీటిపారుదల ప్రాజెక్టుల ఆయకట్టు అభివృద్ధితో పాటు నీటి యాజమాన్య పద్ధతలను అవలంబించడానికి గతంలో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఏ ప్రాజెక్టుల కింద ఎలాంటి పంటలు వేయాలి? ఎంత మేర నీళ్లను రైతులు వినియోగించుకోవాలి? అన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించడానికి ఈ విభాగం పనిచేసేది. ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ పనులు పర్యవేక్షిస్తోంది. దీంతో ఇక కాడా విభాగం అవసరం లేనందున పూర్తిగా రద్దు చేయాలని, ఇందులో పనిచేస్తున్న ఇంజనీర్లను జలాశయాల భద్రత విభాగానికి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

రేప్ కేసులో ఆశారాం దోషే

తేల్చిన కోర్టు, నేడు శిక్ష ఖరారు

గాంధీనగర్: 2013 నాటి రేప్ కేసులో వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపును దోషిగా గుజరాత్‌లోని ఓ న్యాయస్థానం సోమవారం తేల్చింది. ఆయనకు శిక్షను సెషన్స్ కోర్టు జడ్జి డీకే సోని మంగళవారం ప్రకటించనున్నారు. సాక్ష్యాధారాల్లేక ఆశారాం భార్య సహా ఆరుగురికి కేసు నుంచి విముక్తి కల్పించారు. అహ్మదాబాద్ శివారులో తన ఆశ్రమంలో ఉంటున్న శిష్యురాలిపై 2001–2006 మధ్య ఆశారాం పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు 2013లో కేసు నమోదైంది. మరో రేప్ కేసులో ఆయన జోధ్‌పూర్ జైలులో ఉన్నారు.

చావనైనా చస్తా గానీ... బీజేపీతో కలవను: నితీశ్

పట్నా: చావనైనా చస్తా గానీ బీజేపీతో మళ్లీ జట్టుకట్టేది లేదని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తెగేసి చెప్పారు. పట్నాలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. 2013, 2017ల్లో కాషాయ పార్టీతో కూటమిగా ఏర్పడి తప్పిదం చేశానన్నారు. 'ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్‌పై కేంద్రం అనేక కేసులు బనాయించింది. ఫలితం లేకపోవడంతో చేతులు కలపాలంటూ నాపైనా బీజేపీ ఒత్తిడి తెచ్చింది. ఇప్పుడూ ఆర్జేడీ నేతలను కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తోంది' అని ఆరోపించారు.

మోదీ–బీబీసీ పిల్స్‌పై... వచ్చే వారం విచారణ


న్యూఢిల్లీ: గోద్రా అల్లర్లకు నాటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీనే బాధ్యుడన్న బీబీసీ డాక్యుమెంటరీని నిషేధించడంపై దాఖలైన వ్యాజ్యాలపై ఫిబ్రవరి 6న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. లాయర్ ప్రశాంత్ భూషణ్, మాజీ జర్నలిస్ట్ ఎన్ రామ్ తరఫున దాఖలైన పిల్స్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం ముందుకొచ్చాయి.

9 లక్షలకు పైగా ప్రభుత్వ వాహనాలు... ఏప్రిల్ 1 నుంచి తుక్కే

న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్టీసీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో 15 ఏళ్లు దాటిన 9 లక్షలకు పైగా కార్లు, బస్సులు తదితర వాహనాలను ఏప్రిల్ 1 నుంచి రోడ్డెక్కబోవు. రిజిస్ట్రేషన్ రద్దు చేసి వాటన్నింటినీ తుక్కు కింద మార్చేస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి చెప్పారు. వాటిని పర్యావరణహిత ప్రత్యామ్నాయ ఇంధనాలతో కూడిన కొత్త వాహనాలను భర్తీ చేస్తామన్నారు. అయితే రక్షణ, సైనిక వాహనాలు, ప్రత్యేక వాహనాలు తదితరాలకు ఇది వర్తించబోదన్నారు.

మేఘాలయలో ముక్కోణం

కదన రంగంలో ఎన్‌పీపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ • పాత ప్రత్యర్థులు కాన్రాడ్, ముకుల్ సంగ్మా మధ్య హోరాహోరీ



ఈశాన్య భారత్‌లో గిరిజన ప్రాబల్యం కలిగిన మేఘాలయాలో శాసనసభ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. 60 అసెంబ్లీ స్థానాలున్న మేఘాలయలో ఫిబ్రవరి 27న ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 2న ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. రాష్ట్రంలో పాత ప్రత్యర్థులైన కాన్రాడ్ సంగ్మా, ముకుల్ సంగ్మా మళ్లీ హోరాహోరీగా తలపడుతున్నారు. 2018 నాటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నేతృత్వం వహించి, 21 స్థానాల్లో పార్టీని గెలిపించిన మాజీ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ఈసారి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) నుంచి బరిలోకి దిగుతుండడం ఆసక్తి కలిగిస్తోంది. కిందటిసారి పోటీలో లేని తృణమూల్ కాంగ్రెస్ ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతుండడం విశేషం. 2018లో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించి, అధికార పీఠానికి దగ్గరగా వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో సిట్టింగ్ అభ్యర్థులంటూ ఎవరూ లేకపోవడం గమనార్హం. ఎన్నికల్లో ఎన్‌పీపీకి కాన్రాడ్ సంగ్మా, తృణమూల్ కాంగ్రెస్‌కు ముకుల్ సంగ్మా, కాంగ్రెస్‌కు విన్సెంట్ పాలా, బీజేపీకి ఎర్నెస్ట్ మారీ నాయకత్వం వహిస్తున్నారు. ప్రధానంగా ఎన్‌పీపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోరు సాగుతోంది. అంతర్గత లుకలుకలతో అధికార మేఘాలయ ప్రజాస్వామ్య కూటమి(ఎండీఏ) కూటమి విచ్ఛిన్నమైంది. కూటమిలోని నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ), భారతీయ జనతా పార్టీ(బీజేపీ), యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ), హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(హెచ్ఎస్‌పీడీపీ), పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) ఒంటరిగానే పోటీ చేస్తున్నాయి. ఎండీఏలో అతిపెద్ద పార్టీ అయిన నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) నేత, ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా మరోసారి కుర్చీ దక్కించుకోవడమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒకవేళ ఆ పార్టీ గెలిస్తే మేఘాలయలో 2013 తర్వాత వరుసగా రెండోసారి అధికారం దక్కించుకున్న తొలి పార్టీగా ఎన్‌పీపీ రికార్డుకెక్కుంది.

18 మంది రాజీనామా

2018లో కేవలం 20 సీట్లు గెలుచుకున్న ఎన్‌పీపీ.. యూడీపీ(6 సీట్లు), హెచ్ఎస్‌పీడీపీ(2 సీట్లు), పీడీఎఫ్(4 సీట్లు), బీజేపీ(2 సీట్ల)తోపాటు ఒక స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తర్వాత ఎమ్మెల్యేల గోడదూకుళ్లు తదితరాలతో బలాబలాలు మారుతూ వచ్చాయి. 2021 నవంబర్‌లో ముకుల్ సంగ్మా నేతృత్వంలో 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. మిగిలిన 9 మంది ఎమ్మెల్యేలు సైతం పార్టీ నుంచి బయటకు వచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేలు లేకుండాపోయారు. ఇటీవలే 18 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు, సొంత పార్టీలకు రాజీనామా చేశారు. టిక్కెట్లపై హామీ ఇచ్చే పార్టీలో చేరి పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తృణమూల్‌లో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలూ వీరిలో ఉన్నారు. గిరిజన రాష్ట్రమైన మేఘాలయకు ప్రత్యేక హోదా ఉంది. దాంతో రాష్ట్రంలో ఖర్చు చేసే నిధుల్లో 90 శాతానికిపైగా నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచే వస్తుంటాయి. సాధారణంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇక్కడి రాజకీయాలను చాలావరకు ప్రభావితం చేస్తూ ఉంటుంది. చిన్నాచితక పార్టీలు ఏదో ఒక నినాదంతో ఎన్నికల్లో పోటీ చేయడం, ఒకటో రెండో స్థానాలు గెలుచుకొని, ఫలితాల అనంతరం నెంబర్ గేమ్‌లో వీలైనంత మేరకు లబ్ధి పొందడం పరిపాటిగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

చేరికలు, రాజీనామాల తర్వాత అసెంబ్లీలో పార్టీల ప్రస్తుత బలం

పార్టీ	సీట్లు
నేషనల్ పీపుల్స్ పార్టీ	20
తృణమూల్ కాంగ్రెస్ పార్టీ	8
యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ	8
పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్	2
బీజేపీ	3
ఇతరులు	1
ఖాళీలు	18
మొత్తం	60

మళ్లీ మాదే అధికారం: ఎన్‌పీపీ

మిత్రపక్షంగా ఉన్న బీజేపీ రాష్ట్రంలో అభివృద్ధి పనులకు ఆటంకాలు సృష్టించిందని, అందుకే ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్నామని ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా తేల్చిచెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకత ఏమాత్రం లేదని, తాము మళ్లీ నెగ్గడం ఖాయమని ఎన్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడు డబ్ల్యూ.ఖార్‌లుఖీ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

ప్రభావితం చేసే అంశాలేమిటి?

ప్రభుత్వ వ్యతిరేకత: కాన్రాడ్ సంగ్మా సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోవడం, విచ్చలవిడిగా అవినీతి జరుగుతుండడం, నిధుల లేమితో ఆరోగ్య రంగం కునారిల్లుతుండడం ప్రభుత్వానికి ప్రతికూలంగా మారింది.

సరిహద్దు రగడ: మేఘాలయ–అస్సాం నడుమ సరిహద్దు వివాదం రగులుతోంది. రెండు రాష్ట్రాల్లో సరిహద్దులో ఉన్న పలు తెగల మధ్య హింసాకాండ చోటుచేసుకుంది. పరస్పరం దాడులు చేసుకున్నారు. సరిహద్దు సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని జనం ఆరోపిస్తున్నారు.

కూటమి విచ్ఛిన్నం: అధికార మేఘాలయ ప్రజాస్వామ్య కూటమి(ఎండీఏ) కూటమి విచ్ఛిన్నమై, పార్టీలు సొంతంగా పోటీ చేస్తుండడం ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు నష్టం చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




మహాత్మునికి రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ 75వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి మోదీ సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని మహాత్ముని సమాధి రాజ్‌ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలుంచారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. గన్ సెల్యూట్, సర్వమత ప్రార్థనలు, గాంధీకి ఇష్టమైన గేయాలాపన జరిగాయి. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు నివాళులర్పించారు. 'బాపుకు నా నివాళులు. దేశ సేవలో ప్రాణాలర్పించిన ఎందరో అమరుల త్యాగాలు దేశం కోసం పనిచేయాలనే సంకల్పాన్ని మరింత పెంచుతాయి' అని మోదీ ట్వీట్ చేశారు.

ప్రధాని మోదీతో కొరోసీ భేటీ

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్‌జీఏ) అధ్యక్షుడు సాబా కొరోసీ మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్‌తో భేటీ అయ్యారు. పలు అంతర్జాతీయ సవాళ్లపై చర్చలు జరిపారు. జల సంరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం ఆవశ్యకత కూడా ప్రస్తావనకు వచ్చినట్లు అనంతరం మోదీ ట్వీట్ చేశారు. ఉక్రెయిన్ సంక్షోభం, జీ20 ఎజెండాతోపాటు ఐరాస సంస్కరణలపై చర్చించినట్లు జై శంకర్ పేర్కొన్నారు. పలు అంశాలపై వారి అవగాహన, స్పందన అద్భుతమని కొరోసీ కొనియాడారు. భారత్‌తోపాటు పలు దేశాలు సీమాంతర ఉగ్రవాదంతో బాధ పడుతున్న విషయం తనకు తెలుసునన్నారు.

క్షిపణి దాడికి ఒక్క నిమిషం చాలు


నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్‌కు పుతిన్ వార్నింగ్


పుతిన్


బోరిస్ జాన్సన్

లండన్: ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యాను ఎలాగైనా నిలువరించేందుకు ప్రయత్నించిన బ్రిటన్ మాజీ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్‌ను పుతిన్ బెదిరించారా ? అంటే అవునని సమాధానం చెబుతోంది బీబీసీ డాక్యుమెంటరీ. ఉక్రెయిన్–రష్యా యుద్ధం తొలినాళ్లలో పుతిన్‌కు, బోరిస్‌కు మధ్య జరిగిన ఫోన్‌కాల్ సంభాషణలు, పశ్చిమ దేశాలతో పుతిన్ నేతృత్వంలోని రష్యా వైఖరిని వెల్లడిస్తూ బీబీబీ 'పుతిన్ వర్సెస్ ది వెస్ట్' పేరిట ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. బీబీసీతో బోరిస్, బ్రిటన్ రక్షణ మంత్రి, పలువురు తెలిపిన వివరాలతో రూపొందిన ఈ డాక్యుమెంటరీ సోమవారం ప్రసారమైంది. డాక్యుమెంటరీ వెల్లడించిన విషయాల్లో కొన్ని..

- యుద్ధం మొదట్లోనే అంటే గత ఏడాది ఫిబ్రవరిలో పుతిన్‌కు బోరిస్ ఫోన్‌చేశారు. ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు స్వస్తి పలకాలని హితవు పలికారు. దానికి ససేమిరా ఒప్పుకోని పుతిన్ ఏకంగా బోరిస్‌ను బెదిరించారు!. 'బోరిస్.. మిమ్మల్ని బాధపెట్టడం నా ఉద్దేశం కాదుగానీ క్షిపణితో(అలాంటి) దాడి చేసేందుకు ఒక్క నిమిషం చాలు నాకు. ఇది త్వరలో వర్తమానప్రపంచంలో దారుణ విపత్తుగా పరిణమించబోతోంది' అని అన్నారు.
- బోరిస్ సంయమనం కోల్పోకుండా చర్చలకు ప్రాధాన్యమిస్తూనే దీటుగా బదులిచ్చారు.
- 'వెనక్కి వెళ్లకపోతే రష్యాపై పశ్చిమ దేశాలు అత్యంత కఠిన ఆంక్షలు విధిస్తాయి. నాటో సేనలు రష్యా సరిహద్దులను చుట్టుముడతాయి. సరైన భవిష్యత్తు లేనపుడు ఉక్రెయిన్ నాటోలో చేరబోదు' అని అన్నారు.
- బ్రిటన్ రక్షణ మంత్రి బెన్ వాలెస్ కూడా మాస్కోకు వెళ్లి నచ్చజెప్పే ప్రయత్నంచేశారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం రాబోతోందని ఆనాడే అంచనావేశారు.
- పుతిన్, బోరిస్ తాలూకు ఈ ఫోన్‌కాల్ వివరాలను బ్రిటన్ ప్రధాని కార్యాలయం, రష్యా అధికారికంగా ఎప్పుడూ వెల్లడించకపోవడం గమనార్హం.



రామశిల వచ్చేస్తోంది

అయోధ్యలో రామాలయంలో సీతారాముల విగ్రహాల తయారీ కోసం తీసుకొస్తున్న సాలిగ్రామ శిలలివి. వీటిని నేపాల్‌లో సీత జన్మస్థలంగా భావించే జనక్‌పూర్ నుంచి తీసుకొస్తుండటం విశేషం!

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

▶ మొదటి పేజీ తరువాయి

కడిగి పారేయాలని విపక్షాలు నిర్ణయించాయి. రాష్ట్రపతి ప్రసంగాన్ని కొన్ని పార్టీలు 'బాయ్‌కాట్' చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. బీఆర్ఎస్, ఆప్ ఇప్పటికే ఈ మేరకు నిర్ణయించాయి. అంతేగాక మంగళవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీజీ విగ్రహం వద్ద రెండు పార్టీలూ నిరసన కూడా తెలపనున్నాయి. గవర్నర్ వ్యవస్థపై బీఆర్ఎస్ సహా డీఎంకే, టీఎంసీ గట్టిగా పోరాడాలని నిర్ణయించుకోగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలపై సీపీఐ, సీపీఎం ప్రభుత్వాన్ని నిలదీయనున్నాయి. చైనా సరిహద్దు వివాదాలు, రూపాయి పతనం, బడా కార్పొరేట్ కంపెనీల దోపిడీపై కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కార్‌ను ఇరకాటంలో పెట్టేలా వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. ఈసారి బడ్జెట్ సెషన్ మొత్తం 27 సిట్టింగ్‌లలో ఉండనుంది. ఈ సారి సమావేశాల్లో 36 బిల్లులు పార్లమెంట్ ముందుకు రానున్నాయి.

అఖిలపక్ష భేటీకి కాంగ్రెస్ డుమ్మా

మంగళవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం సోమవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ, మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్, మురళీధరన్ ఆధ్వర్యంలో జరిగిన భేటీకి ఆర్జేడీ, జేడీయూ, బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, టీఎంసీ, శివసేన, బీజేడీ తదితర 27 పార్టీల తరఫున 37 మంది నేతలు హాజరయ్యారు. సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రభుత్వానికి విపక్షాలు సహకరించాలని మంత్రులు కోరారు. దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలతో పాటు రాష్ట్రాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించాలి్సందేనని విపక్షాల నేతలు డిమాండ్‌చేశారు. ఈ భేటీకి కాంగ్రెస్ దూరంగా ఉంది. ఆ పార్టీ లోక్‌సభ, రాజ్యసభా పక్ష నేతలు అధిర్ రంజన్ చౌదరి, మల్లికార్జున ఖర్గే కశ్మీర్‌లో భారత్ జోడో యాత్ర ముగింపు సభలో పాల్గొనేందుకు వెళ్లడంతో భేటీకి హాజరు కాలేదు. మంగళవారం కాంగ్రెస్ పక్షనేతలు తనను కలసి తమ అభిప్రాయాలు పంచుకుంటారని మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.

తృణధాన్యాలతో వంటకాలు

పార్లమెంట్ క్యాంటీన్‌లో ఈసారి తృణధాన్యాలతో చేసిన వంటకాలు ఎంపీలకు కొత్త రుచులను అందివ్వనున్నాయి. రాగులు, జొన్నలు, సజ్జలు, అరికెలు, సామలు ఇలా పలు రకాల చిరుధాన్యాలతో వండిన ఆహార పదార్థాలు ఎంపీలు, సిబ్బంది, సందర్శకులకు క్యాంటీన్‌లో అందుబాటులో ఉంచుతారు.

పాక్ మసీదులో తాలిబన్ ఆత్మాహుతి దాడి...

61 మంది దుర్మరణం



పెషావర్: పాకిస్తాన్‌లో తాలిబన్లు దారుణ దాడికి తెగబడ్డారు. సోమవారం పెషావర్‌లో మధ్యాహ్నం ప్రార్థనాల కోసం మసీదుకు చేరుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని తాలిబన్ ఆత్మాహుతి బాంబర్ జరిపిన దాడిలో ఏకంగా 61 మంది ప్రాణాలు కోల్పోయారు. 157 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో పోలీసులు, భద్రత, ఆరోగ్య సిబ్బంది ఎక్కువగా ఉన్నారు. దాడి జరిగిన మసీదు నగరంలోని పోలీస్ లైన్స్ ప్రాంత పోలీస్ ఆఫీస్ సమీపంలో ఉంది. దాంతో ఈ మసీదులో మధ్యాహ్నం ప్రార్థనల్లో ఎక్కువ మంది పోలీసు, ఆర్మీ, బాంబ్ నిర్వీర్య దళాల సభ్యులు పాల్గొన్నారు. అఫ్గాన్‌లో గత ఏడాది ఆగస్టులో తెహ్రీక్ ఈ తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) కమాండర్ ఉమర్ ఖలీద్ ఖురసానీని చంపినందుకు ప్రతీకారంగా పెషావర్ పేలుడు జరిపామని ఖలీద్ సోదరుడు ప్రకటించారు. పేలుడు ధాటికి మసీదు కొంత నేలకూలింది. ఈ శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చని ఒక పోలీసు అధికారి చెప్పారు. ఎస్పీ ఆఫీస్ పక్కనే ఉన్న ఈ మసీదుకు భద్రత ఎక్కువ. మసీదులో నాలుగు అంచెల భద్రత వలయం దాటుకుని మరీ ఆత్మాహుతి బాంబర్ లోపలికొచ్చి దాడి చేయడం గమనార్హం. దాడి సమయానికి ఆ మసీదు లోపల, బయట కలిపి మొత్తంగా 300–400 మంది పోలీసులు ఉండొచ్చని పెషావర్ సిటీ పోలీస్ ఆఫీసర్ ముహమ్మద్ ఇజాజ్ ఖాన్ చెప్పారు. దాడి ఘటనను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు.

మెక్సికోలో కాల్పులు.. 8 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. జెరెజ్ టౌన్‌లోని ఓ నైట్‌క్లబ్‌లో సాయుధ దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దీంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దుండగులు పెద్ద సంఖ్యలో ఆయుధాలతో రెండు వాహనాల్లో ఎల్‌వానాడిటో నైట్‌క్లబ్‌కు చేరుకొని, అక్కడున్న జనంపై కాల్పులు జరిపారని పోలీసులు వెల్లడించారు. ఈ కాల్పుల్లో ఆరుగురు అక్కడికక్కడే మరణించారని, ఆసుపత్రి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారని పేర్కొన్నారు. మృతులు, క్షతగాత్రుల్లో క్లబ్ ఉద్యోగులు, సంగీత కళాకారులు, వినియోగదారులు ఉన్నారని తెలిపారు.

దక్షిణాఫ్రికాలోనూ...

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలోని జిక్యుబెర్హా(పోర్ట్ ఎలిజబెత్)లో ఆదివారం బర్త్‌డే పార్టీలో జరిగిన కాల్పుల్లో 8 మంది చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారు. క్వాజఖెలె టౌన్‌షిప్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో సాయంత్రం 5 గంటల సమయంలో బర్త్‌డే వేడుక జరుపుకుంటున్నారు. ఇద్దరు వ్యక్తులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి పరారయ్యారు. ఇంటి యజమాని సహా 8 మంది ప్రాణాలు కోల్పోగా ముగ్గురు గాయాలపాలయ్యారు. నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు పోలీస్ విభాగం ప్రతినిధి ప్రిసిల్లా నాయుడు చెప్పారు. ఇంటి యజమానితో దుండగులకు వైరం ఉందా? లేక మరేదైనా కారణమా? దర్యాప్తులో తేలనుందని ఆమె అన్నారు.

రష్యా దాడుల్లో ఐదుగురు మృతి

కీవ్: రష్యా దాడుల్లో గత 24 గంటల్లో ఐదుగురు చనిపోగా, మరో 13 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు సోమవారం తెలిపారు. ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖర్కీవ్‌తోపాటు ఖెర్సన్‌పైనా రష్యా భారీగా కాల్పులు సాగిస్తోందన్నారు. దాడుల్లో ఖెర్సన్ పోర్టులోని రెండు విదేశీ పడవలు దెబ్బతిన్నట్లు తెలిపిన అధికారులు, అంతకుమించి వివరాలను వెల్లడించలేదు. డొనెట్స్క్ ప్రాంతంలోనూ భీకర పోరు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ సామర్థ్యాన్ని పెంచేందుకు గల ప్రతి అవకాశాన్నీ నాటో సభ్య దేశాలు పరిశీలిస్తున్నాయని పోలండ్ ప్రధాని మాటీజ్ మొరావికీ సోమవారం చెప్పారు.

..హింసను ప్రేరేపిస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

విలవిల్లాడిపోయా. అలాంటి ఫోన్ కాల్స్ అందుకోవాల్సి రావడంలో ఉండే అంతులేని బాధను, నొప్పిని కశ్మీరీలు అర్థం చేసుకోగలరు. పుల్వామా వంటి ఉగ్ర దాడులకు బలైన ఆర్మీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబాలు అర్థం చేసుకోగలవు. నేను, నా చెల్లెలు అర్థం చేసుకోగలం. అంతేగానీ మతిలేని హింసను ప్రేరేపించే మోదీ, అమిత్ షా (కేంద్ర హోం మంత్రి), అజిత్ దోవల్ (జాతీయ భద్రతా సలహాదారు), ఆరెస్సెస్ నేతల వంటివాళ్లు ఎన్నటికీ అర్థం చేసుకోలేరు. ఎందుకంటే దాని తాలూకు బాధను వాళ్లెప్పుడూ అనుభవించనే లేదు'' అంటూ తీవ్ర విమర్శలు చేశారు. ''సైనికుడు కావచ్చు, సీఆర్పీఎఫ్ జవాను కావచ్చు, కశ్మీరీ కావచ్చు. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే తమ వారు ఇక లేరనే దుర్వార్త మోసుకొచ్చే అలాంటి ఫోన్ కాల్స్‌కు శాశ్వతంగా తెర దించడమే జోడో యాత్ర లక్ష్యం. అంతే తప్ప నా స్వీయ లబ్ధి కోసమో, కాంగ్రెస్ పార్టీ కోసమో కాదు. దేశ ప్రజల కోసం. దేశ పునాదులను నాశనం చేయజూస్తున్న భావజాలానికి అడ్డుకట్ట వేయడమే మా లక్ష్యం'' అని స్పష్టం చేశారు.

కశ్మీర్లో నడవాలంటే వారికి భయం

బీజేపీ అగ్ర నేతలకు దమ్ముంటే తనలా జమ్మూ కశ్మీర్లో పాదయాత్ర చేయాలని రాహుల్ సవాలు విసిరారు. ''అది వారి తరం కాదు. చేయలేరు. ఒక్కరు కూడా జమ్మూ కశ్మీర్లో నాలా నడవలేరు. ఎందుకంటే వారికి అంతులేని భయం'' అంటూ ఎద్దేవా చేశారు. ''కశ్మీర్లో పాదయాత్ర వద్దని నాకు సలహాలొచ్చాయి. బులెట్ ప్రూఫ్ కార్లో చేయాలని స్థానిక యంత్రాంగమూ సూచించింది. నడిస్తే నాపై ఏ గ్రెనేడో వచ్చి పడొచ్చని హెచ్చరించింది. బహుశా నన్ను భయపెట్టడం వారి ఉద్దేశం కావచ్చు. కానీ నేను భయపడలేదు. నన్ను ద్వేషించేవారికి నా తెల్ల టీ షర్టు రంగు (ఎర్రగా) మార్చే అవకాశం ఎందుకివ్వకూడదని ఆలోచించా. ఈ రాష్ట్రం నా సొంతిల్లు. కశ్మీరీలు నావాళ్లు. వాళ్లతో కలిసి నడిచి తీరాలని నిర్ణయించుకున్నా. కశ్మీరీలు నాపై గ్రనేడ్లు విసరలేదు. హృదయపూర్వకంగా అక్కున చేర్చుకున్నారు. అంతులేని ప్రేమతో ముంచెత్తారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మనస్ఫూర్తిగా స్వాగతించి నన్ను తమవాణ్ని చేసుకున్నారు'' అంటూ ప్రశంసించారు. ''నాకు లేనిదీ, బీజేపీ నేతలకున్నదీ భయమే. నిర్భయంగా జీవించడాన్ని మహాత్మా గాంధీ నుంచి, నా కుటుంబం నుంచి నేర్చుకున్నా'' అన్నారు. కాంగ్రెస్ ర్యాలీ అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వద్రాతో పాటు డీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా, బహుజన్ సమాజ్ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, సీపీఐ, ఆర్ఎస్‌పీ, వీసీకే, ఐయూఎంఎల్ నేతలు మాట్లాడారు. తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, జేడీ(యూ) తదితర ముఖ్య పక్షాలు గైర్హాజరయ్యాయి.


సభలో రాహుల్, ప్రియాంక, ఖర్గే, మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా తదితరులు

కశ్మీర్ నా సొంతిల్లు

కశ్మీర్ తన సొంతిల్లని రాహుల్ పదేపదే గుర్తు చేసుకున్నారు. ''రాష్ట్రంలో నడుస్తుంటే అప్పుడెప్పుడో సరిగ్గా ఇవే దారుల గుండా నా పూర్వీకులు కశ్మీర్ నుంచి అలహాబాద్ వెళ్లారన్న ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. నేను నా ఇంటికి తిరిగొస్తున్నట్టు ఫీలయ్యా. ఎందుకంటే నాకంటూ ఓ ఇల్లు లేదు. చిన్నతనం నుంచీ ప్రభుత్వ ఆవాసాల్లోనే బతికాను. వాటిని నా ఇల్లని ఎప్పుడూ అనుకోలేకపోయాను. నా వరకూ ఇల్లంటే ఓ ఆలోచన. జీవన విధానం. కశ్మీరియత్ శివుని ఆలోచనా ధార. శూన్యత్వం. అహంపై పోరాడి గెలవడం. ఇది నన్నెంతో ఆకట్టుకుంది. దీన్నే ఇస్లాంలోనూ ఫనా అన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఈ భావధార ఉంది. నా పూర్వీకులు ఇక్కణ్నుంచి వెళ్లి అలహాబాద్‌లో గంగా తీరాన స్థిరపడి కశ్మీరియత్‌ను యూపీలో ప్రచారం చేశారు'' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నా ఇంటికి వెళ్తున్నట్టు అన్పిస్తోంది' అంటూ జమ్మూ కశ్మీర్లోకి ప్రవేశించే ముందు తల్లి సోనియాకు, తనకు రాహుల్ మెసేజ్ చేశారని ప్రియాంక చెప్పుకొచ్చారు.

సోదరితో సరదాగా...



రాజకీయాలు, ప్రసంగాలు, విమర్శల నడుమ రాహుల్ కాసేపు సోదరి ప్రియాంకతో సరదాగా స్నోబాల్ ఫైట్ చేస్తూ సేదదీరారు. ఒక వీడియోలో రాహుల్ రెండు మంచు ముక్కలను వెనక దాచుకుని ప్రియాంకను సమీపించి ఆమె తలపై కొట్టి ఆట పట్టించారు. ఆమె కూడా ఆయన వెంట పడి తలంతా మంచుతో నింపేశారు. తర్వాత జోడో యాత్ర క్యాంప్ సైట్ వద్ద, అనంతరం పీసీసీ కార్యాలయంలోనూ రాహుల్ జాతీయ జెండా ఎగురవేశారు. యాత్రలో తనతో పాటు కలిసి నడిచిన భారత యాత్రీలకు కృతజ్ఞతలు తెలిపారు. వణికించే చలిలోనూ ఇన్ని రోజులుగా కేవలం తెల్ల టీ షర్టుతోనే యాత్ర చేసిన రాహుల్ ఎట్టకేలకు సోమవారం జాకెట్ ధరించారు. తర్వాత పాదవాటి సంప్రదాయ బూడిద రంగు కశ్మీరీ ఫేరన్ ధరించి ర్యాలీలో, సభలో పాల్గొన్నారు.

ఎవరేమన్నారంటే...

భారత్ జోడో యాత్ర ఎన్నికల్లో గెలుపు కోసం కాదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై దేశ ప్రజలనందరినీ ఒక్కటి చేయగలనని రాహుల్ పాదయాత్రతో నిరూపించారు.
– మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

బ్రిటిష్ పాలనపై ఐక్యంగా పోరాడి స్వాతంత్ర్యం సాధించుకున్నాం. అలాగే బీజేపీ పాలనపైనా పోరుకు లౌకిక శక్తులన్నీ కలిసి రావాలి.
– డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

శాంతి, సౌభ్రాతృత్వాలు కోరుకునే వారికి దేశంలో కొదవ లేదని జోడో యాత్ర నిరూపించింది. దక్షిణం నుంచి ఉత్తరానికి చేసినట్టుగానే దేశ పశ్చిమ కొస నుంచి తూర్పుకు కూడా రాహుల్ పాదయాత్ర చేయాలి. నేను ఆయన వెంట నడుస్తా.
– ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్

రాహుల్‌గాంధీ రూపంలో దేశానికి ఒక నూతన ఆశా కిరణం దొరికింది.
– మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు

విభజన రాజకీయాలు దేశానికెప్పుడూ హానికరమే. వాటిని వ్యతిరేకిస్తూ నా సోదరుడు చేసిన యాత్రకు జనం వస్తారో లేదోనని అని నేను మొదట్లో అనుకున్నా. కానీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా ఆద్యంతం వారు భారీగా తరలి వచ్చి సంఘీభావంగా నిలిచారు. ఐక్యతా స్ఫూర్తిని చాటారు. దేశమంతా యాత్రకు ఇంతగా మద్దతుగా నిలవడం నిజంగా గర్వకారణం.
– ప్రియాంకా గాంధీ వద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండం లో స్నానాలు చేసిన అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



రాజకీయ శక్తిగా వైఎస్ షర్మిల

తెలంగాణలో వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల రాజకీయ శక్తిగా ఎదిగారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గట్టు రాంచందర్ రావు స్పష్టం చేశారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/19.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగిసిన మెడికల్ బోర్డు.. 19 మంది హాజరు..

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో నిర్వహిస్తున్న మెడికల్ బోర్డు సోమవారం ముగిసింది. రెండు రోజులపాటు జరిగిన ఈ మెడికల్ బోర్డుకు మొదటి రోజు 47 మంది ఉపాధ్యాయులు హాజరు కాగా, చివరి రోజు 19 మంది హాజరయ్యారైనట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు జరుపుతున్న నేపథ్యంలో నిర్వహించిన ఈ మెడికల్ బోర్డు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొంది. ఇందులో పూర్తి ఆరోగ్య వంతులు కూడా హాజరై బదిలీ నుంచి తప్పించుకునేందుకు తాము అనారోగ్యంతో ఉన్నామని నిరూపించుకునే ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. మెడికల్ బోర్డులో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల, ఆర్ఎంవో డాక్టర్ నవీ న, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

స్పౌజ్ టీచర్లకు పోస్టింగ్‌లు

కరీంనగర్: జీవో 317 అమలులో భాగంగా వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన భార్యాభర్తల (స్పౌజ్) ఉపాధ్యాయులకు ఎట్టకేలకు సోమవారం డీఈవో జనార్దన్‌రావు 75 మందికి కౌన్సెలింగ్ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. 13 జిల్లాల్లో బదిలీలను నిషేధించడం వల్ల స్పౌజ్ ఉపాధ్యాయులు ఏడాది కాలంగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. దీంతో తాజాగా చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 615 మంది దంపతులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాకు 77 మంది స్పౌజ్ ఉపాధ్యాయ దంపతులు జిల్లాకు రాగా 75 మంది ఉత్తర్వులు అందుకున్నారు. స్పౌజ్ ఎస్‌జీటీ ఉపాధ్యాయులు మాత్రం హైదరాబాద్ కేంద్రంగా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

తారకరామా..
మా ఇంటికి రావా!

- మంత్రి కేటీఆర్ ప్రసన్నానికి హుజూరాబాద్ నేతల తహతహ
- ఇంటికి రావాలంటూ గెల్లు, పాడి, కసుమల్ల ఆహ్వానాలు
- నేడు కరీంనగర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన
- ఆర్అండ్‌బీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ప్రారంభం
- అనంతరం జమ్మికుంటలో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గంగుల కమలాకర్



సాక్షిప్రతినిధి, కరీంనగర్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలక ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించిన కరీంనగర్ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ (కేసీఆర్) ప్రారంభోత్సవంతోపాటు రూ.3 కోట్లతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. మంత్రి కేటీఆర్ వెంట జిల్లాకు చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నగర మేయర్ వై.సునీల్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయగణపతి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొననున్నారు. అనంతరం హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత జమ్మికుంటకు చేరుకొని భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం జమ్మికుంట నుంచి హుజూరాబాద్ చేరుకొని హెలికాప్టర్ ద్వారా సీఎం క్యాంప్ ఆఫీస్ బేగంపేట్‌కు చేరుకోనున్నారు.

బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు..

జమ్మికుంట పట్టణంలో తలపెట్టిన బీఆర్ఎస్ బహిరంగ సభకు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. గత ఉప ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డినా పార్టీ ఓటమి చెందడం, బీజేపీకి చెందిన ఈటల రాజేందర్ విజయం సాధించడంతో హుజూరాబాద్ నుంచే బీఆర్ఎస్ సత్తా చాటేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసిందని చెప్పవచ్చు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతోపాటు, హుజూరాబాద్‌కు దళితబంధు, ప్రత్యేక నిధులు వెచ్చించిన అంశాన్ని బహిరంగ సభ ద్వారా మరోసారి కేటీఆర్ ప్రజలకు వివరించనున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జడ్పీ చైర్‌పర్సన్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ సైతం సభ విజయవంతానికి ప్రత్యేక దృష్టిసారించారు. బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం మంత్రి గంగుల కమలాకర్ పరిశీలించారు. ఆయన వెంట.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు తదితరులు ఉన్నారు.

మా ఇంటికి రండి..

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ఇదే అదునుగా హుజూరాబాద్‌కు చెందిన నేతలు ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ ఇంటికి రావాలని కేటీఆర్‌ను ఆహ్వానించినట్లు సమాచారం. బహిరంగ సభకు ముందు మంత్రి కేటీఆర్‌తోపాటు పార్టీ ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునేందుకు జనసమీకరణతో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.

షెడ్యూల్ ఇదే..

- ఉదయం 8.30లకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరుతారు. (బై హెలికాప్టర్)
- 9.15లకు కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 9.30లకు కరీంనగర్ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ (కేసీఆర్)ను ప్రారంభిస్తారు.
- 10 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తారు.
- 10.30లకు కరీంనగర్ నుంచి హెలికాప్టర్ ద్వారా కమలాపూర్‌కు వెళ్తారు.
- మధ్యాహ్నం 2 గంటలకు కమలాపూర్ నుంచి ప్రయాణం.
- 2.30లకు జమ్మికుంటకు వస్తారు.
- 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జమ్మికుంటలో బహిరంగ సభలో పాల్గొంటారు.
- సాయంత్రం 5.15లకు హుజూరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు చేరుకుంటారు.



శ్రీవారి కల్యాణానికి హాజరైన భక్తులు



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

రమణీయం.. కల్యాణం

కరీంనగర్‌కల్చరల్: ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలు.. విశేషాలంకరణలు.. గోవింద నామ స్మరణలు.. వెల్లువెత్తిన భక్తిపారవశ్యం.. జనసందోహ జయజయధ్వానాల మధ్య శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ నారాయణస్వామి కల్యాణాలను అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు. - 8లో▸

ప్రజావాణికి 171 దరఖాస్తులు

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్‌కల్చరల్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 171 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు అక్కడికక్కడే పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్, జెడ్పీ సీఈవో ప్రియాంక, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కర్ణన్

పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో మహాత్మాగాంధీ వర్ధంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడుతోపాటు పలువురు పోలీసు అధికారులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. అహింస, శాంతియుత మార్గాలలో పయనించి ప్రపంచానికి శాంతి దూతగా నిలిచిన మహోన్నతుడని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ (శాంతి భద్రతలు) ఎస్.శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి వై.వి మునిరామయ్య, ఎస్‌బీఐ జి.వెంకటేశ్వర్లు, పరిపాలన విభాగం సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీ సుబ్బారాయుడు

క్వింటాల్ పత్తి ధర రూ.7,850

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,850 పలికింది. మార్కెట్‌కు 145 వాహనాల్లో 1,980 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,850, మోడల్ ధర రూ.7,800, కనిష్ట ధర రూ.7,000 చెల్లించారు. గన్నీ సంచుల్లో తెచ్చిన పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,600, మోడల్ ధర రూ.7,550, కనిష్ట ధర రూ.6,500 పలికింది.

ఇన్‌చార్జి చైర్మన్‌గా శ్రీనివాస్

- జగిత్యాల మున్సిపల్ ఉత్కంఠకు తెర
- భోగ శ్రావణి రాజీనామా ఆమోదం
- వైస్ చైర్మన్‌కే ఇన్‌చార్జి బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ రవి
- బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా వ్యవహారంలో ఇన్ని రోజులు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. రాజీనామా ఆమోదిస్తారా.. లేదంటే రాజీకి వెళ్తారా.. అనే అనుమానాలకు ఎట్టకేలకు ఫుల్‌స్టాప్ పడింది. చైర్‌పర్సన్ భోగ శ్రావణితో చర్చించిన కలెక్టర్ రవి.. ఆమె రాజీనామాను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

కలెక్టర్ కార్యాలయానికి పిలిచి..

సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చైర్‌పర్సన్ శ్రావణిని కలెక్టర్ రవి పిలిచారు. 'ఈ లేఖ మీరే రాశారా..? ఫోర్జరీ ద్వారా వచ్చిందా..? రాజీనామా ఎందుకు చేశారు..? అనే విషయాలు తెలుసుకున్నారు. ఆమె స్పందిస్తూ.. 'నా ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశా. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వేధింపుల వల్లే' అని పేర్కొన్నారు. ఆ విషయాన్ని లేఖ ద్వారా ఇవ్వాలని కలెక్టర్ సూచించగా వెంటనే మరోసారి లేఖ రాసి ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు రాజీనామా ఆమోదించారు.

నాటకీయ పరిణామాల మధ్య..

నెల రోజులుగా జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ విషయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు ఈనెల 21న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు లేఖ ఇచ్చారు. అప్పటి నుంచి అవిశ్వాసం రగులుకుంటూ వచ్చింది. మొత్తం 33 మంది సభ్యులు శ్రావణి ఉండవద్దని మొదటి నుంచి ఏకతాటిపై ఉన్నారు. చివరగా 27 మంది ఎమ్మెల్యేకు లేఖ ఇచ్చారు. తదుపరి ఒక్కొక్కరుగా అవిశ్వాసం కాకుండా చైర్‌పర్సన్‌ను దింపేయాలనే నిర్ణయానికి వచ్చా రు. ఈ పరిణామాలన్నింటి మధ్య తానే రాజీనామా చేయాలని చైర్‌పర్సన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆ పరిణామం అధిష్టానానికి ఇబ్బందికరంగా మారింది. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందరినీ సమన్వయం చేసి రాజీనా మా వెనక్కి తీసుకునేలా ప్రయత్నం చేసేలా చూద్దాం అనుకునే లోపే చైర్‌పర్సన్ ప్రెస్‌మీట్ పెట్టి నిర్ణయం వెల్లడించారు. అంతేకాదు ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఖచ్చితంగా ఆమెను పదవి నుంచి తొలగించాల్సిందేనని మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేపై కౌన్సిలర్లు ఒత్తిడి తీసుకువచ్చారు. అప్పటికే రాజీనామా లేఖ పంపించినప్పటికీ మూడు రోజుల అనంతరం కలెక్టర్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను పదవీ నుంచి తొలగించడంతో తాము విజయం సాధించామని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు.



చైర్మన్‌గా ఉత్తర్వు కాపీ అందుకుంటున్న శ్రీనివాస్



రాజీనామా లేఖను అందజేస్తున్న భోగ శ్రావణి

చైర్‌పర్సన్ పదవికే రాజీనామా..

కలెక్టర్ పిలిచి వివరణ కోరిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. చైర్‌పర్సన్ పదవికి మాత్రమే రాజీ నామా చేశానని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ చైర్‌పర్సన్ శ్రావణి పేర్కొన్నారు. పదవిలో ఉ న్నా ఏమీ చేయలేకపోతున్నామని, ఎమ్మెల్యే వేధింపులు భరించలేకనే వదిలేశానని చెప్పారు. ఉద్యమకా రులకు ఇస్తారో, బడా కాంట్రాక్టర్లకు ఇస్తారో చూడాలని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ మరోసారి రాజీనా మాపై వివరణ కోరారని, తన ఇష్టపూర్వకంగా రాజీ నామా చేసినట్లు ఒప్పుకున్నానని వెల్లడించారు.

మూడేళ్లకే రాజీనామా..

జగిత్యాల మున్సిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఆరుగురు చైర్మన్లు పనిచేశారు. ఏ చైర్మన్ అయినా పూర్తిస్థాయిలో ఐదేళ్లపాటు పనిచేశారు. కానీ.. జగిత్యాల చరిత్రలో టీఆర్ఎస్ మొదటిసారి పాలకవర్గంలోనే మూడేళ్లకే రాజీనామా చేయడం గమనార్హం.

కొత్త చైర్మన్‌కు అన్ని బాధ్యతలు..

- తెలంగాణ 2009 సెక్షన్ 34 ప్రకారం వైస్ చైర్మన్ శ్రీనివాస్‌కు బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కమిషనర్ బోనగిరి నరేశ్ చైర్మన్ బాధ్యతల ఉత్తర్వు కాపీ అందించారు. ఇదిలా ఉంటే.. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు పూర్తిస్థాయి అధికారం ఉంటుంది.

స్టేట్ ఎలక్షన్ కమిషన్ నుంచి మళ్లీ చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ వచ్చేంత వరకు ఆయనే ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతారు. తదుపరి శ్రావణి రాజీనామా సమాచారాన్ని అధికారులు స్టేట్ ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆశావహుల హడావుడి..

మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణి రాజీనామా ఆమోదం కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్‌తో అప్పుడే సమావేశమయ్యారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగానే చైర్‌పర్సన్ ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది. బీసీ మహిళ జనరల్ జగిత్యాల మున్సిపల్‌కు కేటాయించారు. ఇప్పటికే గతంలో చైర్‌పర్సన్ పదవిని ఆశించిన వారిలో సమిండ్ల వాణి, బండారు రజిని ఉండగా, ప్రస్తుతం వారి పేర్లే మళ్లీ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాజీనామా చేసిన బోగ శ్రావణి పద్మశాలీ వర్గానికి చెందిన వారు కావడంతో అదే వర్గానికి చెందిన అడువాల జ్యోతికి ఇవ్వాలని ఆ వర్గం కోరుతోంది.


శ్రావణి పయనం ఎటు..?

బోగ శ్రావణి మొదటిసారి 37 వార్డు నుంచి గెలుపొందారు. ఆమె మామయ్య వెంకటేశ్వర్లు గతంలో టీడీపీ నుంచి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఎమ్మెల్సీ రమణ అనుచరుడిగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సైతం అప్పట్లో కొనసాగారు. ఆయన వారసురాలిగా రాజకీయ అరంగేట్రం చేసిన శ్రావణి వృత్తిరీత్యా డాక్టర్. కౌన్సిలర్‌గా గెలిచిన ఆమెకు అతిచిన్న వయస్సు (27 ఏళ్లలోనే)లోనే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవీ వరించింది. కానీ.. ఆ పదవి మూడేళ్ల ముచ్చటే అన్నట్లు మిగిలిపోయింది. నాటకీయ పరిణామాల మధ్య ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది. కాగా.. శ్రావణి కొద్దిరోజుల క్రితం బీజేపీ అగ్ర నాయకులతో మంతనాలు జరిపారనే ఆరోపణలు సైతం వినిపించాయి. త్వరలో బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటారనే వార్తలు సైతం వస్తున్నాయి.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

శ్రావణి రాజీనామాతో వైస్‌చైర్మన్‌గా ఉన్న నన్ను చైర్మన్‌గా నియమించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో తోటి కౌన్సిలర్లతో సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తా. కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే వరకు పారిశుధ్యం, ఇతరత్ర పనులపై శ్రద్ధ చూపి పట్టణాభివృద్ధిలో పాలుపంచుకుంటా.

– గోలి శ్రీనివాస్, మున్సిపల్ కొత్త చైర్మన్



కలెక్టర్ ఉత్తర్వు కాపీ

గోలి శ్రీనివాస్ ప్రొఫైల్..

- ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్ ఆర్య వైశ్యుడు. వయస్సు 51 సంవత్సరాలు. ఇంటర్ వరకు చదువుకున్న శ్రీనివాస్ వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు.
- గతంలో కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రోత్సాహంతో రాజకీయ అరంగేట్రం చేశారు. 44వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించారు.
- ఎప్పుడైనా మైనార్టీలకు దక్కే వైస్ చైర్మన్ పదవీని శ్రీనివాస్ దక్కించుకున్నారు.
- అనూహ్య పరిణామాల నేపథ్యంలో బోగ శ్రావణి తన పదవీకి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు చైర్మన్‌గా అవకాశం వచ్చింది.

క్లుప్తంగా

విప్రో సంస్థకు అల్ఫోర్స్ విద్యార్థినుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఎస్.జాహ్నవి, ఎ.హేమ గతేడాది విప్రో సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ లర్నింగ్ ప్రోగ్రాంకు ఎంపికై స్కాలర్ ట్రెనీ ఉద్యోగ నియామక పత్రాలు ఈ మెయిల్ ద్వారా అందినట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. స్కాలర్ ట్రెనీ ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యాభ్యాసానికి విప్రో సంస్థనే ఆ విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెల్లిస్తుందని చెప్పారు. విప్రో సంస్థకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. విద్యతో పాటు ప్రత్యేక నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థినులు పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్, టీపీఓ డా.బి.వి జయలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

నియామకం



శ్రీనివాస్

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామడుగు మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన చంటి శ్రీనివాస్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇరుగురాల ఆనందం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరుస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచాలి

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.7 లక్షలకు పెంచాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాద్రీ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు 12 నెలలు పని చేసి 11 నెలల జీతం తీసుకుంటూ ఒక నెల జీతం కంటే ఎక్కువ ఐటీ రూపంలో చెల్లిస్తూ ఆవేదనతో బాధపడుతున్నారన్నారు. గరిష్ట పన్ను స్లాబు తక్కువ శాతానికి సవరించాలన్నారు. పన్ను భారం తగ్గించుకునేందుకు ఉన్న ప్రధాన సెక్షన్ 80 'సీ' 2014 నుంచి రూ.1,50,000 ఉందని దీన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. గృహ రుణాలు ఖరీదయ్యాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ఒకే సెక్షన్ ఏర్పాటు చేసి రూ.5 లక్షల వరకు ఇందులో మినహాయింపు ఇస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సొంతింటి కలను నెరవేర్చుకునే అవకాశం కల్గుతుందని పేర్కొన్నారు.



కన్యాదానం చేస్తున్న అర్చకులు



శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రమణీయం శ్రీనివాసుడి కల్యాణం



స్వామివారి కల్యాణంలో నృత్య కళాకారులు

కరీంనగర్‌కల్చరల్: ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలు.. విశేషాలంకరణలు.. గోవింద నామ స్మరణలు.. వెల్లువెత్తిన భక్తిపారవశ్యం.. జనసందోహ జయజయధ్వానాల మధ్య శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణాలను నేత్రపర్వంగా నిర్వహించారు. సోమవారం వేంటేశ్వర స్వామి షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవాల ప్రధాన నిర్వాహకుడు, మంత్రి గంగుల కమలాకర్ నేతృత్వంలో జరిగిన కల్యాణం మంత్రముగ్ధుల్ని చేసింది. తిరుపతి లడ్డూలను మహిళా భక్తులకు వితరణ చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. భక్తజనంతో ఆలయ మాడ వీధులు కిక్కిరిసిపోయాయి. మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు, వ్యవస్థాపక ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ ఉడుతల వెంకన్న, గంప రమేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీవారి పక్షం వహించగా, తిరుమల నుంచి వచ్చిన అన్నమయ్య వంశ 12వ తరం వారసుడు తాళ్లపాక హరినారాయణాచార్యులు అమ్మవార్ల తరపున కన్యాదాతగా వ్యవహరించారు. సాయంత్రం గరుడ వాహనంపై ఆలయ మాడ వీధులలో శ్రీవారు విహరిస్తూ కనువిందు చేశారు. అంతకుముందు ఉదయం కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో, అర్చకులు శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో మంత్రి గంగుల కుటుంబం



గానం చేస్తున్న జెడ్పీ సీఈవో ప్రియాంక



మేయర్ దంపతుల నృత్యం



కల్యాణానికి వస్తున్న సీపీ

ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది

- బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్
- జమ్మికుంటలో కేటీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలన



సభా ప్రాంగణం మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్, సీపీ సుబ్బారాయుడు తదితరులు

జమ్మికుంట(హుజూరాబాద్): సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతున్న బీఆర్‌ఎస్ పార్టీకే ఓట్లు అడిగే నైతిక హక్కు ఉందని బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ గతంలో రైతుబంధు, దళిత బంధు పథకాలను ఇక్కడి నుంచి ప్రారంభించారన్నారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ తొలి సభ అని, కేటీఆర్ స్పీచ్ వినేందుకు ప్రజలంతా ఆసక్తితో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఈటల రాజేందర్ సెంటిమెంట్ సాకుగా చూపి గెలిచాడని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవన్నారు. అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు గుర్తిస్తున్నారని వివరించారు. ఎంపీగా బండి సంజయ్, ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ గెలిచిన తర్వాత ఒక్క రూపాయైనా కేంద్రం నుంచి తెచ్చారా అని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యాం, సీనియర్ నాయకులు దేశిని కోటి, తుమ్మటి సమ్మిరెడ్డి, జమ్మికుంట టౌన్, రూరల్ సీఐలు రామచందర్‌రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన వివరాలు

- ఉదయం 11గంటలకు కరీంగనర్ జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ సర్క్యూట్ హౌస్ ప్రారంభిస్తారు.
- హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో రూ.49 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు.
- కమలాపూర్ నుంచి బైక్ ర్యాలీగా మధ్యాహ్నం 3 గంటలకు జమ్మికుంటలోని బహిరంగ సభకు హాజరవుతారు.

ఎంపీ సంజయ్.. తీరుమార్చుకో..

- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న సునీల్‌రావు

కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని, నిత్యం ఎన్నికల ధ్యాస, అబద్ధాల మాటలతో రాజకీయ పబ్బం గడుపుకోవడం తప్ప మరో పనే లేకుండా పోయిందని, తీరు మార్చుకోవాలని నగర మేయర్ వై.సునీల్‌రావు మండిపడ్డారు. సోమవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏనాడు అభివృద్ధి మాటే ఎరుగని సంజయ్ విద్యుత్, వ్యవసాయం, రైతుల ఆత్మహత్యలు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అంశాలపై వాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేసే దమ్ముందా అంటూ సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేసే ఎంపీ కరీంనగర్‌తో పాటు రాష్ట్రానికి ఏం నిధులు సాధించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ, కొండగట్టు ఆలయాలకు నిధులు తేవడంలో ఎంపీగా వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రసాద్' పథకంలో ఈ ఆలయాలను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. బీజేపీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ ఆదానీ, అంబానీలకు దేశాన్ని దోచిపెడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ అంటేనే ప్రజలు చీకొట్టే రోజులు వస్తున్నాయని, ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్లు గంట కళ్యాణి, గుగ్గిళ్ళ జయశ్రీ, బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, వాల రమణరావు, ఐలేందర్‌యాదవ్, ఎదుల్ల రాజశేఖర్, నాయకులు నక్క కృష్ణ, సుధగోని కృష్ణగౌడ్, ఎడ్ల అశోక్, గంట శ్రీనివాస్, కరీం, అనిల్ పాల్గొన్నారు.

'ఎంపీ సంజయ్ విమర్శలు మానుకోవాలి'



మాట్లాడుతున్న రామకృష్ణారావు

కరీంనగర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రచారం కోసం సీఎం కేసీఆర్‌పై, ప్రభుత్వ విధానాలపై అడ్డగోలు, అవగాహన లేమి విమర్శలు మానుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. సోమవారం ఓ హోటల్‌లో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి కేటీఆర్‌పై బండి సంజయ్ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలకు సిద్ధమేనా అని కేటీఆర్ మాట్లాడితే.. ఎంపీ బండి సంజయ్ ఆ మాటలు సీఎం కేసీఆర్ అనాలని అనడం ఆయన వక్రబుద్ధికి నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్ అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా పెంచిన ఏసీడీ చార్జీలు భారంగా ఉన్నాయని, కట్టవద్దని ప్రజలకు పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ ఉన్న ఉద్యోగాలపై వేటు వేస్తూ దేశాన్ని అధోగతిపాలు చేస్తుందని మండిపడ్డారు. ఎంపీ సంజయ్‌కి చేతనైతే ఏడాది పదవీకాలంలో అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలని, లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోతారన్నారు. సమావేశంలో చీటి రాజేందర్‌రావు, ఉదారపు మారుతి, వెంకట్‌రెడ్డి, సంతోష్, వొల్లాల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన కాంపెల్లి తిరుపతికి విద్యుత్ చౌర్యం కేసులో జిల్లా కోర్టు జైలు శిక్ష విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తూ పట్టుబడగా రూ.500 జరిమానా విధించి మొదటి తప్పుగా క్షమించడమైందన్నారు. విద్యుత్ అధికారులు తనిఖీలు నిర్వహించగా మళ్లీ రెండోసారి అనుమతి లేకుండా విద్యుత్‌ను వాడుతూ దొరకగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి భవానిచంద్ర ఈ కేసుపై విచారణ జరిపి నిందితుడు విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు తేలడంతో రూ.21,108 జరిమానా చెల్లించాలని లేదా మూడునెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

ఇద్దరిని బలిగొన్న రోడ్డు ప్రమాదాలు

- రాజీవ్ రహదారిపై జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు మృతి



శ్వేతారెడ్డి మృతదేహం



భూదమ్మ (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై సోమవారం రెండు గంటల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మహిళల ప్రాణాలు గాల్లో కలిశాయి. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల మధ్యలో రెండు ప్రమాదాలు జరిగాయి. పోలీసులు ఒక ప్రమాదం వద్దకు చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్ క్లియర్ చేసి తిరిగి వెళ్లే సమయంలో మరో ప్రమాదం జరిగింది. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం.. ఉదయం 7.30 గంటలకు కొత్తపల్లి స్టేజ్ వద్ద కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న టిప్పర్.. యూటర్న్ చేసుకునే సమయంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన చాడ సతీశ్‌రెడ్డి- శ్వేతారెడ్డి(35) దంపతులు గాయపడ్డారు. యూటర్న్ సమయంలో చౌరస్తా వద్ద హోటల్ సమీపంలో కారు నిలిపి ఉంది. ఈ క్రమంలో టిప్పర్ మధ్య భాగంలో ఉన్న టైర్‌కు సతీశ్‌రెడ్డి బైక్ తగలడంతో ఇద్దరూ కిందపడ్డారు. టిప్పర్ డ్రైవర్ గమనించకుండా లారీని ముందుకు పోనివ్వడంతో శ్వేతారెడ్డి పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. వీరిది చిగురుమామిడి మండలం రేకొండ గ్రామం కాగా రెండేళ్ల క్రితం కొత్తపల్లిలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. తిరిగి ఎల్ఎండీకి వస్తుండగా ఉదయం 9.30 గంటలకు నుస్తులాపూర్ గ్రామానికి చెందిన గట్టు భూదమ్మ (65) నుస్తులాపూర్ నుంచి ఆటోలో రామకృష్ణ కాలనీకి చేరుకుంది. రాజీవ్ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో భూదమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. మృతురాలి వద్ద రూ.60 వేల నగదు ఉండగా కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్వేతారెడ్డికి కూతురు, కొడుకు ఉండగా, భూదమ్మకు కొడుకు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'జోడో' ముగింపు, గాంధీ వర్ధంతి



జెండా ఆవిష్కరణలో నాయకులు

కరీంనగర్‌టౌన్: మహాత్మాగాంధీ వర్ధంతి, భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ నాయకుడు వైద్యుల అంజన్‌కుమార్, పలువురు నాయకులు హాజరై ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన గాంధీ స్ఫూర్తితో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశ సమైఖ్యతకు రాహుల్‌గాంధీ గత సెప్టెంబర్ 7న ప్రారంభించిన భారత్ జోడో యాత్ర 145 రోజులు, 75 జిల్లాలు, 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు, 12 బహిరంగ సభల ద్వారా కొనసాగుతూ 4,080 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. కశ్మీర్ శ్రీనగర్‌లోని లాల్ చౌక్ వద్ద రాహుల్‌గాంధీ జాతీయ జెండాను ఆవిష్కరించగా, వారికి సంఘీభావంగా ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు డీసీసీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్‌నాయక్, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, మడుపు మోహన్, కల్వల రామచందర్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సలీమొద్దీన్, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, దీకొండ శేఖర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో నిర్వహించే కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం 48 ప్రదేశాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జువేరియా తెలిపారు. కరీంనగర్ పట్టణంలో 5,7,11,17,22,27,33,35,37,42,47,51,57వ డివిజన్‌లలో, హుజూరాబాద్ పట్టణంలో 3, 7వ వార్డుల్లో, అదే మండలంలోని చెల్పూరు, పెద్ద పాపయ్యపల్లి, జమ్మికుంట పట్టణంలోని 2, 24వ వార్డుల్లో, మండలంలోని సైదాబాద్, వావిలాల గ్రామాల్లో నిర్వహిస్తారు. వీణవంక మండలం కేంద్రం, చల్లూరు, చిగురుమామిడి మండల కేంద్రం, ములకనూరు, చొప్పదండి పట్టణంలో 3వ వార్డు, రుక్మాపూర్ గ్రామం, ఇల్లందకుంట మండలం కేంద్రం, సిరిసేడు, గంగాధర మండల కేంద్రం, చర్లపల్లిరూరల్, బూరుగుపల్లి, రామడుగు మండల కేంద్రం, గోపాలరావుపేట, రామచంద్రపురం, కొత్తపల్లి మండల కేంద్రం, 9వ వార్డు, ఆసిఫ్‌నగర్, చామనపల్లి, మానకొండూరు మండల కేంద్రం, చెంజర్ల, వేగురుపల్లి, సైదాపూర్ మండల కేంద్రం, ఎలబోతారం, శంకరపట్నం మండలంలో కేశపట్నం, కొత్తగట్టు, తిమ్మాపూర్ మండల కేంద్రం, రామకృష్ణకాలనీ, గన్నేరువరం గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని 18 ఏళ్లు పైబడిన వారందరూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

కరీంనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సీనియారిటీ జాబితాలు, ఖాళీల జాబితాలు తప్పులు లేకుండా ప్రకటించి కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాంసాని ఉమారాణి, తూముల తిరుపతి సోమవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బదిలీలు, పదోన్నతుల జాబితాల్లో అనేక తప్పులు దొర్లి జూనియర్లు సీనియర్లుగా, సీనియర్లు జూనియర్లుగా చూపించబడ్డారని అన్నారు. గతంలో జీవో 317 అమలులో అనేక పొరపాట్లు జరిగి చాలామంది ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని ఏ ఒక్క ఉపాధ్యాయుడు నష్టపోకుండా బదిలీలు, పదోన్నతులు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజమౌళి, కార్యదర్శి ఏ.దామోదర్, రాష్ట్ర కౌన్సిలర్స్ టి.తిరుపతి, బి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి



అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలో రెగ్యులర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా హోటళ్లు, బిర్యాని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు నిర్వాహకులు తోక పేర్లు పెట్టి నడిపిస్తున్నారని తెలిపారు. వాటిలో కుళ్లిన చికెన్, మటన్ బిర్యానీలకు భోజన ప్రియులకు వడ్డిస్తూ ఇష్టారీతిలో వసూళ్లకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఒక క్లర్కు, ఇద్దరు అటెండర్‌లు ఉండాలని, కానీ స్థానికంగా ఉన్న కార్యాలయంలో కేవలం జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగితోనే కార్యాలయం నడుపుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. కలెక్టర్ చొరవచూపి రెగ్యులర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు చెంచాల మురళి, వేముల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి సమ్మేళనం



శోభాయాత్రగా వెళ్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

కరీంనగర్‌కల్చరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ ఆధ్వర్యంలో జిల్లా విద్యార్థి సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభం గార్డెన్స్ నుంచి ఎస్సారార్ కళాశాల వరకు భారీ శోభాయాత్రగా వెళ్లి కాలేజీలో సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ హాజరై మట్లాడారు. విద్యారంగ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచకొండ గిరిబాబు, రాష్ట్ర సమితి సభ్యులు మల్యాల రాకేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూసాల విష్ణు, వేణు, నందు తదితరులున్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: ఆస్తి విషయంలో కక్ష పెంచుకొని దగ్గరి బంధువును కత్తితో తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడిన నేరంలో నిందితుడు మహమ్మద్ షానవాజ్(36)కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.అరుణ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ పట్టణం కశ్మీర్ గడ్డకు చెందిన మహమ్మద్ షానవాజ్ తండ్రి చెల్లెలు కొడుకు అయిన మహమ్మద్ గయాసుద్దీన్ (54) ప్రభుత్వ ఉద్యోగి. షానవాజ్ తండ్రి మహమ్మద్ నవాజ్ బతికి ఉన్న సమయంలో తన మేనత్త అయిన గయాసుద్దీన్ తల్లి పేరా ఆస్తులు రాశాడని, వాటిని తనకు తిరిగి ఇవ్వాలని షానవాజ్, గయాసుద్దీన్‌తో తరచూ గొడవ పడేవాడు. దానికి వారు ఒప్పుకోకపోవడంతో అతడిపై కక్ష పెంచుకున్నాడు. 2018 నవంబర్ 7న మధ్యాహ్నం కూరగాయల కోసం గయాసుద్దీన్ కశ్మీర్‌గడ్డ రైతుబజార్‌కు వెళ్లగా అక్కడ కాచుకొని ఉన్న షానవాజ్ అతడ్ని కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనపై బాధితుడి భార్య సల్మా ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి అరుణ, నిందితుడు షానవాజ్‌కు జైలుశిక్ష, జరిమానా విధించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంచిర్యాల రైల్వే పోలీసుల వివరాల ప్రకారం..జమ్మికుంట, ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య ఏపీ ఎగువ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి 40 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద ఎలాంటి చిరునామా, ఆధారాలు లేవు. ఒంటిపై బ్లూరంగు జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు చొక్కా, మెడకు నల్లటి దారంతో ఆంజనేయుని బొమ్మగల మెటల్ లాకెట్, కుడి చేతికి తెలుపు రంగు ఉంగరం, కుడి చేతిపై ఏ అక్షరం పచ్చబొట్టు ఉంది. పై ఆధారాల ద్వారా మృతిచెందిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులు, మంచిర్యాల ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కెంసారపు సంపత్‌కు సమాచారం ఇవ్వాలని, 83285 12176, 94409 00792 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిస కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాలు.. కరీంనగర్ రాంనగర్‌కు చెందిన తుల్ల శ్రీనివాస్(43) మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేశాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై రోజూ మద్యం తాగి ఇంటికి వెళ్లేవాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఆదివారం మద్యం తాగి రాగా అతడి కుటుంబ సభ్యులు మందలించారు. వారువో ఫంక్షన్‌కు వెళ్తామని, రావాలని అడుగగా రాను అని చెప్పి ఇంట్లోనే ఉన్నాడు. రాత్రి 9.30 గంటలకు కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి బెడ్ రూంలోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు 108కు ఫోన్ చేయగా వారు వచ్చి అప్పటికే మృతిచెందాడని తెలిపారు. తన భర్త మద్యానికి బానిసవడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం మృతుడి భార్య టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా చూడండి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



కరీంనగర్‌సిటీ: వ్యాపారులు రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా చూడాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. కరీంనగర్ పట్టణంలోని బస్టాండ్ నుంచి గీతాభవన్ వరకు ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి ఆర్టీసీ వర్క్‌షాప్, సుభాష్‌నగర్ రోడ్డు వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను సోమవారం ఆమె పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డీసీపీ సుభాష్, సీఐ లక్ష్మీబాబు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం



కరీంనగర్ స్పోర్ట్స్: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ అన్నారు. యువశక్తి యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను సోమవారం ఆయన అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభించారు. ఎన్‌వైకే కో–ఆర్డినేటర్ వెంకటరాంబాబు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ప్రతిభ



కొత్తపల్లి: కరీంనగర్‌లో మాస్టో చెస్ అకాడమీ అండర్–14 విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ఎం.సహర్ష్ తృతీయ స్థానంలో నిలిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ ఫాతిమారెడ్డి తెలిపారు. విద్యార్థిని సోమవారం అభినందించారు.

బాలుర వసతి గృహం తనిఖీ



కరీంనగర్ కల్చరల్: ముకరాంపురలోని వెనకబడిన తరగతుల కళాశాల బాలుర వసతి గృహాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ సంపత్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు.

చేగుర్తి ఇసుక క్వారీ నిలిపివేయండి

- కలెక్టర్‌ను కోరిన గ్రామస్తులు

కరీంనగర్‌రూరల్: చేగుర్తి ఇసుక క్వారీని నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం అందించారు. చేగుర్తి, లింగాపూర్‌లోని మానేరు ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా రోజుకు 200 లారీల్లో తరలిస్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని అన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు క్వారీని నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు తొలగింపు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో సర్వే నంబర్ 105లోని ప్రభుత్వ భూమిని కొందరు పేదలు ఆక్రమించుకొని, సోమవారం గుడిసెలు వేసుకున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకున్నారు. తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అక్కడున్నవారు వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వే యడం చట్టవిరుద్ధమని పేర్కొన్న అధికారులు సిబ్బందితో కలిసి తొలగించారు.

గ్రంథాలయం.. వసతుల నిలయం

- అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో..
- 300 మందికి రూ.5 భోజనం
- నిత్యం వందలాది మంది నిరుద్యోగుల రాక
- ఉదయం నుంచి రాత్రి వరకు చదువు



జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

కరీంనగర్‌కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నోటిఫికేషన్లు వెలువరిస్తుండటంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు కరీంనగర్‌లోని జిల్లా గ్రంథాలయం బాటపట్టారు. కొంతమంది తమ ఇళ్లలోనే పోటీ పరీక్షల మెటీరియల్‌తో సన్నద్ధమవుతుండగా వందలాది మంది పేద అభ్యర్థులు గ్రంథాలయానికి వస్తున్నారు. ఇక్కడ 75,447 పుస్తకాలు అందుబాటులో ఉంచారు. నిత్యం 6 రీడింగ్ రూమ్స్‌లో 450 మంది నుంచి 500 మంది అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ అర్హత సాధించిన 19 మంది, ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు 300 మంది, గ్రూప్స్ 100, జూనియర్ లెక్చరర్‌కు 50 మంది ప్రిపేర్ అవుతున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అనిల్‌కుమార్ తెలిపారు. దీనికితోడు మున్సిపల్ సహకారంతో రోజూ 300 మందికి రూ.5 భోజనం పెడుతున్నారు. 24 గంటల పాటు అభ్యర్థులు చదువుకునేలా వసతులు కల్పించారు. గ్రంథాలయంలో ఏర్పాట్లపై ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కచ్చితంగా ఉద్యోగం సాధిస్తామని చెబుతున్నారు.

సౌకర్యాలు బాగున్నాయి



మాది కరీంనగర్‌లోని రేకుర్తి. రోజూ ఉదయం గ్రంథాలయానికి వచ్చి, చదువుకుంటున్నా. ఎస్సై, కానిస్టేబుల్‌తో పాటు గ్రూప్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న. ఈసారి ఏదైనా ఉద్యోగం కచ్చితంగా సాధిస్తా. గ్రంథాలయంలో సౌకర్యాలు బాగున్నాయి. – వెంకటసాయి, రేకుర్తి

ఉద్యోగం సాధించడమే లక్ష్యం



మాది వ్యవసాయ నేపథ్య కుటుంబం. స్వస్థలం మంచిర్యాల జిల్లా చెన్నూర్. ఎస్సై, కానిస్టేబుల్ ప్రిపరేషన్ కోసం ఇక్కడే హాస్టల్‌లో ఉండి, గ్రంథాలయంలో చదువుకుంటున్న. ఇంతకుముందు కానిస్టేబుల్ పరీక్షల్లో మెయిన్స్ వరకు వెళ్లి కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం మిస్సైంది. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించడమే లక్ష్యం. – సాయికిరణ్, చెన్నూర్

ఉదయం 6 వరకే సీట్లు ఫుల్



మాది రామడుగు మండలం. కరీంనగర్‌లో ఉంటూ గ్రంథాలయంలో గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న. రోజూ ఉదయం 4 గంటల నుంచి లైన్‌లో ఉంటే 6 గంటల వరకే రీడింగ్ రూమ్స్‌లో కుర్చీలన్నీ నిండిపోతున్నాయి. దీంతో ప్లేస్ సరిపోవడం లేదు. సిట్టింగ్ సామర్థ్యం పెంచాలి. – శ్వేత, రామడుగు

ఈసారి ఉద్యోగం సాధిస్తా



గ్రూప్–2, గ్రూప్–4 పరీక్షల కోసం గ్రంథాలయలో ప్రిపేర్ అవుతున్న. ఇక్కడ మాకు కావాల్సిన పుస్తకాలున్నాయి. అవసరాల మేరకు ఎప్పటికప్పుడు పోటీ పరీక్షల పుస్తకాలు తెప్పిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇక్కడే ఉండి, చదువుకుంటున్నా. ఈసారి ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకం ఉంది. – ఎస్.పద్మ, సుభాష్‌నగర్, కరీంనగర్

ప్రిపరేషన్‌కు అనువైన ప్రదేశం



ఎస్సై, కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో 75 మార్కుల గ్రౌండ్ మెరిట్ సాధించా. రోజూ జిల్లా గ్రంథాలయానికి బైక్‌పై వచ్చి, మెయిన్స్ కోసం ప్రిపేర్ అవుతున్నా. గ్రంథాలయంలో అధికారులు అన్నివేళలా సహకారం అందిస్తున్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు అనువైన ప్రదేశం. – అనిల్‌కుమార్, నాగులమల్యాల

24 గంటలూ రీడింగ్ రూమ్స్



ఉద్యోగ అభ్యర్థులు చదువుకునేందుకు 24 గంటలు గ్రంథాలయంలో 6 రీడింగ్ రూమ్‌లను అందుబాటులో ఉంచాం. ఎప్పుడు కొత్త నోటిఫికేషన్లు విడుదలైనా 24 గంటల్లో వాటికి సంబంధించిన పుస్తకాలు తెప్పిస్తున్నాం. – పొన్నం అనిల్‌కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్

కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం బాటలు



గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కరీంనగర్ అభివృద్ధికి స్మార్ట్‌సిటీ హోదాతో బాటలు వేసిందని, పట్టణంలో పనులకు వందల కోట్లు మంజూరు చేసిందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం నగరంలోని పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం కరీంనగర్ సిటీ రెనోవేషన్ పేరిట శిలాఫలకం వేసి, చేతులు దులుపుకుందని విమర్శించారు. కరీంనగర్‌ను లండన్ చేస్తామని ప్రకటనలు చేసిందే తప్ప ఆచరణలో చేసిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో కరీంనగర్ అభివృద్ధికి కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండ సుమ, పెద్దపల్లి జితేందర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణరెడ్డి, జానపద స్వామి, మాసం గణేశ్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు శ్రీనివాస్, అనుమల చంద్రమౌళి, తిరుమలరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ నిధులు సుమారు రూ.500 కోట్లు

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీలో భాగంగా కరీంనగర్‌ను ఎంపిక చేసి, ఇప్పటివరకు సుమారు రూ.500 కోట్లు కేటాయించిందని బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు బేతి మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో కేంద్రాన్ని అభినందించాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి గంగుల కమలాకర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నగరపాలక సంస్థ పాలకవర్గం బాధ్యతలు చేపట్టి, మూడేళ్లయిన సందర్భంగా ఆయన నగర ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు.

'భారత్ జోడో' విజయవంతంపై సంబరాలు



జెండా ఎగురవేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర విజయవంతంపై కరీంనగర్‌లోని గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేసి, స్వీట్లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4 వేల కిలోమీటర్ల పైగా పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. ఈ యాత్ర ద్వారా దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహనతో తమ పార్టీ ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. నాయకులు లింగంపల్లి బాబు, సమద్ నవాబ్, శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, ఎండీ.చాంద్, దండి రవీందర్, జీడీ రమేశ్, షబానా మహమ్మద్, కల్వల రామచంద్రం, కీర్తి కుమార్, మంద మహేశ్, ఎంహెచ్.జోహార్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం

నగరపాలక సంస్థ పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లయిన సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని, వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొట్టుకుపోయిన మానేర్ రివర్ ఫ్రంట్ చెక్ డ్యాంల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. స్మార్ట్‌సిటీ పనులు నాణ్యతాలోపంతో జరుగుతున్నాయని పేర్కొన్నారు. కుంటలు కబ్జాకు గురవడం వల్ల వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, ఈ పాపం ఎవరిదని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో నిధులు రాలేదని, తెలంగాణ ఏర్పాటు తర్వాత వస్తున్నాయని మంత్రి గంగుల చెబుతున్నారని, దానికి కారకులు సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ అని చెప్పలేక పోతున్నారని అన్నారు.

గాంధీ మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



కోర్టులో నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు



నివాళి అర్పిస్తున్న నరేందర్ రెడ్డి

కరీంనగర్‌క్రైం: జాతిపిత మహాత్మాగాంధీ 75వ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రం రాజా రెడ్డి, లింగంపల్లి నాగరాజులు మాట్లాడుతూ.. దేశానికి గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు. సీనియర్ న్యాయవాదులు కుసుంబ కృష్ణారావు, కొరివి వేణుగోపాల్, కుమార్ యాదవ్, జగదీశ్ చందర్‌రావు, రామారావు, శివకుమార్, పెరుక శ్రీనివాస్, పెరుక రాజన్న, కొత్త ప్రకాశ్, పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో..

కొత్తపల్లి: స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి పూలమాల వేసి, నివాళి అర్పించారు. దేశ స్వాతంత్రోద్యమంలో గాంధీజీ ఎంచుకున్న అహింసామార్గాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



అగ్ని ప్రతిష్ఠ చేసున్న వేదపండితులు

కరీంనగర్ కల్చరల్: విద్యానగర్‌లోని నవీన కుర్మవాడలో శ్రీ బాల భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతిష్య వాస్తు పండితుడు నమిలకొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. భగవంతుడి ఆరాధన వల్ల బాధలు తొలుగుతాయని రమణాచార్యులు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. తిరువరంగం భరతాచార్యులు, కోదుమగుళ్ల వెంకటరమణాచార్యులు, చిట్యాల భరత్‌కుమార్, రామాచార్యులు, దేవనపల్లి రమేశ్ తదితరులున్నారు.

లౌకిక వ్యవస్థ రక్షణకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఐ నాయకులు

విద్యానగర్: లౌకిక వ్యవస్థ రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి కోరారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి, నివాళి అర్పించారు. గాంధీని చంపిన గాడ్సే వారసులను తరిమికొట్టాలని, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా గాంధీజీ కలలుగన్న సమాజం కోసం పాటుపడాలన్నారు. అనంతరం లౌకిక వ్యవస్థ రక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లమ్మ, కటికరెడ్డి బుచ్చన్న, మచ్చ రమేశ్, నగర కార్యవర్గ సభ్యులు కూన రవి, మామిడిపల్లి హేమంత్ నునావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌యూలో జాతీయ సదస్సు

శాతవాహన యూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమాలు–సాహిత్యం అనే అంశంపై బుధవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమవుతుందని శాతవాహన ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ప్రకటించింది. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సంకసాల మల్లేశ్, విశిష్ట అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, వివిధ యూనివర్సిటీలకు చెందిన పలువురు ప్రొఫెసర్లు హాజరు కానున్నారు. ఆసక్తి గల సాహితీవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్‌జరి కోరారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

విద్యానగర్: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని కరీంనగర్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ డైరెక్టర్ టి.లలితాకుమారి అన్నారు. కరాటేలో శిక్షణ పొందినవారికి సోమవారం పాఠశాలలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో 52 మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో బెల్టులు సాధించారు. వైస్ ప్రిన్సిపాల్ చిత్తరంజన్, కరాటే చీఫ్ ఎగ్జామినర్ కె.వసంతకుమార్, శిక్షకులు రాజశేఖర్, రిషికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన సీపీఎం నాయకులు



సప్తగిరికాలనీ: నూతన పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడును సీపీఎం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా సమస్యలపై చర్చించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడికందుల సత్యం, వర్ణ వెంకటరెడ్డి, బీమా సాహెబ్ తదితరులున్నారు.

మాజీ ఐఏఎస్ మురళి అరెస్టు అప్రజాస్వామికం

విద్యానగర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో లబ్ధిదారులతో కలిసి సోమవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దకు వెళ్తున్న మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ ఒక ప్రకటనలో అన్నారు. మురళి ఆరేళ్ల క్రితం ఆ జిల్లాకు కలెక్టర్‌గా ఉన్నప్పుడే పూర్తయిన 960 ఇళ్లను ఇప్పటివరకు అర్హులకు కేటాయించకపోవడం మూర్ఖత్వమని పేర్కొన్నారు.

హలో బీసీ–చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

విద్యానగర్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నిర్వహించనున్న హలో బీసీ–చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో బీసీ సంఘం నాయకులు ఆవిష్కరించారు. సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోపై ఫిర్యాదు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల ఇన్‌చార్జి ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి సర్వీస్ బుక్‌లో తన పుట్టిన తేదీని దిద్దుకొని, సర్వీసులో అక్రమంగా కొనసాగుతున్నారని కరీంనగర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు కలిసి, ఫిర్యాదు చేశారు. తప్పుడు ధ్రువపత్రాలతో దివ్యాంగుల అలవెన్సులు పొందుతున్న ఎంపీడీవోపై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా తక్కువ వయసుతో ఉద్యోగం చేసిన వ్యవహారంపై గతంలోనే కేసు కొట్టివేశారని ఇన్‌చార్జి ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

ప్రొటోకాల్ పాటిస్తూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి

విద్యానగర్: ప్రొటోకాల్ పాటిస్తూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర ప్రభుత్వ తీరు కోర్టు వరకు వెళ్లడం దురదృష్టకరమని అన్నారు.

'విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తాం'

కరీంనగర్: విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శనిగరపు రజినీకాంత్ అన్నారు. సోమవారం మంకమ్మతోటలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అరవింద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు దృష్ట్యా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11 కేవీ ప్రతిమ ఫీడర్ పరిధిలోని కేసీఆర్ భవనం రోడ్, కార్తికేయనగర్, అయోధ్యనగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఎల్‌ఎండీలో యథేచ్ఛగా మట్టి దందా

- ఎలగందుల వద్ద తవ్వకాలు.. రవాణా
- ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు



ఎల్‌ఎండీలో మట్టి తవ్వకాల దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఎలగందుల పంచాయతీ పరిధి ఎల్‌ఎండీ పరివాహక ప్రాంతంలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మట్టి తవ్వకాలపై నిరంతర నిఘా లేకపోవడం.. తూతూమంత్రంగా అధికారులు తనిఖీలు చేపడుతుండటం అక్రమార్కులకు వరంగా మారింది. విలువైన ఖనిజ సంపద కళ్లెదుటే మాయమవుతుంటే ఏం చేయలేని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరం. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.3,500 నుంచి రూ.4 వేలకు కరీంనగర్, పరిసరాల ప్రాంతాల్లో విక్రయిస్తుండగా.. మట్టిని తవ్వి టిప్పర్‌లో లోడింగ్ చేసేందుకు ఉపయోగించే జేసీబీకి ట్రిప్పునకు రూ.1,000 చెల్లిస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా, పైసా పెట్టుబడి లేకుండా రోజుకు రూ.లక్షల విలువైన మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే మట్టి దందా సాగుతోందన్న ఆరోపణలున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

ఎలగందుల ఎల్‌ఎండీలో అక్రమ మట్టి తవ్వకాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఈ దందాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు అంటున్నారు. మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతంలో ప్రమాదకర గుంతలు ఏర్పడుతున్నాయి. వీటి వల్ల పశువులు, గొర్రెలు, మేకలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి, ఎల్‌ఎండీలో అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఎలగందుల ఎల్‌ఎండీలో తవ్వకాలు చేపట్టి, మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. పలుమార్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టాం. మేము వెళ్లిన సమయాల్లో అక్కడ ఎవరూ లేకపోవడంతో తిరిగివచ్చాం. ఒకవేళ ఎవరైనా పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. – కాళిదాసు, ఏఈ

తెర్రెం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మహిళా మావోయిస్టు అరెస్టు

చర్ల: తెర్రెంలో 2021లో జరిగిన అతిపెద్ద ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న ఒక మహిళా మావోయిస్టును ఆదివారం రాత్రి రాయ్‌పూర్‌కు చెందిన ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఒకటో ప్లాటూన్ సెక్షన్ కమాండర్ మడవి హిడ్మా నేతృత్వాన 2021 ఏప్రిల్ 4న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి టేకులగూడెం–జొన్నగూడ అటవీ ప్రాంతాల్లో మాటు వేసిన మావోయిస్టులు పక్కా పథకం ప్రకారం పోలీసు బలగాలను రప్పించి మందుపాతరలను పేల్చడంతో పాటు రాకెట్ లాంఛర్లతో దాడి చేశారు. ఈ ఘటనలో 22 మంది జవాన్లు మృతిచెందగా, 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, కోబ్రా విభాగం జవాన్ ఒకరిని మావోయిస్టులు పట్టుకెళ్లి ఐదు రోజుల తరువాత విడిచిపెట్టారు. ఈ ఘటన అప్పట్లో ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాన్ని ఆందోళనకు గురి చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న మావోయిస్టుల్లో పలువురిని గతంలోనే అరెస్టు చేయగా, తాజాగా ఆదివారం రాత్రి బీజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం సమీపాన మహిళా మావోయిస్టు మడకం ఉంగిని అరెస్టు చేశారు. ఉంగి స్వగ్రామం బీజాపూర్ జిల్లా ఉడతమల్ల కాగా, ఈమె పదేళ్లుగా మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నట్లు తెలిసింది. ఉంగిని ఎన్‌ఐఏ అధికారులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

6న రాష్ట్ర బడ్జెట్

ఫిబ్రవరి 3 నుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

- 4న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ
- సభను ప్రొరోగ్ చేసి నేడు మరో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం
- రాజ్‌భవన్‌కు శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల
- గవర్నర్ తమిళిసైతో భేటీ అనంతరం తిరిగి ప్రగతిభవన్‌కు..
- శరవేగంగా పరిణామాలు

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 3న ప్రారంభయ్యే అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగంతో మొదలుపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 6న ఉదయం 10.30 గంటలకు ఉభయసభల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా, 8 నుంచి బడ్జెట్‌పై చర్చ నిర్వహించనున్నారు. రాష్ట్ర బడ్జెట్ అంశంపై ప్రభుత్వం, గవర్నర్ నడుమ తలెత్తిన సందిగ్ధత హైకోర్టు వేదికగా తెరపడటంతో ప్రభుత్వం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. గవర్నర్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలపలేదంటూ సోమవారం హైకోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం కొద్ది గంటల్లోనే పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఉభయ సభలనుద్దేశించి చేసే గవర్నర్ ప్రసంగానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి సోమవారం రాత్రి వరకు పలు పరిణామాలు వేగంగా చోటు చేసుకున్నాయి.

గవర్నర్ వద్దకు మంత్రి వేముల

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సందిగ్ధత తొలగడంతో ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు ఆర్థిక శాఖ అధికారులు, అసెంబ్లీ కార్యదర్శి ఈ భేటీలో పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్లో మార్పులు చేస్తూ నోటిఫికేషన్, గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలు, గవర్నర్ వద్ద పెండింగులో బిల్లులు తదితరాల గురించి చర్చించినట్లు సమాచారం. గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలపైనా కసరత్తు జరిగినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు సాయంత్రం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ తమిళిసైతో భేటీ అయ్యారు. ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించాల్సిందిగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానించారు. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సమ్మతి తెలపడంతోపాటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు గవర్నర్ అంగీకరించినట్లు తెలిసింది. గవర్నర్ ప్రసంగంలో ఉండే అంశాలపైనా సూచన ప్రాయంగా గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. అనంతరం వేముల ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌కు ఈ వివరాలు చెప్పినట్లు తెలిసింది.

ప్రొరోగ్ చేసి మరో నోటిఫికేషన్?

ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 12.10 గంటలకు శాసనసభ, శాసన మండలి వేర్వేరుగా సమావేశమవుతాయని ఈ నెల 21న అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ ప్రసంగం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని భావించగా, 3న ఉభయ సభల్లో బడ్జెట్ ప్రవేశపెడతారనే సంకేతాలు వెలువడ్డాయి. తాజా పరిణామాలతో అసెంబ్లీ నిర్వహణ షెడ్యూల్లో కొన్ని మార్పులు జరగనున్నాయి. 2021 సెప్టెంబర్ నుంచి అసెంబ్లీ ప్రొరోగ్ కాకుండానే సమావేశమవుతూ వస్తోంది. ప్రస్తుతం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనుండటంతో వెంటనే అసెంబ్లీని ప్రొరోగ్ చేసి మరో నోటిఫికేషన్‌ను శాసనసభ కార్యదర్శి ఇచ్చే అవకాశముంది. మంగళవారం సాయంత్రంలోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. కాగా, 4వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ, ముఖ్యమంత్రి సమాధానం ఉంటాయి.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

ఎక్మో కాదు.. వెంటిలేటర్‌తో చికిత్స



బనశంకరి: నాలుగు రోజుల కిందట గుండెపోటుకు గురై బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలుగు నటుడు నందమూరి తారకరత్న పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆయన ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు సోమవారం సాయంత్రం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో వైద్యులు పేర్కొన్నారు. తారకరత్నకు ఎక్మో సపోర్ట్ ఇవ్వలేదని, అత్యాధునిక వైద్యపరికరాలతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. సోమవారం నిర్వహించిన వైద్యపరీక్షలపై వివరాలు వెల్లడించలేదు. ఆస్పత్రి వద్దకు అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు పటిష్ట భద్రత కల్పించారు. నిమ్హాన్స్ న్యూరోసర్జన్ డాక్టర్ గిరీశ్ కులకర్ణి నేతృత్వంలో ఇద్దరు న్యూరోసర్జన్లు, నారాయణ హృదయాలయకు చెందిన ఎనిమిదిమందికిపైగా వైద్యనిపుణులు తారకరత్నకు చికిత్స చేస్తున్నారు.

భూపాలపల్లిలో 'డబుల్' పోరాటం

ఇళ్లను ఆక్రమించేందుకు నిరుపేదలతో కలిసి వెళ్లిన రిటైర్డ్ కలెక్టర్ మురళి



పోలీస్‌స్టేషన్‌లో మహిళలతో బైఠాయించిన ఆకునూరి మురళి

భూపాలపల్లి: డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇంకా పంపిణీ చేయడంలేదంటూ నిరుపేదలు ఆక్రమణ బాటపట్టారు. రిటైర్డ్ కలెక్టర్ ఆకునూరి మురళి నాయకత్వంలో ఇళ్లను ఆక్రమించేందుకు యత్నించగా పోలీసులు అడ్డు కొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లిలో సోమవారం జరిగింది. అప్పటి ఎమ్మెల్యే ఎస్.మధుసూదనాచారి, అప్పటి కలెక్టర్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో 2017–18లో 544 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. 2020లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మరో 420 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించగా అవి కూడా చివరిదశకు చేరాయి. ఇళ్లను కేటాయించాలని మహిళలు డిసెంబర్ 28 నుంచి వారంపాటు నిరాహారదీక్ష చేపట్టారు. పోలీసులు దాడి చేసి దీక్షాశిబిరాన్ని తొలగించడంతో ఈ నెల 6న ఆకునూరి మురళిని మహిళలు కలిసి మద్దతు కోరారు. అదేరోజున కలెక్టర్ భవేష్‌మిశ్రాకు వినతిపత్రం అందజేయగా నెలలోపు ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ గడువు ముగిసినా ఇళ్లను కేటాయించకపోవడంతో ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్‌లోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు మురళితోపాటు 100 మంది మహిళలు బైఠాయించారు. తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ఫిబ్రవరి 4న ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్ర

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపణ



మహాధర్నాలో అభివాదం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ: కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్‌టీవో జీఓ–3ను రద్దు చేసే వరకు ఢిల్లీ కేంద్రంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ట్రాయ్ అసంబద్ధ విధానాలను వ్యతిరేకిస్తూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కేబుల్ ఆపరేటర్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులుగా చేసిన చరిత్ర కేబుల్ ఆపరేటర్ వ్యవస్థదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పగిస్తోందని ఆరోపించారు. కేబుల్ ఆపరేటర్ల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కేబుల్ ఆపరేటర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేబుల్ ఆపరేటర్లపై ట్రాయ్ పెత్తనాన్ని అధిగమించేందుకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కేబుల్ ఆపరేటర్లు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జేఏసీ కన్వీనర్ పమ్మి సురేష్, ప్రధాన కార్యదర్శి కిశోర్‌లతో పాటు సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉంది?

- న్యూఢిల్లీ డిఫెన్స్ కళాశాల అధికారుల ప్రత్యక్ష పరిశీలన
- సిద్దిపేట జిల్లాలో పర్యటించిన బృందం



గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న డిఫెన్స్ కళాశాల అధికారులు

గజ్వేల్: తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి తీరును పరిశీలించేందుకు న్యూఢిల్లీకి చెందిన డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం 'నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' పేరిట చేపట్టిన ఐదు రోజుల అధ్యయన యాత్ర సోమవారం సిద్దిపేట జిల్లాలో ప్రారంభమైంది. కళాశాలకు చెందిన ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ ప్రియాంక్ భర్తీతోపాటు 18మంది అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు కూడా బృందంలో ఉన్నారు. ముందుగా సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్‌కు వారు చేరుకున్నారు. వారికి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి 'మిషన్ భగీరథ'పథకం అమలు తీరుతెన్నులను కలెక్టర్‌తోపాటు ఈ పథకం ఈఈ రాజయ్యలు వివరించారు. నీటిలో ఫ్లోరైడ్ కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు అంగవైకల్యంలో నానా ఇక్కట్లు పడేవారని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వారికి వివరించారు. ఆ తర్వాత హరితహారం కార్యక్రమం ద్వారా జిల్లాలో వచ్చిన ఫలితాలను, కంటివెలుగు పథకం తీరుతెన్నులను కలెక్టర్, జిల్లా అటవీశాఖాధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ బృందం సభ్యులకు వివరించారు.

ప్రత్యక్ష పరిశీలనలతో బిజీబిజీ

పథకాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకున్నాక డిఫెన్స్ కళాశాల అధికారులు కేజీ టూ పీజీ విద్యను అందిస్తున్న గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, మల్లన్నసాగర్ సందర్శనలతో బిజీబిజీగా గడిపారు. ఐదురోజులపాటు జరగనున్న ప్రత్యక్ష పరిశీలన, అధ్యయనం వివరాలను కేంద్రానికి నివేదిక రూపంలో అందజేస్తామని డిఫెన్స్ కళాశాల అధికారులు తెలిపారు. కార్యక్రమంలో 'గడా' (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ షోరూంలో రైతు ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి క్రైం: రైతు వద్ద నుంచి సెకండ్ సేల్ కింద కొన్న ట్రాక్టర్‌కు సంబంధించిన డబ్బులు ట్రాక్టర్ షోరూం మేనేజర్ ఇవ్వకపోవడంతో బాధితుడు షోరూంలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితుడు, అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన అంగోత్ ప్రకాశ్ ఏడాది క్రితం జిల్లా కేంద్రంలోని స్వరాజ్ షోరూంలో తన ట్రాక్టర్‌ను సెకండ్ సేల్ కింద విక్రయించాడు. షోరూం మేనేజర్ ట్రాక్టర్‌కు 3.50 లక్షలకు ధర నిర్ణయించి అడ్వాన్సుగా రూ. 50 వేలు ఇచ్చారు. మిగతా డబ్బులు ఇవ్వకుండా ఏడాది నుంచి రేపుమాపు అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అయితే సోమవారం షోరూంకు వెళ్లిన ప్రకాశ్ మేనేజర్‌తో మాట్లాడినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దాంతో భయాందోళనకు గురైన షోరూం సిబ్బంది పోలీసులకు సమాచారమివ్వగా ప్రకాశ్‌ను జిల్లా ఆస్పత్రికి తరలించారు. జిల్లా అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆస్పత్రికి వచ్చి బాధితుని స్టేట్మెంట్ తీసుకున్నారు. బాధితునికి 40 శాతం గాయాలయ్యాయని, మెరుగైన చికిత్స కోసం గాంధీ లేదా ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. తమకు న్యాయం చేయాలని బాధితుని కుటుంబ సభ్యులు వేడుకున్నారు. ఘటన అనంతరం షోరూంకు నిర్వాహకులు తాళం వేశారు. ఫోన్లో సంప్రదించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

సృజనాత్మకత భళా



విద్యార్థులు రూపొందించిన కలెక్టరేట్ చౌక్ నమూనా



పనికిరాని వస్తువులతో తయారు చేసిన మినీకూలర్



వన్ బీహెచ్‌కే నిర్మాణ నమూనా

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థుల సృజనాత్మకత ప్రదర్శనలు ఔరా అనిపించాయి. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా రూపొందించిన ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. కలెక్టర్‌చౌక్, వన్ బీహెచ్‌కే హౌస్, మినీకూలర్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

తెలంగాణలో రాజకీయ శక్తిగా వైఎస్ షర్మిల

- పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి
- వైఎస్సార్టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గట్టు రాంచందర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న గట్టు రాంచందర్‌రావు

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణలో వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల రాజకీయ శక్తిగా ఎదిగారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్టీ రాజకీయ కార్యచరణ కమిటీ సభ్యుడు గట్టు రాంచందర్ రావు స్పష్టం చేశారు. కరీంనగర్‌లో సోమవారం నిర్వహించిన వైఎస్సార్టీపీ ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్సార్టీపీ బలోపేతంపై కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వైఎస్సార్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పాలన రావాలంటే షర్మిలకు పట్టం కట్టాలని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అబద్ధాల పాలన సాగుతోందని, రాష్ట్రాన్ని అప్పులు, ఆత్మహత్యల తెలంగాణగా మార్చిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ఇప్పటివరకు 5,987 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. కౌలు రైతుకు సాయం చేయలేని కేసీఆర్ దేశ పర్యటన చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర మహిళా నేత, పార్టీ రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యురాలు గడిపల్లి కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో కౌరవుల పాలన సాగుతోందని విమర్శించారు. తెలంగాణలో వైఎస్ షర్మిల రాజకీయ శక్తిగా ఎదిగారని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్టీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తండ్రి వైఎస్ఆర్ మాదిరిగానే పోరాట పటిమతో ముందుకు సాగుతున్న షర్మిల సీఎం కావడం ఖాయమన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యుడు నీలం రమేశ్ మాట్లాడుతూ.. వైఎస్సార్ పార్టీగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తీసుకెళ్లే బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. వచ్చే నెల 2 నుంచి షర్మిల పాదయాత్ర తిరిగి ప్రారంభం కానుందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్, రాష్ట్ర విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజు, ఉమ్మడి జిల్లా బాధ్యుడు బెజ్జంకి అనిల్ కుమార్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి కె.వెంకటరమణారెడ్డి, నాయకులు వరాల శ్రీనివాస్, సత్యరాజ్‌వర్మ, రాజేశ్వర్ రావు, డాక్టర్ శివరాం, ఎండీ సలీం, ఎస్కే జావిద్, ఆర్.శ్రీనివాస్, మహిళా నాయకురాల్లు రజితారెడ్డి, రోజారెడ్డి, కవిత, నీరజ, ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానాలో కలెక్టర్ తనయుడికి వైద్యం

ఆదిలాబాద్‌టౌన్: సాధారణ, మధ్యతరగతి ప్రజలే చిన్నపాటి అనారోగ్యానికి సైతం ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తుంటారు. అలాంటిది జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సర్కారు వైద్యంపై నమ్మకంతో స్థానిక రిమ్స్ ఆస్పత్రికి వెళ్లడం చర్చనీయాంశమైంది. ఆమె తనయుడు సారంగ్‌కు చెవి నొప్పి రావడంతో ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సాధారణ వ్యక్తిలా ఓపీ విభాగానికి వెళ్లారు. బాలుడిని పరీక్షించిన ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ హేమంత్ రావు చికిత్స అందించారు. కలెక్టర్ ఆస్పత్రికి వచ్చారన్న విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో 2023– 24 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఫిబ్రవరి 8 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31తో గడువు ముగియనుండగా, విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తుల మేరకు తేదీని పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు.

నాగోబా జాతర ఆదాయం రూ.21.37లక్షలు

ఇంద్రవెల్లి: ఈ నెల 21 నుంచి 28 వరకు కేస్లాపూర్‌లో నాగోబా జాతర కొనసాగింది. ఈమేరకు ఆలయ హుండీని దేవాదాయ, ఐటీడీఏ అధికారులతో పాటు మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. రూ.8 లక్షల 94వేల 835లు సమకూరినట్లు పేర్కొన్నారు. అలాగే తైబజార్ ద్వారా రూ.12లక్షల 42 వేల 178 వచ్చినట్లు తెలిపారు. మొత్తం జాతర ఆదాయం రూ.21,37,013లతో పాటు కానుకల రూపంలో 340 గ్రాములు వెండి సమకూరినట్లు ఈవో రాజమౌళి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, దేవాదాయ శాఖ అధికారులు రవికుమార్, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఏఎస్సై భీంరావ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు, ఉద్యోగ సంఘం సభ్యులు తదితరులున్నారు.

హుండీలో సీఎంకు వినతిపత్రం

స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సింగరేణి కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాగోబా హుండీలో వేసినట్లు లెక్కింపు సందర్భంగా అధికారులు గుర్తించారు. చాలీచాలని పెన్షన్‌తో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కార్మిక సంఘాలేవీ తమను పట్టించుకోవడం లేదని, ఈమేరకు ముఖ్యమంత్రి మానవతాదృక్పథంతో స్పందించి పెన్షన్ పెంచాల్సిందిగా నాగోబా సాక్షిగా వినతిలో కోరారు.



హుండీ లెక్కిస్తున్న అధికారులు, మెస్రం వంశీయులు

'రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం'



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

కరీంనగర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కుతూ కుల, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుతోందని అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. తెలంగాణ విభజన హామీల్లోని ట్రిపుల్ ఐటీ, జిల్లాకో కేంద్రీయ విశ్వవిద్యాలయం, నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. వీటికి విద్యలో 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.6శాతం మాత్రమే కేటాయిస్తూ విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో విద్యకు సంబంధించిన అన్నింటిపై జీఎస్టీ ఎత్తివేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30శాతం నిధులు కేటాయించాల్సి ఉన్న 2014–15లో 10 శాతం కేటాయించి తర్వాత నుంచి ప్రతీ బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తుందే తప్ప పెంచడం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, దేశంలో లౌకికవాద పరిరక్షణకు విద్యార్థులకు కృషి చేయాలని, మతోన్మాదాన్ని వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర నాయకులు నునావత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, బొల్లి రాహుల్, బీరం సాయికృష్ణ, రాహుల్ నాని, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌కు క్రీడా పురస్కారం



ముదాం కిషన్

సప్తగిరికాలనీ(కరీంనగర్):కరీంనగర్ సూర్యనగర్‌కు చెందిన ముదాం కిషన్ జాతీయ క్రీడారత్న పురస్కారానికి ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ తెలిపారు. జాతీయస్థాయిలో క్రీడారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఏటా ఇచ్చే ఈ అవార్డుకు కిషన్‌ను ఎంపికచేశారు. 30 సంవత్సరాలుగా లాన్ టెన్నిస్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో విజయాలను కిషన్ నమోదు చేశారు. తిరుపతిలో మార్చి 12న నిర్వహించే కార్యక్రమంలో అవార్డు అందజేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కిషన్ ఎంపికపై సంస్థ ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, తిరుపతి, గోపాల్ రెడ్డి, వీరారెడ్డి, సాగర్ రెడ్డి, రాంరెడ్డి, బండారి స్వామి, సంపత్ రెడ్డి, మధుకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

'కూతుర్ని ఎవరికో అమ్మేసింది.
ఏ తప్పుడు పనుల్లోనో పెట్టింది'...
భర్త చనిపోయిన సావిత్రి
తన కూతుర్ని పొరుగూరి స్కూల్లో చేర్చాక
ఊరి ఆడవాళ్ల నుంచి ఎదుర్కొన్న నింద అది.
'ఏమైనా సరే నా కూతురు క్రికెట్ ఆడాలి' అనుకుంది సావిత్రి.
అందుకే ఘోరమైన పేదరికంలో కూడా
కూతురి కలలకు అండగా నిలబడింది.
ఇవాళ ఆ కూతురు- అర్చనా దేవి ప్రపంచ విజేతగా నిలిచింది.
'అండర్- 19' క్రికెట్ జట్టులో బౌలర్‌గా, ఫీల్డర్‌గా రాణించి
ఫైనల్స్ గెలవడంలో కీలకంగా మారింది.
ఆడపిల్లల ఆకాంక్షలకు ఎన్ని అవరోధాలు ఉన్నా
తల్లి గట్టిగా నిలబడితే కొండంత బలం అని
తల్లులకు ఈ స్ఫూర్తిగాథ సందేశం ఇస్తోంది.


తల్లి సావిత్రీ దేవితో అర్చన

తల్లికి వందనం

నిందలు పడి కూతుర్ని విజేతను చేసింది

సౌత్ ఆఫ్రికాలో అండర్ 19 టి 20 మహిళా ప్రపంచ కప్. 16 దేశాలు తలపడ్డాయి. మన అమ్మాయిలు కప్ సాధించారు. మొత్తం 16 మంది టీమ్. ఒక్కొక్కరు శివంగిలా మారి అన్ని జట్లతో తలపడ్డారు. ఫైనల్స్‌లో ఇంగ్లాండ్‌ను అతి తక్కువ స్కోర్ (68) వద్ద కట్టడి చేసి 14 ఓవర్లకే మూడు వికెట్ల నష్టానికి విజయం సాధించారు. ఇంగ్లాండ్ జట్టును బౌలర్లు హడలగొట్టారు. వారిలో టిటాస్ సాధు, పార్శవి కాకుండా మూడో బౌలర్ ఉంది. అర్చనా దేవి. కీలకమైన రెండు వికెట్లు పడగొట్టడమే కాకుండా ఒక అద్భుతమైన క్యాచ్ పట్టి మూడవ వికెట్ పడేందుకు కారణమైంది. వరల్డ్ కప్‌లో ప్రతి ఒక్కరిదీ ఒక విజయగాథే అయినా అర్చనా దేవిది భిన్నమైనది.


ఇంగ్లాండ్‌తో ఫైనల్స్‌లో అర్చన క్యాచ్


ప్రపంచ విజేత మన జట్టు

కష్టాలను తట్టుకుని

అర్చనా దేవి (18) సొంత ఊరు ఉత్తరప్రదేశ్ ఉన్నావ్ జిల్లాలోని రతై పూర్వ. గంగానది ఒడ్డునే వీరి పొలం. ఊరు. వరదలతో ఆ పొలం సంవత్సరంలో సగం రోజులు మునకలో ఉండేది. మిగిలిన సగం రోజుల్లో తండ్రి శివరామ్ వ్యవసాయం సాగించేవాడు. కాని ఆయనను 2008లో కేన్సర్ కబళించింది. దాంతో ఊళ్లో ఆడవాళ్లందరూ అర్చనా తల్లి సావిత్రిదేవిని నష్ట జాతకురాలిగా పరిగణించసాగారు. సావిత్రి వెరవలేదు. ఇద్దరు కొడుకులను, కూతురైన అర్చనను రెక్కల కింద పెట్టుకుని సాకసాగింది. దురదృష్టం... ఆఖరు కొడుకు బుద్ధిమాన్ కూడా మరణించాడు. దాంతో సావిత్రిని చూస్తే చాలు ఊరు దడుచుకునేది. 'ఇదో మంత్రగత్తె. మొదట భర్తను మింగింది. తర్వాత కొడుకును' అని... ఎదురుపడితే పక్కకు తప్పుకునేవారు. సావిత్రి దేవి ఇంకా రాటు దేలింది. పిల్లల కోసం ఎలాగైనా బతకాలనుకుంది.

కూతురి క్రికెట్

అర్చనకు క్రికెట్ పై ఆసక్తి, పట్టు కూడా సోదరుడు బుద్ధిమాన్ వల్ల వచ్చినవే. అతను అర్చనను వెంటబెట్టుకుని పొలాల్లో క్రికెట్ ఆడేవాడు. తోడుగా అర్చన బ్యాటు ఝళిపించేది. అర్చన టాలెంట్‌ను బుద్ధిమాన్ వెంటనే గమనించాడు. 'నువ్వు క్రికెటర్‌వి కావాలి' అనేవాడు. అర్చన ఆశలు పెట్టుకుంది కాని తల్లి పెద్దగా పట్టించుకోలేదు. ఒకరోజు బుద్ధిమాన్ బాల్‌ని కొడితే అది దూరంగా చెత్తలో పడింది. వెళ్లి చేతులతో చెత్తను కదిలిస్తూ ఉంటే పాము కరిచింది. తల్లి పరిగెత్తుకుంటూ వచ్చి ఆటోలో ఆస్పత్రికి తీసుకెళుతుంటే కొన ఊపిరితో ఉన్న బుద్ధిమాన్ 'అర్చనను క్రికెట్ మాన్పించవద్దు' అని చెప్పి మరణించాడు. ఆ రోజు సావిత్రి సంకల్పించుకుంది ఎలాగైనా అర్చనను క్రికెటర్ చేయాలని.

స్కూల్లో చేర్చి

అర్చన క్రికెట్ కొనసాగాలంటే చదువును, ఆటలను నేర్పించే స్కూల్లో చేర్పించాలని సావిత్రి నిశ్చయించుకుంది. తమ పల్లెకు 20 కిలోమీటర్ల దూరంలో ఉండే గంజ్ మొరాదాబాద్‌లోని గర్ల్స్ బోర్డింగ్ స్కూల్‌లో చేర్పించింది. వాళ్లుండే పల్లె నుంచి అలా మరో ఊరి బోర్డింగ్ స్కూల్‌లో ఏ ఆడపిల్లా చేరలేదు. అందుకని ఊరి ఆడవాళ్లు సావిత్రిని అనుమానించారు. కూతుర్ని ఎవరికో మంచి బేరానికి అమ్మేసి ఉంటుందని అనేవారు. చెడ్డ పనుల కోసం ఊరు దాటించింది అనేవారు. అవన్నీ సావిత్రీదేవి నిశ్శబ్దంగా భరించింది. కొడుకును ఢిల్లీలో బట్టల ఫ్యాక్టరీలో పనికి పెట్టి తమకున్న ఒక ఆవు, ఒక బర్రె పాల మీద ఆధారపడి కూతురి ఖర్చులను అతి కష్టం మీద చూసేది. 'నేను ఉన్నాను' అని అర్చనకు ధైర్యం చెప్పేది.

దశ తిరిగింది

బోర్డింగ్ స్కూల్లోని ఒక టీచరు అర్చన ప్రతిభను గమనించి కాన్పూరులో ఉండే కోచ్ కపిల్ పాండే దృష్టికి తీసుకెళ్లింది. ఆ టీచరు తీసిన అర్చన బౌలింగ్ వీడియోలు చూసిన కపిల్ పాండే వెంటనే కాన్పూరుకు పిలిపించి అక్కడి క్రికెట్ అసోసియేషన్‌లో జాయిన్ చేసి తన శిష్యురాలిగా తీసుకున్నాడు. కపిల్ పాండే క్రికెటర్ కుల్‌దీప్ యాదవ్‌కు కూడా కోచ్ కావడంతో కుల్‌దీప్ యాదవ్ అర్చనను ప్రోత్సహించాడు. ఆమె శిక్షణకు సాయం అందించాడు.

అతిథులయ్యారు

'ఒకప్పుడు మా ఇంట నీళ్లు కూడా ఎవరూ తాగలేదు. ఇవాళ అందరూ అతిథులుగా వచ్చి మీ దశ తిరిగింది అని భోజనం చేస్తున్నారు' అంది అర్చన తల్లి సావిత్రి. వాళ్ల ఊరిలో ఆ కుటుంబం ఇప్పుడు సగర్వంగా నిలబడింది. తల్లి తన కూతురి ద్వారా అలా నిలబెట్టుకుంది. ఆ తల్లీకూతుళ్లను చూసి ఊరు మురిసిపోతోందిగాని అది ఎన్నో ఎదురీతల ఫలితం. ఎవరో అన్నట్టు... అపజయాల ఆవల విజయ తీరం ఉంటుంది.

అర్చన విజయానికి తెడ్డు వేసిన నావ- ఆ తల్లి సావిత్రీ దేవి. అందుకే అర్చన విజయంలో సగం ఆ తల్లిదే ●

'లక్ష్యాన్ని గెలిచే మహత్తర శక్తి ఎక్కడో లేదు. నీ దగ్గరే ఉంది.
చీకటిని పారదోలే వెలుగురేఖలు ఎక్కడో లేవు. నీ దగ్గరే ఉన్నాయి.
ఆత్మగౌరవం ఉన్నవారి దగ్గర ఆత్మబలం ఉంటుంది.
ఆ బలమే వజ్రాయుధమై అనేక విజయాలు సాధించేలా చేస్తుంది'
అంటోంది'యాన్ ఇండియన్ గర్ల్' షార్ట్‌ఫిల్మ్.

కళ



ఆత్మబలమే అందమై ఆయుధమై..

'యాన్ ఇండియన్ గర్ల్' అనే షార్ట్ ఫిల్మ్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది ప్రియాంక ఖురానా గోయల్. సౌరభ్ లక్ష్యక్ రచన, దర్శకత్వం వహించిన పదకొండు నిమిషాల నిడివిగల 'యాన్ ఇండియన్ గర్ల్' జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 31 అవార్డ్‌లు గెలుచుకుంది. నలుగురు అమ్మాయిల జీవనపోరాటాన్ని కళ్లకు కట్టేలా ఉంటుంది ఈ లఘుచిత్రం. ఆ నలుగురు అమ్మాయిల పాత్రను ప్రియాంకే పోషించింది. ఎన్నో చిత్రోత్సవాలలో 'ఉత్తమ నటి' అవార్డ్ అందుకుంది ప్రియాంక.


ప్రియాంక ఖురానా గోయల్

'ఒక మహిళ విజయం సాధించాలంటే తనపై తనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. సవాళ్లు ఎదురైతే వెనకడుగు వేయని ధైర్యం ఉండాలి. ఎవరి ముందు తలవంచని ఆత్మగౌరవం ఉండాలి' అనే సందేశాన్ని ఇచ్చే చిత్రం ఇది.

'ఈ చిత్రంలో భాగం అయినందుకు సంతోషంగా ఉంది. గృహిణి నుంచి ఉద్యోగం చేస్తున్న మహిళ వరకు అందరికీ సంబంధించిన చిత్రం. తమను తాము చూసుకునే చిత్రం. మహిళలకు వివిధ రంగాలు లేదా అభిరుచికి సంబంధించిన విషయాల్లో ఎంపికలో స్వేచ్ఛ ఉండాలి' అంటుంది ప్రియాంక.

'వివాహం తరువాత కూడా మహిళలు విజయాలు సాధించగలరు' అనే వాస్తవాన్ని నొక్కి చెప్పే వీఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్ ఈ లఘుచిత్రాన్ని నిర్మించింది. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుంది వీఆర్‌పి ఎంటర్‌టైన్‌మెంట్.

తాజా విషయానికి వస్తే...

'యాన్ ఇండియన్ గర్ల్' ఇప్పుడు ఓటీటీ వేదిక(డిస్నీ ప్లస్ హాట్‌స్టార్)కు వస్తోంది. మరింత మంది ప్రేక్షకులకు చేరువకానుంది. ●

హృదయానికి దగ్గరైన మాట... స్త్రీ సాధికారత

ఢిల్లీలో పుట్టిపెరిగిన ప్రియాంక ఖురానా గోయల్ ఐఐఎం, కోల్‌కత్తాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఫ్యాషన్ అండ్ మోడలింగ్ రంగంలోకి రావడానికి ముందు ఒక సెక్యూరిటీ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మిసెస్ ఎర్త్' టైటిల్ 2015లో గెలుచుకుంది. 20 దేశాల నుంచి మహిళలు పాల్గొన్న ఈ పోటీలో తెలివితేటలు, అందం, సామాజికసేవ ఆధారంగా విజేతను ఎంపిక చేస్తారు. ఈ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా గుర్తింపు పొందింది ప్రియాంక. ఆ తరువాత 'మిసెస్ ఇండియా క్వీన్' టైటిల్ గెలుచుకుంది. మోడలింగ్ రంగంలో రాణించిన ప్రియాంక 'యాన్ ఇండియన్ గర్ల్'తో నటనలో తొలి అడుగులు వేసింది. తొలిచిత్రంతోనే అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తెచ్చుకుంది. మోడల్‌గా, ఒక బిడ్డకు తల్లిగా, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా, నటిగా తనను నిరూపించుకుంటున్న ప్రియాంకను 'మీ విజయ రహస్యం ఏమిటీ?' అని అడిగితే 'అన్ని పనులను సమన్వయం చేసుకోవడం. ప్రణాళిక ప్రకారం నడుచుకోవడం' అంటుంది.

ప్రియాంక జీవితంలో యోగ ధ్యానం, నృత్యం భాగమై పోయాయి. ఎప్పుడైనా ఒత్తిడిగా అనిపించినప్పుడు నృత్యాన్ని ఆశ్రయిస్తుంది.

'మహిళలకు సరియైన అవకాశాలు లభిస్తే అద్భుతాలు సృష్టించగలరు' అంటున్న ప్రియాంక ఖురానా గోయల్ హృదయానికి చేరువైన మాట... స్త్రీ సాధికారత. అందుకేనేమో, స్త్రీ సాధికారత కేంద్రంగా నిర్మించిన 'యాన్ ఇండియన్ గర్ల్'లో ఆమె అద్భుతంగా నటించి ప్రశంసలు అందుకుంది.

సాగుబడి
శ్రావణ కార్తె ఫిబ్రవరి 5 వరకు
ధనిష్ఠ కార్తె: ఫిబ్రవరి 6 వరకు

విరబూసిన ప్రకృతి సేద్య పద్మాలు





2023 పద్మశ్రీ పురస్కార గ్రహీతల్లో వ్యవసాయంతో సంబంధం ఉన్న వారంతా (ప్రసిద్ధ ఆక్వా శాస్త్రవేత్త డా. విజయ్‌గుప్తా మినహా) దేశీ వంగడాలతో ప్రకృతి, సేంద్రియ తరహా సేద్య పద్ధతులను ప్రాచుర్యంలోకి తెచ్చిన వారే. అంతేకాదు, నెక్రమ్ శర్మ (హిమాచల్ ప్రదేశ్) 9 పంటల మిశ్రమ ప్రకృతి సాగు చేస్తున్నారు. పతయత్ సాహు (ఒడిషా) ఔషధ మొక్కలను సాగు చేస్తూ ఆయుర్వేద వైద్యం చేస్తున్నారు. చెరువాయల్ రామన్ (కేరళ) దేశీ వరి వంగడాల పరిరక్షణ ఉద్యమకారుడు. తులారామ్ ఉపేతి (సిక్కిం) 80 ఏళ్లుగా వారసత్వ సేంద్రియ సేద్యం చేస్తున్న కురువృద్ధుడు కావటం విశేషం. పురాతన 'అటవీ కృషి' పద్ధతిని పునరుద్ధరించి సిరిధాన్యాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన డా. ఖాదర్ వలి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రొద్దుటూరులో జన్మించినా మైసూరులో స్థిరపడినందున కర్ణాటక కోటాలో ఎంపికయ్యారు. వీరి కృషి గురించి రేఖామాత్రంగా...

తొమ్మిది పంటల మిశ్రమ సేద్యం

నెక్రమ్ శర్మ (59).. మంచు కొండల రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లో మండి జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయదారుడు. ఈ ఏడాది ఆ రాష్ట్రం నుంచి పద్మశ్రీకి ఎంపికైంది ఆయనొక్కరే. ప్రభుత్వ ఉద్యోగం కోసం విఫలయత్నం చేసిన ఆయన తదనంతరం సేద్యాన్నే వృత్తిగా ఎంచుకున్నారు. నాలుగున్నర ఎకరాల వారసత్వ భూమిలో 38 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక వ్యవసాయం వల్ల భూసారం దెబ్బతింటున్నదని గుర్తించి, 22 ఏళ్ల క్రితమే సుభాష్ పాలేకర్ బాటలో ప్రకృతి సేద్యంలోకి మళ్లారు. కనీసం 3 డజన్ల పంటలకు చెందిన దేశీ విత్తనాలను ఆయన పరిరక్షిస్తూ ఇతరులకు స్ఫూర్తినిస్తున్నారు. పది వేల మంది రైతులకు ఆయన ఉచితంగా దేశీయ విత్తనాలు పంచిన ఘనత ఆయనిది.


'నౌ అనజ్' (9 పంటలు) అనే పురాతన ప్రకృతి సేద్య పద్ధతిని శర్మ పునరుద్ధరించారు. పొలంలో కనీసం 9 రకాల పంటలు కలిపి మిశ్రమ సాగు చేస్తున్నారు. తిండి గింజలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, తీగజాతి పంటలను కలిపి ఒకే పొలంలో సాగు చేస్తారు. వానాకాలంలో 9 పంటలు, శీతాకాలంలో మరో 9.. ఏటా 18 పంటలను ఆయన సాగు చేస్తున్నారు. 20 ఏళ్లుగా దేశీ విత్తన పరిరక్షణపై కృషి చేస్తున్నారు. 8 రకాల చిరుధాన్యాలు కూడా ఇందులో ఉన్నాయి. ప్రకృతి సాగు వల్ల 50% నీటి అవసరం తగ్గుతుంది. భూసారం పెరుగుతుంది. దేన్నీ బయట నుంచి తెచ్చి వేసే అవసరం లేదంటారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ మంచి దిగుబడులు సాధిస్తున్నానని, మంచి ఆహారాన్ని ఇష్టపడే స్నేహితులే తనకు బలమని అన్నారు. 'రోజుకు 14 గంటలు పనిచేస్తున్నాను. పద్మశ్రీ అవార్డు బాధ్యతను పెంచింది. ఇక 18 గంటలు పనిచేస్తా'నంటున్నారు నెక్రమ్ శర్మ వినమ్రంగా.

పగలు సేద్యం.. రాత్రి వైద్యం



పతయత్ సాహు (67).. విశిష్ట వ్యవసాయ వైద్యుడు. ఒడిషాలోని కలహండి జిల్లా నందోల్ ఆయన స్వగ్రామం. 40 ఏళ్లుగా దాదాపు 3 వేల ఔషధ మొక్కలను తన ఎకరంన్నర భూమిలో పూర్తి సేంద్రియంగా పెంచుతూ.. ఆ మూలికలతోనే ప్రజలకు వైద్యం చేస్తున్నారు. ప్రతి మొక్క గుణగణాల గురించి తడుముకోకుండా అనర్గళంగా చెప్పగలరాయన. పగలు ఔషధ మొక్కల తోట పనులు స్వయంగా చేసుకుంటూ బిజీగా గడిపే సాహు.. రాత్రిపూట ప్రజలకు వైద్యం చేస్తారు. ఇంతని ఫీజు అడగరు. ఎంత ఇస్తే అంత తీసుకుంటారు. యుక్తవయసులోనే ఆసక్తితో ఔషధ మొక్కలు సేకరించి పెంచటం అలవాటు. తాత ఆయుర్వేద వైద్యుడు. చదువు అయ్యాక తాత దగ్గరే సంప్రదాయ ఆయుర్వే వైద్యం నేర్చుకున్నారు. ఇప్పుడున్న 3 వేల జాతుల ఔషధ మొక్కల్లో చాలా వరకు స్వరాష్ట్రంలో అరణ్యాల్లో నుంచి అటవీ అధికారులతో పాటు వెళ్లి ఎన్నో అరుదైన మొక్కలను సేకరించారు. 500 రకాలను ఒడిషా ఔషధ మొక్కల బోర్డు తోడ్పాటుతో ఇతర రాష్ట్రాల నుంచి సేకరించి సంరక్షిస్తున్నారు. ఔషధ మొక్కల జీవవైవిధ్యానికి ఆయన క్షేత్రం నిలయంగా మారింది. వ్యవసాయంతో వైద్యంతో అనుసంధానం చేయటం విశేషం. అరుదైన ఔషధులను పరిరక్షిస్తూ వాటి ప్రయోజనాలను అక్షరబద్ధం చేసి కొత్త తరానికి అందించటం గొప్ప సంగతి.

'సిరి'ధాన్యాలే నిజమైన ఆహార పంటలు!



డాక్టర్ ఖాదర్ వలి (65).. సంప్రదాయ ప్రకృతి సేద్య పద్ధతి 'అటవీ కృషి' (కడు కృషి) పునరుద్ధరించి సిరిధాన్యాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన అరుదైన స్వతంత్ర శాస్త్రవేత్త. కమతం చిన్నదైనా అందులో 20% విస్తీర్ణంలో అడవిని పెంచుకుంటూ.. మిగతా స్థలంలో సీజనల్ పంటలు సాగు చేయటమన్నది 'అటవీ కృషి'లో ఒక అంశం. 'కడు చైతన్యం' పేరిట ద్రవరూప ఎరువును రూపొందించారు. రసాయనాల్లేకుండా వర్షాధారంగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల మిశ్రమ సాగే మనకు, ప్రకృతికి మేలు చేసే సేద్యమని ప్రచారోద్యమం నిర్వహిస్తున్నారు. కొర్రలు, అండుకొర్రలు, అరికలు, ఊదలు, సామలు వంటి 'సిరిధాన్యాలు' తింటూ హోమియో/ఆయుర్వేద మందులు వాడుతుంటే.. మధుమేహం నుంచి కేన్సర్ వరకు ఏ జబ్బయినా 6 నుంచి 2 ఏళ్లలోగా తగ్గిపోతాయంటారు డా. ఖాదర్. వరి, గోధుమలకు బదులు రోజువారీ ప్రధాన ఆహారంగా సిరిధాన్యాలను ఒక్కో రకాన్ని రెండు, మూడు రోజులు మార్చి మార్చి తినాలి. కొత్తగా అలవాటు చేసుకునే వారు 6 వారాల పాటు అన్నంగా కాకుండా అంబలి రూపంలో, కూరలు నంజుకుంటూ, తాగాలన్నది ఆయన సూచన. ఐదేళ్ల క్రితం డా. ఖాదర్‌ని 'సాక్షి సాగుబడి' తెలుగువారికి తొలిసారి పరిచయం చేసిన సంగతి తెలిసిందే.

సేంద్రియ సేద్య కురువృద్ధుడు




తులారామ్ ఉపేతి.. 98 ఏళ్ల ఉపేతి గత 80 ఎనభయ్యేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. 2023లో పద్మశ్రీ పురస్కారం పొందిన వ్యవసాయదారుల్లోకెల్లా ఈయనే పెద్ద. సిక్కిం తొలి సేంద్రియ వ్యవసాయ రాష్ట్రంగా అభివృద్ధి చెందింది. సేంద్రియ వ్యవసాయం ద్వారా పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో అక్కడి రైతులు ముఖ్యపాత్ర పోషించారు. ఐదో తరగతి చదివిన ఉపేతి చిన్నతనం నుంచి సేంద్రియ వ్యవసాయాన్ని వారసత్వంగా కొనసాగించారు. ఇతర రైతులకు మార్గనిర్దేశం చేశారు. సిక్కిం భారత్‌లో కలవక ముందు టిబెట్‌లోని యటుంగ్‌కు భుజాలపై మోసుకెళ్లి ధాన్యం, మొక్కజొన్నలను అమ్మేవారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న తులారామ్ ఐదారేళ్ల క్రితం వరకు స్వయంగా పొలానికి వెళ్లి పనులు చేయించేవారు.

దేశీ వరి వంగడాలే ప్రాణం!



చెరువాయల్ రామన్ (72).. కేరళకు చెందిన ఆదివాసీ సేంద్రియ రైతు. దేశీ వరి వంగడాల పరిరక్షణ ఉద్యమకారుడు కూడా. వయనాడ్ ప్రాంతంలో మనంతవాడి పంచాయతీలోని కమ్మన గ్రామంలో ఆయన నివశిస్తారు. రామన్ 150 ఏళ్ల నాటి వారసత్వ పూరింట్లోనే, విత్తనాల కుండల మధ్యనే, ఇప్పటికీ నివాసం ఉంటున్నారు. స్థానికంగా 'గార్డియన్ ఆఫ్ నేటివ్ పాడీ'గా ప్రసిద్ధి చెందారు. రామెట్టన్ అని కూడా ఆయన్ను పిలుస్తారు. ఔషధ గుణాలు, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే గుణం వంటి ప్రత్యేకతలు కలిగిన స్వదేశీ వరి రకాలు శతాబ్దాలుగా మన దేశంలో వాడుకలో ఉన్నాయి. అయితే, హైబ్రిడ్, జన్యుమార్పిడి వరి రకాల రాకతో దేశీ రకాలు చాలా వరకు అంతరించిపోయే దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చెరువాయల్ రామన్ తన 4 ఎకరాల పొలంలో 1.5 ఎకరాలను 22 ఏళ్ల క్రితం దేశీ వరి సాగుకు కేటాయించారు (మిగతా పొలంలో ఇతర పంటలు పండిస్తున్నారు). 54 దేశవాళీ రకాల వరిని ప్రతి ఏటా పండిస్తూ సంరక్షిస్తున్నారు. తన జీవితాన్ని దేశీ విత్తనాల పరిరక్షణకే అంకితం చేశారు. వయనాడ్ ప్రాంతంలో కురిచ్య గిరిజన జాతిలో పుట్టిన ఆయన ఆసుపత్రి వార్డెన్‌గా ఉద్యోగం చేసేవారు. అయితే, తమ గిరిజన కుటుంబాలు పురాతన దేశీ వరిసేద్యానికి క్రమంగా స్వస్తి చెబుతుండటాన్ని గుర్తించి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. 2004 నుంచి దేశీ వరి రకాలను ఉద్యమ స్ఫూర్తితో తాను సాగు చేయటమే కాదు. ఆ ప్రాంతంలో రైతులను కూడగట్టి సంఘంగా ఏర్పరిచి దేశీ వరి సాగును విస్తృతం చేశారు. అపురూపమైన దేశీ వరి విత్తనాలు డబ్బు కన్నా విలువైనవని ఆయన భావన. అందుకే విత్తనాలను అమ్మరు. ఉచితంగా ఇస్తారు. పండించిన తర్వాత అంతే పరిమాణంలో విత్తనాలను తనకు తిరిగి ఇవ్వాలి. అదొక్కటే షరతు. కొన్నేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 'జీనోమ్ సేవియర్ పురస్కారం' ప్రదానం చేసి గౌరవించింది.

నీలి విప్లవ మార్గదర్శి



మోదడుగు విజయ్ గుప్తా (83).. ఆక్వాకల్చర్ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన శాస్త్రవేత్త. సముద్రతీర ప్రాంత పట్టణం బాపట్లలో జన్మించారు. మత్స్యకారుల జీవితాల్లో మార్పు తేవాలన్న ఆసక్తితో కృషి చేసి అంతర్జాతీయ స్థాయి మత్స్యశాస్త్రవేత్తగా ఎదిగారు. ఆగ్నేయాసియాలో నీలి విప్లవానికి మార్గదర్శకుడిగా పేరుగాంచారు. 22 దేశాల్లోని చిన్న రైతులు, గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు పౌష్టికాహారం అందించే విధంగా చేపల పెంపకం పద్ధతులను రూపొందించారు. మలేషియాలోని అంతర్జాతీయ సంస్థ వరల్డ్ ఫిష్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పదవీ విరమణ చేసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మన దేశంలో ఉన్న వనరులను ఉపయోగించుకొని చేపల వినియోగాన్ని తలసరిన 5 కిలోల నుంచి 15 కిలోలకు పెంపొందించడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించవచ్చని విజయ్ గుప్తా సూచిస్తున్నారు. ఆక్వా శాస్త్రవేత్తగా ఆయన కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక ప్రపంచ ఆహార బహుమతి (2005)ని, మొదటి సన్‌హాక్ శాంతి బహుమతి(2015)ని గెలుచుకున్నారు.

అవకాడో పండ్ల సాగుపై అవగాహన నేడు

మెక్సికోకు చెందిన అవాకాడో (వెన్నపండు) పండ్ల సాగు తెలుగు రాష్ట్రాల్లో లాంఛనంగా ప్రారంభమవుతోంది. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం అవకాడో సాగుపై ఈ నెల 31 (మంగళవారం) ఉ. 10 గం. నుంచి మ. 2 గం. వరకు సంగారెడ్డిలోని ఫల పరిశోధనా స్థానం (సంగారెడ్డి కొత్త బస్టాండ్ దగ్గర)లో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించనుంది. ఎస్.కె.ఎల్.టి.ఎస్. ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. బి. నీరజా ప్రభాకర్, ఉద్యాన కమిషనర్ ఎం. హనుమంతరావు, ఐఐహెచ్ఆర్ (బెంగళూరు) ప్రధాన శాస్త్రవేత్త డా. జి. కరుణాకరన్, అభ్యుదయ రైతులు టి.వి.ఎస్.ఎన్. వీర అరసు, డా. ఎం. శ్రీనివాసరావు ప్రసంగిస్తారు. సదస్సు తర్వాత డెక్కన్ ఎగ్జోటిక్స్ క్షేత్ర పర్యటన ఉంటుంది. వివరాలకు.. 84552 76451.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



ఆఖరి స్థానంలో అర్జున్

ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నిరాశపరిచాడు. నెదర్లాండ్స్‌లోని విక్ఆన్‌జీ పట్టణంలో ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ నాలుగు పాయింట్లు సాధించి చివరిదైన 14వ స్థానంలో నిలిచాడు. మొత్తం 13 గేముల్లో అర్జున్ ఎనిమిదింటిని 'డ్రా' చేసుకొని, ఐదు గేముల్లో ఓడిపోయాడు. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనీశ్ గిరి (8.5 పాయింట్లు) విజేతగా నిలిచాడు.



సచిన్ టెండూల్కర్ చేతుల మీదుగా సన్మానం

దక్షిణాఫ్రికాలో ఆదివారం ముగిసిన తొలి అండర్-19 మహిళల ప్రపంచకప్ టి20 క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత జట్టుకు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ సన్మానించనున్నాడు. బుధవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో టి20 మ్యాచ్ ప్రారంభానికి ముందు షఫాలీ వర్మ జట్టుకు బీసీసీఐ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. సచిన్ ముఖ్యఅతిథిగా హాజరై భారత యువ జట్టును సత్కరిస్తాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపాడు.

ఆంధ్ర సెమీస్ చేరేనా!

నేటి నుంచి మధ్యప్రదేశ్‌తో క్వార్టర్ ఫైనల్



శశికాంత్

ఇండోర్: ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బోనస్ పాయింట్‌తో గెలిచి... ఇతర జట్ల మ్యాచ్‌ల ఫలితాలూ కలిసి రావడంతో... రంజీ ట్రోఫీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించిన ఆంధ్ర జట్టు... డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో నేటి నుంచి జరిగే క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. గతంలో ఏనాడూ రంజీ ట్రోఫీలో సెమీఫైనల్‌కు అర్హత పొందలేకపోయిన ఆంధ్ర జట్టుకు కొత్త చరిత్ర లిఖించాలని పట్టుదలతో ఉంది. అయితే పటిష్టంగా ఉన్న మధ్యప్రదేశ్‌పై ఆంధ్ర జట్టు గెలవాలంటే మాత్రం సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. ఈ సీజన్‌లో ఆంధ్ర తరఫున బ్యాటింగ్‌లో రికీ భుయ్ (461), కెప్టెన్ హనుమ విహారి (448), అభిషేక్ రెడ్డి (384), కరణ్ షిండే (439) నిలకడగా రాణించారు. ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి (23 వికెట్లు, 146 పరుగులు), షోయబ్ ఖాన్ (21 వికెట్లు, 300 పరుగులు)లతోపాటు బౌలర్లు శశికాంత్ (26 వికెట్లు), లలిత్ మోహన్ (25 వికెట్లు), మాధవ్ రాయుడు (11 వికెట్లు) కూడా మెరిస్తే ఆంధ్ర సంచలన ఫలితం సాధించే అవకాశముంది. బ్యాటింగ్‌లో రజత్ పాటిదార్, హిమాన్షు మంత్రి, శుభమ్ శర్మ... బౌలింగ్‌లో అవేశ్ ఖాన్, సారాంశ్ జైన్, కుమార్ కార్తికేయ, గౌరవ్ యాదవ్ నిలకడగా రాణిస్తూ మధ్యప్రదేశ్ విజయాల్లో కీలకపాత్ర పోషించారు. మంగళవారమే మొదలయ్యే ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో జార్ఖండ్‌తో బెంగాల్; ఉత్తరాఖండ్‌తో కర్ణాటక; పంజాబ్‌తో సౌరాష్ట్ర తలపడతాయి.

రన్నరప్ అనిరుధ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: క్వింపెర్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ భారత్‌కే చెందిన అర్జున్ ఖడేతో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు.



రన్నరప్ ట్రోఫీలతో అనిరుధ్, అర్జున్

ఫ్రాన్స్‌లో జరిగిన ఈ టోర్నీలో ఫైనల్లో అనిరుధ్–అర్జున్ ద్వయం 2–6, 4–6తో టాప్ సీడ్ సాదియో దుంబియా–ఫాబియన్ రెబూల్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్–అర్జున్ ద్వయం 6–3, 1–6, 10–7తో రెండో సీడ్ అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్)–హంటర్ రీస్ (అమెరికా)లపై సంచలన విజయం సాధించింది.

మన హాకీ... మళ్లీ మొదటికి!

కొన్నేళ్ల క్రితం వరకు భారత హాకీ జట్టుకు కొత్త విదేశీ కోచ్ రావడం... కొన్నాళ్లు ఆ పదవిలో కొనసాగడం... అభిప్రాయభేదాలు రావడం... ఆ తర్వాత పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవడం తరచూ జరిగేది. కానీ నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియాకు చెందిన గ్రాహమ్ రీడ్ మాత్రం సుదీర్ఘంగానే ఈ పదవిలో కొనసాగారు. ఆయన ఆధ్వర్యంలో భారత్ చెప్పుకోదగ్గ విజయాలే అందుకుంది. కానీ తాజాగా స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యం నేపథ్యంలో ఆయన చీఫ్ కోచ్ పదవికి రాజీనామా చేశారు. ఫలితంగా హాకీ ఇండియా (హెచ్ఐ) కొత్త కోచ్‌ను వెదికే పనిలో పడింది. ఈ ఏడాది ఆసియా క్రీడలు... వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ ఉండటంతో హాకీ ఇండియా మళ్లీ విదేశీ కోచ్ వైపు మొగ్గు చూపుతుందా లేక స్వదేశీ కోచ్‌కు ప్రాధాన్యత ఇస్తుందా వేచి చూడాలి.

- భారత హాకీ జట్టు చీఫ్ కోచ్ పదవికి గ్రాహమ్ రీడ్ రాజీనామా
- ఏడాదిన్నర ముందుగానే పదవి నుంచి వైదొలిగిన ఆస్ట్రేలియన్
- ప్రపంచకప్ టోర్నీలో టీమిండియా వైఫల్యం నేపథ్యంలో నిర్ణయం
- ఎనలిటికల్ కోచ్, సైంటిఫిక్ అడ్వైజర్ కూడా నిష్క్రమణ



టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్, చీఫ్ కోచ్ గ్రాహమ్ రీడ్ (ఫైల్)

న్యూఢిల్లీ: నాలుగేళ్లుగా నిలకడగా కొనసాగుతున్న భారత పురుషుల హాకీ జట్టు శిక్షణ బృందంలో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయి. స్వదేశంలో అట్టహాసంగా జరిగిన ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు కనీసం క్వార్టర్ ఫైనల్ చేరకపోవడం... చివరకు తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకోవడంతో హాకీ ఇండియా (హెచ్ఐ) దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాదే పారిస్ ఒలింపిక్స్ ఉండటం... ఈ సంవత్సరం ఆసియా క్రీడల టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు నేరుగా పారిస్ ఒలింపిక్ బెర్త్ దక్కనున్న నేపథ్యంలో హెచ్ఐ ప్రస్తుతం ఉన్న శిక్షణ బృందాన్ని మార్చాలని నిశ్చయించింది. హెచ్ఐ భవిష్యత్ ప్రణాళికల్లో తన పేరు ఉండే అవకాశం లేదని గ్రహించిన ప్రస్తుత చీఫ్ కోచ్ గ్రాహమ్ రీడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతోపాటు ఎనలిటికల్ కోచ్ గ్రెగ్ క్లార్క్, సైంటిఫిక్ అడ్వైజర్ మిచెల్ డేవిడ్ పెంబర్టన్ కూడా తమ రాజీనామా లేఖలను హెచ్ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీకి సమర్పించారు. ఆస్ట్రేలియాకు చెందిన 58 ఏళ్ల రీడ్ 2019 ఏప్రిల్‌లో భారత జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఒప్పందం ప్రకారం ఆయన 2024 జూలై–ఆగస్టులో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల వరకు పదవిలో ఉండాలి. అయితే స్వదేశంలో జరిగిన ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు కనీసం క్వార్టర్ ఫైనల్ కూడా చేరకపోవడం... స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వకపోవడం... పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచడంలో వైఫల్యం...ఆటగాళ్ల మధ్య సమన్వయలేమి... వెరసి రీడ్ రాజీనామాకు దారి తీశాయి. భారత్ 1975 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత మరోసారి ఈ మెగా ఈవెంట్‌లో సెమీఫైనల్ దశకు చేరుకోలేకపోయింది.

ఒలింపిక్ పతకం వచ్చినా...

రీడ్ నాలుగేళ్ల శిక్షణ కాలంలో భారత హాకీ జట్టు చెప్పుకోదగ్గ విజయాలు సాధించింది. భారత జట్టు 41 ఏళ్ల ఒలింపిక్ పతక నిరీక్షణకు తెరదించడంలో రీడ్ సఫలమయ్యారు. ఆయన శిక్షణలోనే భారత్ 2021 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం గెలిచింది. 2021–2022 ప్రొ లీగ్ సీజన్‌లో మూడో స్థానం సంపాదించింది. 2019లో చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాదే భువనేశ్వర్‌లో జరిగిన ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత్ గెలిచి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత పొందింది. 'చీఫ్ కోచ్ పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు వేరేవారికి అప్పగించే సమయం వచ్చింది. భారత జట్టుతో, హాకీ ఇండియాతో కలిసి పనిచేసినందుకు గర్వంగా ఉంది. ఈ నాలుగేళ్ల కాలంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. భవిష్యత్‌లో భారత జట్టుకు మంచి విజయాలు లభించాలని కోరుకుంటున్నాను' అని రీడ్ వ్యాఖ్యానించారు. రీడ్, గ్రెగ్ క్లార్క్, మిచెల్ డేవిడ్ రాజీనామాలను ఆమోదించినట్లు హాకీ ఇండియా (హెచ్ఐ) అధ్యక్షుడు దిలీప్ టిర్కీ తెలిపారు.

భారత హాకీ జట్టుకు తొలి విదేశీ కోచ్‌గా వ్యవహరించిన ఘనత జర్మనీకి చెందిన గెరార్డ్ రాచ్‌కు దక్కుతుంది. ఆయన 2004 జూలైలో టీమిండియాకు తొలి విదేశీ కోచ్ అయ్యారు. 2007 ఫిబ్రవరిలో ఆయన రాజీనామా చేసి వెళ్లిపోయారు. 2009 మేలో స్పెయిన్‌కు చెందిన జోస్ బ్రాసా కోచ్‌గా వచ్చి 2010 నవంబర్ వరకు ఆ పదవిలో కొనసాగారు. 2011 జూన్‌లో ఆస్ట్రేలియాకు చెందిన మైకేల్ నాబ్స్ ఐదేళ్ల కాలానికి భారత జట్టుకు కోచ్‌గా వచ్చారు. కానీ ఆయన రెండేళ్లు మాత్రమే

గతంలోనూ...

ఆ పదవిలో కొనసాగి 2013 జూన్‌లో వెళ్లిపోయారు. అనంతరం ఆస్ట్రేలియాకే చెందిన టెర్రీ వాల్ష్ 2013 అక్టోబర్ నుంచి 2014 అక్టోబర్ వరకు... నెదర్లాండ్స్‌కు చెందిన పాల్ వాన్ యాస్ 2015 జనవరి నుంచి జూన్ వరకు...



నాబ్స్



వాల్ష్



పాల్

నెదర్లాండ్స్‌కు చెందిన రోలంట్ ఆల్ట్‌మన్స్ 2015 జూన్ నుంచి 2017 సెప్టెంబర్ వరకు... నెదర్లాండ్స్‌కే చెందిన జోయెర్డ్ మరీన్ 2017 సెప్టెంబర్ నుంచి 2018 మే వరకు భారత జట్టుకు కోచ్‌లుగా వ్యవహరించారు.

క్రికెట్‌కు మురళీ విజయ్ గుడ్‌బై



చెన్నై: భారత సీనియర్ క్రికెటర్ మురళీ విజయ్ ఆటకు గుడ్‌బై చెప్పాడు. కుడిచేతి వాటం బ్యాటర్ చాన్నాళ్ల క్రితమే జాతీయ జట్టుకు దూరమయ్యాడు. అయితే ఆలస్యంగా ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2008–09 సీజన్‌లో ఓపెనర్ గౌతమ్ గంభీర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు నాగ్‌పూర్ టెస్టుకు ఎంపికైన విజయ్ తన నిలకడైన ప్రదర్శనతో ఏకంగా 61 టెస్టులు ఆడాడు. 17 వన్డేలు, తొమ్మిది టి20 మ్యాచ్‌లు కూడా ఆడాడు. 2018లో తన కెరీర్‌లో చివరి టెస్టును ఆస్ట్రేలియాతో పెర్త్‌లో ఆడాడు. టీమిండియాకు దూరమైన అనంతరం దేశవాళీ క్రికెట్, 2020 నుంచి ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌తో బిజీ అయ్యాడు. 'నేను అంతర్జాతీయ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నాను. ప్రపంచ క్రికెట్–వ్యాపారంలో కొత్తగా వస్తున్న అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు సంతోషంగా ఆట నుంచి నిష్క్రమిస్తున్నా. ఇకపై బరిలోకి దిగకపోయినా... క్రికెట్‌తో అనుబంధం కొనసాగుతుంది. ఈ ఆటలో మరో పాత్ర పోషిస్తాను. కొత్త వాతావరణంలో కొత్త సవాళ్లను ప్రేమతో స్వీకరించేందుకు రెడీగా ఉన్నాను. క్రికెట్‌లో నాదిపుడు కొత్త ప్రయాణం... జీవితంలో మరో అధ్యాయమని భావిస్తున్నా' అని తమిళనాడుకు చెందిన 38 ఏళ్ల మురళీ విజయ్ తన రిటైర్మెంట్ సందేశంలో పేర్కొన్నాడు. తన సంతృప్తికర క్రికెట్ కెరీర్‌కు సహకరించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి, తమిళనాడు క్రికెట్ సంఘం, సీఎస్‌కే, సహచరులు, సహాయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు. 61 టెస్టుల్లో 38.28 సగటుతో 3982 పరుగులు చేసిన విజయ్ సంప్రదాయ కెరీర్‌లో 12 సెంచరీలు, 15 అర్ధసెంచరీలున్నాయి. 17 వన్డేలాడి 339 పరుగులు, తొమ్మిది టి20ల్లో 169 పరుగులు చేశాడు.

లీగ్ దశలో అజేయంగా...

భారత మహిళల జట్టుకు మూడో విజయం



దీప్తి శర్మ

ఈస్ట్ లండన్: దక్షిణాఫ్రికా గడ్డపై జరుగుతున్న ముక్కోణపు టి20 మహిళల క్రికెట్ టోర్నీలో ఇప్పటికే ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న భారత జట్టు సోమవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో వెస్టిండీస్‌పై గెలిచింది. మొదట విండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ (34; 5 ఫోర్లు), జైదా జేమ్స్ (21 నాటౌట్ 2 సిక్సర్లు) మెరుగ్గా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (3/11) రాణించింది. అనంతరం భారత్ 13.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసి గెలిచింది. స్మృతి మంధాన (5) విఫలమైనా... మరో ఓపెనర్ జెమీమా (39 బంతుల్లో 42 నాటౌట్; 5 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (23 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. అబేధ్యమైన మూడో వికెట్‌కు 54 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. ఈ టోర్నీలో ఓటమెరుగని భారత్ 7 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా (5 పాయింట్లు)తో గురువారం జరిగే ఫైనల్లో భారత్ తలపడుతుంది.

ఖేలో ఇండియా స్పాన్సర్‌గా 'స్పోర్ట్స్ ఫర్ ఆల్'

సాక్షి, హైదరాబాద్: ప్రతిభ గల క్రీడాకారుల ప్రదర్శనకు పదును పెట్టే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (కేఐవైజీ)తో దేశీయ క్రీడల నిర్వాహక సంస్థ 'స్పోర్ట్స్ ఫర్ ఆల్' (ఎస్ఎఫ్ఏ) జతకట్టింది. యువతలోని క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరచడానికి విశేష కృషి చేస్తున్న ఎస్ఎఫ్ఏ ఐదేళ్ల పాటు ఖేలో ఇండియా గేమ్స్‌కు స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది. ఈ మేరకు రూ. 12.5 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఎస్ఎఫ్ఏ వ్యవస్థాపకులు రిషికేశ్ జోషి తెలిపారు. కుర్రాళ్ల ప్రతిభాన్వేషణలో భాగమైన ఎస్ఎఫ్ఏ స్పాన్సర్‌షిప్ లభించడంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హర్షం వ్యక్తం చేసింది. గతంలో ఎస్ఎఫ్ఏ ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో భారత జట్టుకు స్పాన్సర్‌గా ఉంది.

సినిమా



కృతీ సనన్ · దిశా పఠానీ · కియారా అద్వానీ

గ్యాప్ ఇవ్వలా.. వచ్చింది!

ఏడేళ్ల తర్వాత తెలుగుకి వచ్చారు కృతీ సనన్.. దిశా పటానీ. మూడేళ్ల తర్వాత తెలుగు సినిమా చేస్తున్నారు కియారా అద్వానీ.. మూడేళ్ల తర్వాత తెలుగు తెరపై కనిపించనున్నారు అనుష్క. ఇరవైరెండేళ్ల తర్వాత హిందీ సినిమా చేశారు జ్యోతిక.. ఎందుకీ గ్యాప్ అంటే.. వేరే భాషల్లో సినిమాలు చేయడంవల్ల, వేరే కారణాల వల్ల అన్నమాట. అంతేకానీ కావాలని 'గ్యాప్ ఇవ్వలా... వచ్చింది'. ఇక తెలుగు, హిందీలో గ్యాప్ తర్వాత ఈ స్టార్స్ చేస్తున్న సినిమాల గురించి తెలుసుకుందాం...

'జియా జలే...' అంటూ వరుణ్ తేజ్‌తో కలిసి 'లోఫర్'లో చాలా హాట్ హాట్‌గా స్టెప్పులేసిన దిశా పఠానీ గుర్తుందా? తెలుగులో తనకు ఇదే తొలి చిత్రం. ఆ మాటకొస్తే.. హీరోయిన్‌గానే మొదటి సినిమా. 2015లో ఈ సినిమా వచ్చింది. ఆ తర్వాత ఈ నార్త్ బ్యూటీ హిందీ పరిశ్రమకు వెళ్లి మళ్లీ తెలుగు వైపు చూడలేదు. ఈ ఏడేళ్లల్లో అక్కడ సినిమాలు చేస్తూ వచ్చిన దిశా చాలా గ్యాప్ తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా సినిమా ద్వారా దిశా గ్రాండ్‌గా రీ–ఎంట్రీ ఇస్తున్నారు. దిశాలానే కృతీ సనన్ కూడా పాన్ ఇండియా సినిమా 'ఆదిపురుష్'తో తెలుగు తెరపై గ్రాండ్ రీ–ఎంట్రీ ఇవ్వనున్నారు. అలాగే దిశాలానే ప్రభాస్ సరసన కనిపించనున్నారు. ఆ బ్యూటీలానే కృతీ కూడా ఏడేళ్లకు తెలుగుకి వస్తున్నారు. మహేశ్‌బాబు సరసన '1 నేనొక్కడినే' ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కృతి ఆ తర్వాత నాగచైతన్య సరసన 'దోచేయ్' (2015) చేశారు. మళ్లీ తెలుగు తెరపై కనిపించలేదు. ఇక 'ఆదిపురుష్' విషయానికొస్తే.. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. రాముడి పాత్రలో ప్రభాస్ నటించగా సీతగా కృతీ సనన్ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ఇక హిందీ చిత్రం 'ఫగ్లీ' (2014) ద్వారా హీరోయిన్‌గా పరిచయ మైన కియారా అద్వానీ ఆ తర్వాత నాలుగేళ్లకు తెలుగు తెరపై మెరిశారు. మహేశ్‌బాబు సరసన 'భరత్ అనే నేను' (2018) చిత్రంతో పరిచయమైన ఈ బ్యూటీ ఆ తర్వాత రామ్‌చరణ్ సరసన 'వినయ విధేయ రామ' (2019)లో నటించారు. హిందీ చిత్రాలు చేస్తూ వస్తున్న కియారా కొంత గ్యాప్ తర్వాత తెలుగు తెరపై మళ్లీ రామ్‌చరణ్ సరసనే కనిపించనున్నారు. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా మూవీలో కియారా కథానాయికగా నటిస్తున్నారు. దిశా, కృతీలానే ఈ బ్యూటీ కూడా గ్రాండ్‌గా పాన్ ఇండియా మూవీతో మళ్లీ తెలుగు తెరపై కనిపించనున్నారు. ఈ ముగ్గురూ పాన్ ఇండియా సినిమాల ద్వారా మళ్లీ తెలుగులో కనిపించనుండటం వారికే కాదు.. వారి ఫ్యాన్స్‌కి కూడా ఆనందంగా ఉంటుంది.



అనుష్క · జ్యోతిక

నిశ్శబ్దంగా...

అనుష్క రెండేళ్ల క్రితం నిశ్శబ్దంగా తెరపై కనిపించారు. 2020లో విడుదలైన 'నిశ్శబ్దం' చిత్రంలో బధిరురాలు (మూగ, చెవిటి) పాత్ర చేశారు అనుష్క. అయితే ఈ చిత్రం నేరుగా ఓటీటీలో రిలీజైంది. అంతకుముందు 2019లో చిరంజీవి నటించిన 'సైరా'లో వెండితెరపై కనిపించారు అనుష్క. సో.. సిల్వర్ స్క్రీన్‌పై ఈ బ్యూటీ కనిపించి మూడేళ్లవుతోంది. ప్రస్తుతం యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు అనుష్క. ఇందులో నవీన్ పొలిశెట్టి హీరో. మహేశ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది. పెద్ద అప్‌డేట్స్ ఏవీ ఇవ్వకుండా ఈ చిత్రం షూటింగ్‌ని నిశ్శబ్దంగా చేస్తున్నారు. ఈ చిత్రానికి 'మిస్ శెట్టి.. మిస్టర్ పొలిశెట్టి' అనే టైటిల్ అనుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఇరవైరెండేళ్లకు హిందీలో...

హిందీ చిత్రం 'డోలీ సజా కే రఖ్నా' (1998)తో తన కెరీర్‌ను ప్రారంభించారు జ్యోతిక. ఆ తర్వాత 'వాలీ' సినిమాతో తమిళ్‌కి పరిచయమై, వరుసగా తమిళ్, తెలుగు.. ఇలా దక్షిణాది భాషల్లో హీరోయిన్‌గా బిజీ అయ్యారు. హీరో సూర్యని పెళ్లి చేసుకుని, ఇద్దరు బిడ్డలకు తల్లయ్యాక కొన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉన్నారామె. 2009 నుంచి 2014 వరకూ సినిమాలు చేయలేదు. 2015లో '36 వయదినిలే'తో రీ–ఎంట్రీ ఇచ్చి, లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఇక జ్యోతిక చివరిగా హిందీ తెరపై కనిపించిన సినిమా 'లిటిల్ జాన్' (2001). ఇన్నేళ్ల తర్వాత ఆమె ఆ మధ్య హిందీ సినిమా 'శ్రీ' అంగీకరించారు. రాజ్‌కుమార్ రావ్ హీరోగా తుషార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ''శ్రీ'లో నా పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయింది. భారమైన హృదయంతో ఈ యూనిట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నాను'' అని పేర్కొన్నారు జ్యోతిక.

ఆ రోజు దసరా గురించే మాట్లాడుకుంటారు - నాని



నాని

''దసరా' నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. మార్చి 30న విడుదలవుతోంది. ఆ రోజు అందరూ మా 'దసరా' గురించే మాట్లాడుకుంటారు. అది తప్పితే మరో చర్చ ఉండదు'' అని హీరో నాని అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తీ సురేష్ జంటగా నటించిన చిత్రం 'దసరా'. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మార్చి 30న విడుదలకానుంది. ఈ మూవీ టీజర్‌ని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాని మాట్లాడుతూ–''తెలుగు సినిమాకి నా కాంట్రిబ్యూషన్ ఏంటి? అని చాలాసార్లు ఆలోచించాను. ఇప్పుడు చాలా గర్వంగా ఒక మాట చెబుతున్నాను. తెలుగు, ఇండియన్ సినిమాకి ఈ ఏడాది నా తరఫున బిగ్గెస్ట్ కాంట్రిబ్యూషన్ శ్రీకాంత్ ఓదెల. అది ఎందుకో మార్చి 30న తెలుస్తుంది. గత ఏడాది తెలుగు నుంచి 'ఆర్ఆర్ఆర్', కన్నడ నుండి 'కేజీఎఫ్ 2' వచ్చాయి. 2023లో తెలుగు సినిమా నుంచి మా 'దసరా' వస్తోంది'' అన్నారు. ''మా సినిమా ఒక పెద్ద పండగలా ఉంటుంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు సుధాకర్ చెరుకూరి. ఈ వేడుకలో శ్రీకాంత్ ఓదెల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సత్యన్ సూర్యన్, సంగీతం: సంతోష్ నారాయణన్.

అదృశ్య శక్తితో పోరాటం

హీరోయిన్ హన్సిక ఒకే ఒక పాత్రలో నటించిన చిత్రం 'వన్ నాట్ ఫైవ్ మినిట్స్'. రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''హాలీవుడ్‌లో సింగిల్ షాట్ టెక్నిక్‌లో తెరకెక్కిన 'బర్డ్ మన్, 1917' చిత్రాల తరహాలో 'వన్ నాట్ ఫైవ్ మినిట్స్' తీశాం. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. రీల్ టైమ్, రియల్ టైమ్ ఒకేలా ఉండి ప్రేక్షకులు కూడా ఆ సీన్‌లో ప్రత్యక్షంగా ఉన్నట్లు అనుభూతి చెందుతారు. ఈ చిత్రానికి గ్రీన్ మ్యాట్ వాడకుండా లైవ్‌గా చిత్రీకరించి గ్రాఫిక్స్ యాడ్ చేశాం. ఒక అదృశ్య శక్తి నుండి తనను తాను కాపాడుకునే అమ్మాయిగా ప్రతి షాట్‌లో అద్భుతమైన హావభావాలు పలికించారు హన్సిక'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: కిషోర్ బోయిదాపు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్–స్క్రిప్ట్ చీఫ్ అసోసియేట్: రూపకిరణ్ గంజి, సహ నిర్మాత: బొమ్మక్ యషిత.



హన్సిక

పైరసీ నేపథ్యంలో...



నవీన్‌చంద్ర, గాయత్రీ సురేష్

నవీన్ చంద్ర హీరోగా, గాయత్రి సురేష్, పూజా జవేరి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మాయగాడు'. జీఎస్ కార్తీక్ రెడ్డి దర్శకత్వంలో భార్గవ్ మన్నె నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసింది చిత్ర బృందం. ''పైరసీ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. కొత్త సినిమాలను పైరసీ చేసే పాత్రలో నవీన్ చంద్ర నటించారు. పైరసీ వల్ల సినీ పరిశ్రమకు ఏర్పడే నష్టాలను ఈ సినిమాలో చూపించాం. ఇందులో ప్రేమకథ కూడా ఉంటుంది. ఈ సినిమాను త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: వెంకట్ గంగాధరీ.

కొత్తగా ప్రయత్నించాం - మణిశర్మ



జైదీప్ విష్ణు, మణిశర్మ

''రెబెల్స్ ఆఫ్ తుపాకులగూడెం' సినిమా పూర్తయిన తర్వాత నాకు ఓ విషయం అర్థమైంది.. దర్శకుడు విష్ణు కనిపించినంత సాఫ్ట్ కాదని (నవ్వుతూ). మేమంతా కలిసి కొత్తగా ప్రయత్నించాం.. ప్రేక్షకులు మా సినిమాను చూసి, మమ్మల్ని ఆశీర్వదించాలి'' అని సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. ప్రవీణ్ కండేలా, శ్రీకాంత్ రాథోడ్, జయేత్రి మకానా, శివరామ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో జైదీప్ విష్ణు దర్శకత్వం వహించిన చిత్రం 'రెబెల్స్ ఆఫ్ తుపాకులగూడెం'. వారధి క్రియేషన్స్‌పై రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో జైదీప్ విష్ణు మాట్లాడుతూ– ''మా సినిమాలో 40 మంది నూతన నటీనటులున్నారు. కాసర్ల శ్యామ్‌గారి వల్లే మా చిత్రానికి మణిశర్మగారితో సంగీతం చేయించుకునే చాన్స్ దక్కింది'' అన్నారు. ప్రవీణ్ కండేలా, శ్రీకాంత్ రాథోడ్, గౌతమ్, జయేత్రి, కెమెరామెన్ శ్రీకాంత్ అరుపుల, రైటర్ సంతోష్, పాటల రచయిత కాసర్ల శ్యామ్ తదితరులు మాట్లాడారు.


తమాషా గ్యాంగ్



గాయత్రి పటేల్

వెంకట్ కల్యాణ్, గాయత్రీ పటేల్ జంటగా వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహించిన చిత్రం 'చెడ్డి గ్యాంగ్ తమాషా'. సీహెచ్ క్రాంతి కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి రెండో వారంలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ – ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'చెడ్డి గ్యాంగ్ తమాషా'. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌తో సినిమా మీద మంచి అంచనాలు ఏర్పడ్డాయి. బిజినెస్ పరంగా కూడా చాలా సంతోషంగా ఉన్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జీకే యాదవ్ బంక, సంగీతం: అర్జున్.

నేను బాగానే ఉన్నాను - ఇలియానా





ఇలియానా అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ''నేను ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నాను. డాక్టర్లు మూడు బాటిళ్ల ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించారు.. నాకు మంచి వైద్యం అందిస్తున్నారు. నా ఫ్యాన్స్‌తో పాటు అందరూ నా ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్నారు. ఇంతగా నాపై ప్రేమ చూపిస్తున్నవారికి థ్యాంక్స్. ఇప్పుడు నేను బాగానే ఉన్నాను'' అని పేర్కొంటూ ఆస్పత్రిలో సెలైన్ ఎక్కించుకుంటున్న ఫొటోలను షేర్ చేశారు ఇలియానా. తాను ఎందుకు ఆస్పత్రిలో చేరాననే విషయాన్ని మాత్రం బయటపెట్టలేదు.

సాక్షి
బిజినెస్
మంగళవారం
31-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	170	59,500
నిఫ్టీ ▲	45	17,649

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,469	▽	153
డోజోన్స్	33,894	▽	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,785	▲	20
డాక్స్	15,126	▽	24
షాంఘై	3,269	▲	4
నికాయ్	27,433	▲	51

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,079
బంగారం (99.5 స్వచ్ఛత)	56,850
వెండి (కిలో)	68,149

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.90	82.57
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	87.28	90.38
€	యూరో	ఒకటి	99.62	102.98
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.82	63.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.87	59.25
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.21	63.23
SAR	సౌదీ రియాల్	ఖామసకుక	20.74	22.41
UAE D	యూఏఈ దిర్హామ్	ఖామసకుక	21.29	23.09
¥	చైనా యువాన్	ఖామసకుక	10.95	13.03

ఎల్‌అండ్‌టీ ఫలితాలు భేష్

క్యూ3లో రూ. 2,553 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మౌలిక దిగ్గజం ఎల్‌అండ్‌టీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 24 శాతం ఎగసి రూ. 2,553 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,055 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం వృద్ధితో రూ. 46,390 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 39,563 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల విభాగంలో మెరుగైన ఎగ్జిక్యూషన్ ఇందుకు సహకరించినట్లు కంపెనీ సీఎఫ్‌వో ఆర్. శంకర రామన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఐటీ, టెక్నాలజీ సర్వీసుల పోర్ట్‌ఫోలియో బలపడటం ఇందుకు జత కలసినట్లు తెలియజేశారు. ఎల్‌టీఐ, మైండ్‌ట్రీ విలీనాన్ని విజయవంతంగా పూర్తిచేసినట్లు సీఈవో, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. కాగా.. తాజా సమీక్షా కాలంలో 21 శాతం అధికంగా రూ. 60,710 కోట్ల విలువైన కాంట్రాక్టులు లభించినట్లు కంపెనీ వెల్లడించింది. ఆయిల్ అండ్ గ్యాస్, హైడల్, టన్నెల్స్, ఇరిగేషన్ సిస్టమ్స్, ఫెర్రస్ మెటల్స్, విద్యుత్ ప్రసారం, పంపిణీ విభాగాల నుంచి ఆర్డర్లు పొందినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం నీరసించి రూ. 2,122 వద్ద ముగిసింది.

టెక్ మహీంద్రా లాభం వీక్

క్యూ3లో రూ. 1,297 కోట్లు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 1,297 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2021–22) ఇదే కాలంలో రూ. 1,378 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 20 శాతం వృద్ధితో రూ. 13,735 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 11,451 కోట్ల టర్నోవర్ నమోదైంది. స్థూల ఆర్థిక వాతావారణం ప్రతికూలంగా ఉన్న నేపథ్యంలో వృద్ధి మందగించినట్లు కంపెనీ ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ పేర్కొన్నారు. క్లయింట్ల సాంకేతిక అవసరాలకు అనుగుణంగా పనిచేయడంతో పాటు.. కొత్తగా డిమాండు పుడుతున్న డిజిటల్ సర్వీసులు తదితరాలపై దృష్టి పెట్టినట్లు తెలియజేశారు. 79.5 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత సమీక్షా కాలంలో బీపీవో సిబ్బందిలో కోత కారణంగా నికరంగా 1,800 మంది ఉద్యోగులు తగ్గినట్లు కంపెనీ తెలియజేసింది. దీంతో మొత్తం సిబ్బంది 1.57 లక్షలకు చేరినట్లు వెల్లడించింది. ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు 17 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు 1 శాతం బలపడి రూ. 1,039 వద్ద ముగిసింది.

ఏవియేషన్ గ్యాస్ ఎగుమతులు షురూ..

పపువా న్యూ గినియాకు పంపిన ఐవోసీ



ముంబై: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) దేశ ఇంధన చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించింది. తాజాగా ఏవియేషన్ గ్యాస్ (ఏవీ గ్యాస్) ఎగుమతులు ప్రారంభించింది. 80 బ్యారెళ్ల తొలి కన్సైన్‌మెంట్‌ను (ఒక్కో బ్యారెల్ 16 కిలోలీటర్లు) జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ నుంచి పపువా న్యూ గినియాకు పంపినట్లు సంస్థ తెలిపింది. నికరంగా ఇంధనాలను దిగుమతి చేసుకునే భారత్ .. ఇలా ఏవీ గ్యాస్‌ను ఎగుమతి చేయడం ఇదే ప్రథమం. దీనితో అంతర్జాతీయంగా 2.7 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న ఏవీ గ్యాస్ మార్కెట్లోకి ప్రవేశించినట్లు సంస్థ తెలిపింది. మానవరహిత ఏరియల్ వాహనాలు (యూఏవీ), ఫ్లయింగ్ స్కూల్స్ నడిపే చిన్న విమానాలు మొదలైన వాటిల్లో ఏవీ గ్యాస్‌ను ఉపయోగిస్తారు. పెద్ద వాణిజ్య విమానాల్లో ఉపయోగించే ఇంధనాన్ని ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)గా వ్యవహరిస్తారు. ఏవీ గ్యాస్‌ను దేశీయంగా ఉత్పత్తి చేయడం వల్ల విదేశీ మారకం ఆదా కావడంతో పాటు ఔత్సాహిక పైలట్లకు ఫ్లయింగ్ స్కూల్స్‌లో శిక్షణ వ్యయభారం కూడా తగ్గుతుందని ఐవోసీ చైర్మన్ ఎస్ఎం వైద్య చెప్పారు. అలాగే రక్షణ బలగాలు ఉపయోగించే యూఏవీల నిర్వహణ వ్యయాలు కూడా భారీగా తగ్గగలవని పేర్కొన్నారు. దీన్ని దేశీయంగా ఐవోసీ మాత్రమే తయారు చేస్తోంది. గుజరాత్‌లోని వడోదరలో గత సెప్టెంబర్‌లో ఉత్పత్తి ప్రారంభించింది. ఈ ప్లాంటు సామర్థ్యం 5,000 టన్నులుగా ఉంది.

గెయిల్ లాభంలో భారీ క్షీణత

క్యూ3లో రూ. 398 కోట్లు మాత్రమే



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ యుటిలిటీ దిగ్గజం గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 90 శాతం క్షీణించి రూ. 398 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,800 కోట్లు ఆర్జించింది. పెట్రోకెమికల్, సహజవాయు మార్కెటింగ్ బిజినెస్‌లో ఏర్పడ్డ నష్టాలు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-1-2023	
విశాఖ	480–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	72.00
30-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.75

కనిష్టాల నుంచి కోలుకున్నాయ్

- ఇంట్రాడేలో తీవ్ర ఒడిదుడుకులు
- స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు
- ఐటీ, ఫైనాన్స్, బ్యాంక్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు సోమవారం నష్టాల్లోంచి గట్టెక్కి స్వల్ప లాభాల్లో ముగిశాయి. దేశీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల మధ్య ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. మిడ్ సెషన్ వరకు నష్టాల్లో కదలాడాయి. తదుపరి ఐటీ, ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాల్ని పూడ్చుకొని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఉదయం సెన్సెక్స్ 229 పాయింట్లు కోల్పోయి 59,102 వద్ద, నిఫ్టీ 62 పాయింట్ల పతనంతో 17,542 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఇంట్రాడేలో 632 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ కోలుకుని 170 పాయింట్ల లాభంతో 59,500 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ట్రేడింగ్‌లో 199 పాయింట్లు పతనమై 17,405 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆఖరికి 45 పాయింట్లు పెరిగి 17,649 వద్ద నిలిచింది. ఆటో, మీడియా, మెటల్, ఫార్మా, రియల్టీ ఇంధన–గ్యాస్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.6792 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీ ఇన్వెస్టర్లు రూ.5513 కోట్ల షేర్లను కొన్నారు. ప్రపంచ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. 'హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై అదానీ స్పందనకు మార్కెట్ మిశ్రమంగా స్పందించింది. ప్రభుత్వం లేదా పేరున్న స్వతంత్ర సంస్థలు శాస్త్రీయ అధ్యయనం చేసి నిష్పక్షపాతమైన నివేదిక వెల్లడిస్తేనే వివాదం ఓ కొలిక్కి వస్తుంది. ప్రస్తుతానికి ఇన్వెస్టర్లు బడ్జెట్, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీలపై దృష్టి సారించారు' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- వివాదాస్పద హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు మిశ్రమంగా స్పందించాయి. పలు కంపెనీల షేర్ల నష్టపోగా.., మరి కొన్ని కంపెనీ షేర్లకు కొనుగోలు మద్దతు లభించింది.
- క్యూ3లో బజాజ్ ఫైనాన్స్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించడంతో ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ షేరు రాణించింది. బీఎస్ఈలో నాలుగుశాతం లాభపడి రూ.6,022 వద్ద స్థిరపడింది.
- ఇండియన్ బ్యాంక్ షేరు ఐదుశాతం పెరిగి రూ.296 వద్ద నిలిచింది. డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం రెండు రెట్లు పెరగడం షేరు ర్యాలీకి కారణమైంది. ట్రేడింగ్‌లో ఐదుశాతం ఎగసి రూ.300 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

అదానీ ఎఫ్‌పీవోలో ఐహెచ్‌సీ పెట్టుబడులు

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ ఆఫర్ (ఎఫ్‌పీవో)లో 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు అబు ధాబికి చెందిన ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ (ఐహెచ్‌సీ) వెల్లడించింది. తమ అనుబంధ సంస్థ గ్రీన్ ట్రాన్స్‌మిషన్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ ఆర్ఎస్‌సీ ద్వారా పెట్టుబడి పెట్టినట్లు తెలిపింది. ఐహెచ్‌సీ ఇప్పటికే ఈ ఎఫ్‌పీవోలో యాంకర్ ఇన్వెస్టరుగా కూడా పాల్గొంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫండమెంటల్స్‌పైనా, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపైనా తమకు నమ్మకం ఉండటం వల్లే ఈ మేరకు పెట్టుబడులు పెట్టినట్లు ఐహెచ్‌సీ సీఈవో సయ్యద్ బసర్ షుయెబ్ తెలిపారు. రూ. 20,000 కోట్ల అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవో మంగళవారంతో (జనవరి 31) ముగియనుంది.

పీఎన్‌బీ లాభం డౌన్



క్యూ3లో రూ. 629 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్- డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 44 శాతం క్షీణించి రూ. 629 కోట్లకు పరిమితమైంది. మొండి రుణాలకు కేటాయింపులు పెరగడం ప్రభావం చూపింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,127 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 22,026 కోట్ల నుంచి రూ. 25,722 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం సైతం 18 శాతం ఎగసి రూ. 9,179 కోట్లను తాకింది. మొండి రుణాలకు ప్రొవిజన్లు రూ. 3,654 కోట్ల నుంచి రూ. 3,908 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 12.88 శాతం నుంచి 9.76 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు సైతం 4.9 శాతం నుంచి 3.3 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి స్వల్పంగా బలపడి 15.15 శాతానికి చేరింది.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు యథాతథంగా రూ. 51 వద్ద ముగిసింది.

మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లాభం 452% జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, డిజైనింగ్ కంపెనీ మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ నికరలాభం అంత క్రితంతో పోలిస్తే 452.5% ఎగసి రూ.9.2 కోట్లు సాధించింది. ఎబిటా 300 శాతం పెరిగి రూ.13.6 కోట్లకు చేరింది. టర్నోవర్ 71% అధికమై రూ.40.7 కోట్లుగా ఉంది. ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన కంపెనీల మోడళ్లకు 3డీ, 2డీ, రోబోటిక్స్ సేవలను అందిస్తున్నామని మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ సీఎండీ జె.లక్ష్మణ రావు తెలిపారు. 'ఇటువంటి సర్వీసులను ఆఫర్ చేస్తున్న అతికొద్ది భారతీయ కంపెనీల్లో మోల్డ్‌టెక్ ఒకటి. యూరప్, మెక్సికో నుంచి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. కనెక్షన్ డిజైన్, స్ట్రక్చరల్ డిజైనింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కంపెనీలను కొనుగోలు చేస్తాం. ఆర్డర్ బుక్ ఎన్నో రెట్లు పెరిగింది. ఈ వృద్ధి కొనసాగుతుంది' అని ధీమా వ్యక్తం చేశారు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 225 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 225
- **పోస్టుల వివరాలు:** ఎకనామిస్ట్, సెక్యూరిటీ ఆఫీసర్, సివిల్ ఇంజనీర్, లా ఆఫీసర్, ఏపీఐ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేటర్,ఎలక్ట్రికల్ ఇంజనీర్, రాజభాష ఆఫీసర్, డేటా అనలిటిక్స్, ఐటీ సెక్యూరిటీ ఆఫీసర్, మొబైల్ యాప్ డెవలపర్, డాటా నెట్ డెవలపర్,విండోస్ అడ్మినిస్ట్రేటర్, డిజిటల్ బ్యాంకింగ్, సీనియర్ మేనేజర్ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టును అనుసరించి కనిష్ఠంగా 25, గరిష్ఠంగా 35, 38 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు స్కేల్ 3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.78,230, స్కేల్ 2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.02.2023
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

సీఐఎస్‌ఎఫ్‌లో 451 కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ పరిశ్రమల భద్రత నిమిత్తం కానిస్టేబుల్(డ్రైవర్), కానిస్టేబుల్ (డ్రైవర్ -కమ్-పంప్-ఆపరేటర్-ఫైర్ సర్వీస్) పోస్టుల భర్తీకి పురుషుల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 451
- **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్/డ్రైవర్–183, కానిస్టేబుల్/డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్–268.
- **అర్హత:** మెట్రిక్యులేషన్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్(హెవీ మోటార్ వెహికల్ లేదా ట్రాన్స్‌పోర్ట్ వెహికల్, లైట్ మోటార్ వెహికల్, మోటార్ సైకిల్ విత్ గేర్)తో పాటు మూడేళ్ల డ్రైవింగ్ అనుభవం ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు 167 సెం.మీ., ఛాతీ కొలత 80–85 సెం.మీ. ఉండాలి.
  వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్, డాక్యుమెంటేషన్, ట్రేడ్ టెస్ట్, రాత పరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.02.2023
- **వెబ్‌సైట్:** www.cisfrectt.in

ఈపీఐఎల్‌లో 30 ఉద్యోగాలు

ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్(ఇండియా) లిమిటెడ్(ఈపీఐఎల్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
- **పోస్టుల వివరాలు:** మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మేనేజర్లు.
- **విభాగాలు:** సివిల్ డిజైన్, ఆర్కిటెక్చర్, హెచ్ఆర్, ఐటీ, ఫైనాన్స్, మెకానిక్ తదితరాలు.

అర్హత:

- **అసిస్టెంట్ మేనేజర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎంఎంఈఐ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 32 ఏళ్లు ఉండాలి. కనీసం 2 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
- **మేనేజర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎంఎంఈఐ/సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ/ఎంసీఏ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 35 ఏళ్లు ఉండాలి. కనీసం నాలుగేళ్లు పని అనుభవం ఉండాలి.
- **సీనియర్ మేనేజర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎంఎంఈఐ/బీఆర్క్/పీజీ డిప్లొమా/ఎంబీఏ/ఏసీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 42 ఏళ్లు ఉండాలి. కనీసం 9 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**13.02.2023
- **వెబ్‌సైట్:** www.epi.gov.in


ఇఎన్ఈఎస్ఏసీ, మేఘాలయలో 27 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

మేఘాలయలోని నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(ఎన్ఈఎస్ఏసీ)ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 27
- **అర్హత:** బీఈ/బీటెక్/ఎంఎస్సీ(రిమోట్ సెన్సింగ్ /జియోఇన్ఫర్మేటిక్స్/స్పేషియల్ ఇన్ఫర్మేషన్ సైన్స్/కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.31,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** సంబంధిత ధ్రువపత్రాలతో అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ వేదిక:** ఎన్ఈఎస్ఏసీ, ఉమియమ్.
- **ఇంటర్వ్యూ తేది:** 06.02.2023 నుంచి 08.02.2023 వరకు జరుగుతాయి.
- **వెబ్‌సైట్:** nesac.gov.in

పదో తరగతితోనే.. కేంద్ర ప్రభుత్వ కొలువు!

» కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ నియామకాలు
» 12,523 పోస్టులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్
» రాత పరీక్ష, పీఈటీ, పీఎస్‌టీల ద్వారా ఎంపిక ప్రక్రియ
» తెలుగు సహా 13 ప్రాంతీయ భాషల్లోనూ రాత పరీక్ష
» కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ



కేంద్ర ప్రభుత్వ కొలువు అందుకునే మరో అవకాశం! పదో తరగతి అర్హతతోనే.. సుస్థిర భవిష్యత్తును సొంతం చేసుకునేందుకు మార్గం! ప్రారంభంలోనే నెలకు రూ.18,000 -రూ.56,900 పే స్కేల్‌తో వేతనం! వీటన్నింటికీ మార్గం స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) తాజాగా విడుదల చేసిన మల్టీ టాస్కింగ్ స్టాఫ్ నియామక ప్రకటన! కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాల్లో గ్రూప్-సి(నాన్-గెజిటెడ్) స్థాయిలో మొత్తం 12,523 మల్టీ టాస్కింగ్(నాన్ -టెక్నికల్) సిబ్బంది నియామకాలకు ప్రక్రియ ప్రారంభించింది. పదోతరగతి అర్హతతోనే ఈ పోస్టులకు పోటీ పడొచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ విడుదల చేసిన మల్టీ టాస్కింగ్ (నాన్-టెక్నికల్) స్టాఫ్ నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పదో తరగతి అర్హతతోనే 12 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాంక్ ఎగ్జామ్స్, ఇతర రిక్రూట్‌మెంట్ పరీక్షలకు పోటీ పడుతున్న వారు అదే ప్రిపరేషన్‌తో ఎస్ఎస్‌సీ ఎంటీఎస్ పోస్టులకు కూడా సన్నద్ధం కావొచ్చు.

పలు శాఖలు.. 12,523 పోస్టులు

మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్) స్టాఫ్ నియామక ప్రక్రియ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలలో మొత్తం 12,523 పోస్టులను భర్తీ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–సి(నాన్–గెజిటెడ్) హోదాలో 11,994, అదే విధంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో నాన్–మినిస్టీరియల్ విభాగంలో 529 హవాల్దార్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- ఫిబ్రవరి 17, 2023 నాటికి పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** సీబీఎన్‌లో ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు జనవరి 1, 2023 నాటికి 18–25 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- సీబీఐసీలో హవాల్దార్, కొన్ని నిర్దేశిత శాఖలో ఎంటీఎస్ పోస్టులకు 18–27ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది.
- **వేతన శ్రేణి:** రూ.18,000– 56,900 (స్థూల వేతనం – రూ. 31,329)

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ ఎంటీఎస్ నియామక ప్రక్రియను మొత్తం మూడు దశలుగా చేపట్టనున్నారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఫిజికల్ స్టాండర్ టెస్ట్‌ను హవాల్దార్ పోస్టులకు మాత్రమే నిర్వహిస్తారు.

ప్రాంతీయ భాషల్లో రాత పరీక్ష

ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్‌లో మరో ముఖ్యమైన అంశం.. ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షను తెలుగుతోపాటు 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు.

రాత పరీక్షకు 270 మార్కులు

- ఎంపిక ప్రక్రియలో తొలి దశగా పేర్కొన్న రాత పరీక్షను రెండు సెషన్లలో మొత్తం 270 మార్కులకు నిర్వహిస్తారు.
- **సెషన్–1:** ఇందులో న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ(20 ప్రశ్నలు–60 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్(20 ప్రశ్నలు– 60 మార్కులు) విభాగాలుంటాయి.
- **సెషన్–2:** ఈ సెషన్‌లో జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు–75 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు–75 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- సెషన్–1లోని రెండు విభాగాల్లో ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున, సెషన్–2లోని సబ్జెక్టులలో ప్రతి సబ్జెక్ట్‌లో ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున కేటాయించారు.
- ప్రతి సెషన్ వ్యవధి 45 నిమిషాలు.
- పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.
- సెషన్–2లో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్క్‌ను నెగెటివ్ మార్క్‌గా నిర్దేశించారు. సెషన్–1లో నెగెటివ్ మార్కింగ్ లేదు.

పీఈటీ/ పీఎస్‌టీ

ఎస్ఎస్‌సీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ నియామకాలకు సంబంధించి అన్ని శాఖలకు రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగానే నియామకాలు ఖరారు చేస్తారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ విభాగాల్లోని హవాల్దార్ పోస్టులకు మాత్రం రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, తర్వాత ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. వివరాలు..

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

- రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల వారీగా కటాఫ్ నిర్దేశించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులకు వాకింగ్ టెస్ట్ ఉంటుంది.
- పురుష అభ్యర్థులు 1,600 మీటర్ల దూరాన్ని 15 నిమిషాల్లో నడవాలి.
- మహిళా అభ్యర్థులు ఒక కిలో మీటర్ దూరాన్ని 20 నిమిషాల్లో నడవాల్సి ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- ఈ టెస్ట్‌ను పలు పోస్టులకు మాత్రమే నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుషులు 157.5 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతి విస్తీర్ణం 81 సెం.మీ ఉండాలి. (శ్వాస పీల్చినప్పుడు అయిదు సెం.మీ. విస్తరించాలి).
- మహిళా అభ్యర్థులు 152 సెం.మీ ఎత్తు ఉండాలి. 48 కిలోల బరువుండాలి.

సెషన్-2నే కీలకం

తుది విజేతలను ఖరారు చేసే క్రమంలో సెషన్–2లో పొందిన మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు కచ్చితంగా సెషన్–1లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే.. సెషన్–2 జవాబులను మూల్యాంకన చేస్తారు. హవాల్దార్ పోస్టులకు సంబంధించి రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 1:5 నిష్పత్తిలో తదుపరి దశలు పీఈటీ, పీఎస్‌టీలకు ఎంపిక చేస్తారు.

రాత పరీక్షలో విజయానికి ఇలా

మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్–టెక్నికల్) పోస్టులకు నిర్వహించనున్న రాత పరీక్షలో ఆయా సిలబస్ టాపిక్స్‌ను అనుసరించి ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్ సాగించాలి.

న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ

సెషన్–1లో మొదటి విభాగంగా ఉండే ఈ సబ్జెక్ట్‌లో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థగణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

రీజనింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్

సెషన్–1లో రెండో విభాగంగా ఉండే ఈ సబ్జెక్ట్‌లో.. మంచి మార్కుల కోసం. వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్,విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్,వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా సమస్యకు పరిష్కారం కనుగొనే రియల్ టైమ్ నైపుణ్యం పొందాలి.

జనరల్ అవేర్‌నెస్

సెషన్–2లో మొదటి సబ్జెక్ట్‌గా ఉండే జనరల్ అవేర్‌నెస్‌లో రాణించేందుకు.. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

సెషన్–2లో రెండో విభాగంలో అడిగే ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో రాణించేందుకు.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయి ఇంగ్లిష్ పుస్తకాలతోపాటు.. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు అందుబాటులో ఉండే ప్రామాణిక ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను అభ్యసనం చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 18 – ఫిబ్రవరి 17, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** ఫిబ్రవరి 23, 24 తేదీలు
- **రాత పరీక్ష తేదీ:**ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

క్లుప్తంగా...

నేటినుంచి పూర్వగిరిలో వార్షిక బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 6 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం స్వస్తివచనంతో ఉత్సవాలు ప్రారంభమై ఫిబ్రవరి 6వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, మహాదాశీర్వచనంతో ముగుస్తాయి. ఫిబ్రవరి 3వ తేదీన రాత్రి జరిగే శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.600 చెల్లించి టికెట్ పొందాలని ఆలయ అధికారులు సూచించారు.

అనాథలను ప్రభుత్వ బిడ్డలుగా గుర్తించాలి

మహాధర్నాలో మంద కృష్ణమాదిగ డిమాండ్



కవాడిగూడ: అనాథలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలు దాదాపు పదిలక్షల మంది వరకు ఉంటారని పేర్కొన్నారు. అనాథలను ప్రభుత్వబిడ్డలుగా గుర్తించి వారిని ఆదుకోవాలని కోరారు. అనాథల హక్కుల పోరాట వేదిక, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్దనున్న ధర్నాచౌక్‌లో అనాథల అరిగోస దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత సాదినేని వెంకటేశ్వర్‌రావుతోపాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ అనాథల కోసం ప్రతి జిల్లాలో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్న కేసీఆర్ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అనాథల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆమ్‌ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యురాలు ఇందిరాశోభన్, బీజేపీ నేత ఆకుల విజయ, వికలాంగుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాంబాబు, వైఎస్సార్‌టీపీ నేత ఏపూరు సోమన్న పాల్గొన్నారు.

బయో ఆసియా భాగస్వామ్య దేశంగా యూకే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న జీవశాస్త్రాల అంతర్జాతీయ సదస్సు బయో ఆసియాకు ఈ ఏడాది భాగస్వామ్య దేశంగా యునైటెడ్ కింగ్‌డమ్ వ్యవహరించనుంది. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సోమవారం ఈ విషయం ప్రకటించారు. 'జీవశాస్త్ర రంగంలో యునైటెడ్ కింగ్‌డమ్‌కు మంచి పేరుంది. పారిశ్రామిక రంగం, విద్యాసంస్థల విషయంలోనూ రాణిస్తోంది'అని తెలిపారు. బయో ఆసియా సదస్సుకు భాగస్వామ్య దేశం కావడం అటు యునైటెడ్ కింగ్‌డమ్‌కు ఇటు తెలంగాణకూ ప్రయోజనకరమని చెప్పారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ వైన్ ఓవెన్ మాట్లాడుతూ.. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఇన్నోవేషన్ కేంద్రాలు, స్టార్టప్‌లు, యూనివర్సిటీలు జీవశాస్త్ర రంగంలో భారత్‌తో కలసి పనిచేసేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని చెప్పారు. కాగా, ఫిబ్రవరి 24–26 తేదీల మధ్య హైదరాబాద్‌లో బయో ఆసియా సదస్సు జరగనుంది.

భారతీయ రవాణా రంగంలో అవకాశాలు మెండు!

క్యూబిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ ప్రెసిడెంట్ జెఫ్రీ లోవింగర్



సాక్షి, హైదరాబాద్: భారత రవాణా రంగంలో టెక్నాలజీ సంబంధిత పరిష్కారాల కోసం అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని అందుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని క్యూబిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ అధ్యక్షులు జెఫ్రీ లోవింగర్ అన్నారు. ట్రాఫిక్ నియంత్రణతోపాటు రుసుములు సేకరించే రంగంలో తాము అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్నామని తెలిపారు. భారత్‌లో కార్యకలాపాలను విస్తరించడంలో భాగంగా సంస్థ సోమవారం నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లోవింగర్ మాట్లాడుతూ, తాము భారతీయ పరిస్థితులను అర్థం చేసుకుని అందుకు తగ్గ టెక్నాలజీ పరిష్కారాలు తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పుణేలో ఇప్పటికే ఒక పైలెట్ ప్రాజెక్టు చేపట్టామని, దాదాపు 125 ట్రాఫిక్ కూడళ్లలో పరిశీలనలు జరుపుతున్నామని చెప్పారు. ఈ పైలట్ ప్రాజెక్టు ఫలితాల ఆధారంగా దేశంలో వ్యాపార అవకాశాలను మెరుగుపరచుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గాలెన్ చూయి, మేనేజింగ్ డైరెక్టర్ (ఇండియా) కిషన్ కామొజ్జాల తదితరులు పాల్గొన్నారు.

జాడలేని జిల్లేడు.. కానరాని తంగేడు

సాక్షి, హైదరాబాద్

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదనేది నానుడి. నాగజెముడు..తంగేడు..కుంకుడు.. జిల్లేడు..ఉమ్మెత్త.. తిప్పతీగ..మునగ.. కరివేపాకు.. వేప.. ఇవి కూడా మనిషికెంతో మేలు చేస్తాయి. ఇప్పుడంటే ఆధునిక వైద్యం అంతటా అందుబాటులోకి వచ్చింది కానీ ఒకప్పుడు ప్రతి ఇంటి పెరట్లో ఉండే ఇలాంటి మొక్కలు, చెట్లపైనే ఆధారపడి పల్లె ప్రజలు ప్రాణాలు కాపాడుకునేవారు. ప్రాణం మీదకొచ్చే జబ్బైతే తప్ప ఓ మోస్తరు అనారోగ్యం నుంచి బయటపడేందుకు ఆకు పసర్లే ఉపయోగించేవారు. వాటి మీదే ఆధారపడి జీవించేవారంటే అతిశయోక్తి కాదు. రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకు పెరట్లో ఈ తరహా ఔషధ గుణాలున్న మొక్కలు, చెట్లు కన్పించేవి. ఇప్పుడు పల్లెల్లో కూడా జీవనశైలి మారిపోయింది. సంప్రదాయంగా వైద్యానికి వాడే పెరటి మొక్కల పెంపకం 80 శాతం పడిపోయింది. ఏ ఇంటి పెరట్లో అయినా ఇలాంటి మొక్క ఒకటి కన్పిస్తే అది నిజంగా వింతే. పెరటి వైద్యం అంటే ఏమిటో కూడా నేటి యువతరానికి తెలియని దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా నాగజెముడు, తంగేడు, జిల్లేడు, కుంకుడు, ఉమ్మెత్త లాంటివి ఎక్కడో తప్ప కన్పించకుండా పోయాయి. అయితే కోవిడ్ తదనంతర కాలంలో మొక్కలపై కాస్త మక్కువ పెరిగింది. కుండీల్లోనైనా ఇతర మొక్కలతో పాటు ఒకటో రెండో ఔషధ మొక్కలు పెంచాలనే ఆరాటం మొదలైంది. ఈ మక్కువ విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. మాయమైన మన పెరటి మొక్కల గురించి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.



పెరట్లో ఉండే ఔషధ మొక్కలెక్కడ?

- మాయమైన నాగజెముడు, ఉమ్మెత్త, తంగేడు, నల్లేరు, కరక్కాయ
- రెండు, మూడు దశాబ్దాల క్రితం వరకు పల్లెకు ఇవే ప్రాణం
- ఇప్పుడు 80 శాతానికి పడిపోయిన వైద్యానికి వాడే మొక్కల పెంపకం
- 92 శాతం నుంచి 21 శాతానికి తగ్గిన పెరటి వైద్యం
- కరోనా తర్వాత పరిస్థితి కాస్త మెరుగు..కుండీల్లో కన్పిస్తున్న కొన్ని మొక్కలు

చర్మ వ్యాధులకు ఉమ్మెత్త



ఉమ్మెత్త పరిస్థితి కాస్త నయం. ముళ్ళ కాయలతో పెరట్లో కన్పించే దీన్ని ప్రజలింకా పూర్తిగా మరిచిపోలేదు. ఇప్పటికీ అక్కడక్కడా గ్రామాల్లో కన్పిస్తోంది. కానీ ఈ మొక్కను కార్పొరేట్ ఆయుర్వేద వైద్యం విస్తృతంగా అభివృద్ధి చేస్తోంది. ఔషధ రూపంలో ప్రతి ఊరూ వెళ్లిన ఈ మొక్క.. పెరట్లో ఉన్నా పల్లె జనం దీని విలువ తెలుసుకోవడం లేదు. ఉమ్మెత్త ఆకులు, కాయలను చర్మవ్యాధులకు బాగా వాడతారు. దీర్ఘకాల చర్మ వ్యాధులను సైతం తగ్గించే గుణం దీని సొంతం. ఇంత మంచి గుణాలున్న మొక్క మరో ఆరేళ్ళ తర్వాత పల్లెల్లో కన్పించదని వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

'ఊపిరిపోసే' నాగజెముడు



పెరట్లో ముఖ్యంగా పొలాల వెంట ముళ్ళ పొదల్లా ఉండే నాగజెముడు ఇప్పుడు మచ్చుకైనా కన్పించడం లేదు. పల్లె జనం ఆధునిక వైద్యానికి అలవాటు పడి దీని ప్రాధాన్యతను గుర్తించడం లేదు. నిజానికి ఈ తరానికి ఈ మొక్క ఎలా ఉంటుందో కూడా తెలియదు. నాగజెముడు పూలను ఆస్తమా తగ్గించేందుకు, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు వాడతారు.

చక్కెర స్థాయి తగ్గించే తంగేడు



తంగేడు తాతల కాలం నుంచి తెలిసిన మొక్క. చిన్న చిన్న పసుపు వన్నె పూలు దీని ప్రత్యేకత. బ్రష్‌లు, పేస్టులు లేని రోజుల్లో వేపతో పాటు తంగేడు పుల్లలతో కూడా పళ్ల తోముకునేవారు. మధుమేహం వ్యాధికి దీన్ని మించిన మందులే లేవని పరిశోధనల్లో తేలింది. బతుకమ్మ పండుగొచ్చి తంగేడును కాస్త బతికించింది కానీ.. లేకపోతే ఈ చెట్టూ మనకు కన్పించనంత దూరంగా వెళ్ళేది. ఆయుర్వేద వనమూలికల్లో తంగేడు కీలక పాత్ర పోషిస్తోంది. దీన్ని మళ్ళీ పల్లె దరికి చేర్చాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

షాంపూలు రాకముందు కుంకుడే..



కుంకుడు కాయ.. ఇప్పుడు సూపర్ మార్కెట్లో అందమైన ప్యాకెట్‌గా కన్పించే వస్తువైంది. కానీ ఒకప్పుడు ప్రతి ఊళ్ళో విరివిగా ఈ చెట్లు ఉండేవి. షాంపూలు రాకముందు వరకు కుంకుడు రాజసానికి ఏ మాత్రం దెబ్బ తగల్లేదు. కుంకుడు రసం వాడినంత వరకు కేశాల వన్నె తగ్గలేదు. మంచి ఔషధ గుణాలున్న చెట్టును కార్పొరేట్ కంపెనీలు ఆయుర్వేదం పేరుతో అభివృద్ధి చేస్తున్నాయి. పల్లెల్లో ఎవరికీ పట్టని కుంకుడు క్రమంగా పల్లె వాకిటి నుంచి కార్పొరేట్ ఫామ్‌లకు వెళ్తోంది.

పొలాలకు 'రక్షణ కంచె'



మంగళగిరి కంచె.. ఈ మొక్క గురించి చాలామందికి తెలియదు. సుమారు ఇరవై ఏళ్ళ క్రితం వరకు చాలా పల్లెల్లో ఇంటి పెరట్లో, పొలం గట్టుపై కన్పించిన మొక్క ఇది. కార్బన్–డై–ఆక్సైడ్‌ను నియంత్రించడంలో దీనికో ప్రత్యేకత ఉంది. పంట పొలాల్లో మొక్కలకు హాని చేసే క్రిమి కీటకాలను అదుపు చేస్తుంది. చిన్న మొక్క వేస్తే చాలు పొలం చుట్టూ రక్షణ కవచంలా అల్లుకుపోయే ఈ మొక్క... ఇనుప కంచెల ఆవిర్భావంతో కనుమరుగైంది. ఈ మొక్కపై విస్తృత పరిశోధనలు జరిగి దీని ప్రాధాన్యత విశ్వవ్యాప్తమైనా.. మన దగ్గర ఎవరికీ తెలియనంతగా కనుమరుగైపోయింది. ఇతర దేశాల్లో మాత్రం ఈ మొక్క పెంపకాన్ని బాగా ప్రోత్సహిస్తున్నారు.

కాల గర్భంలో ఎన్నో..



విరిగిన ఎముకలు కట్టుకోవడానికి వాడే నల్లేరు.. కఫంతో ఊపిరి ఆగిపోయే పరిస్థితి నుంచి కాపాడే కరక్కాయ.. ప్రాణం పోయేలా అన్పించే తలనొప్పిని తగ్గించే సొంఠి.. కురుపు ఏదైనా ఆకుతోనే నయం చేసే జిల్లేడు.. చర్మవ్యాధుల పనిబట్టే మారేడు.. సర్వ రోగ నివారిణి తులసి..ఇలాంటివెన్నో మనకు కన్పించకుండా పోతున్నాయి.

ఇవీ నిజాలు..

- వృక్ష శాస్త్రవేత్తలు ఇప్పటివరకు 3.5 లక్షల మొక్క జాతులను గుర్తించారు. ఇందులో 2.78 లక్షల మొక్కలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరిగాయి. వాటి ఔషధ గుణాలు గుర్తించారు. ఇప్పటికే 1.26 లక్షల మొక్క జాతులను వివిధ రూపాల్లో వాడుకుంటున్నారు.
- 30 ఏళ్ళ క్రితం గ్రామీణ ప్రాంతాల్లో 2 లక్షల మొక్క జాతులు ఉన్నాయి. ఇవి ఇప్పుడు 80 వేల లోపే ఉన్నాయి.
- పెరటి వైద్యం 30 ఏళ్ళ క్రితం వరకూ 92 శాతం ఉండేది. ఏదో ఒక మొక్కతో వ్యాధిని నయం చేసుకునే వాళ్ళు. ఇప్పుడు కేవలం 12 శాతమే పెరటి వైద్యాన్ని నమ్ముతున్నారు. అయితే కరోనా వచ్చిన తర్వాత ఇది 21 శాతానికి పెరిగింది.
- పల్లెల్లో పెరటి వైద్యంగా వాడిన మొక్కల్లో 20 జాతులు ప్రస్తుతం ఆయుర్వేద ముందుల రూపంలో విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని కార్పొరేట్ కంపెనీలు దాదాపు రూ.2 వేల కోట్లతో వీటిని పెంచుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే మన దేశంలోని 82 రకాల ఔషధ మొక్కలను వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తున్నారు.

ఫిబ్రవరి 2 నుంచి 'సమతా కుంభ్'

108 దివ్య క్షేత్రాల్లో ఒకేసారి కల్యాణోత్సవం: చినజీయర్‌స్వామి



మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: శ్రీరామ నగరంలో 216 అడుగుల పంచలోహ సమతా మూర్తి ఆవిష్కరణ జరిగి ఏడాది పూర్తికావస్తోంది. ఈ సందర్భంగా శ్రీరామానుజాచార్యుల జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి రెండు నుంచి 'సమతా కుంభ్' ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు సోమవారం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి తెలిపారు. మొదటి వార్షికోత్సవంలో భాగంగా స్ఫూర్తి కేంద్రంలో 108 దివ్య క్షేత్రాల్లో ఒకేసారి నిర్వహించనున్న కల్యాణోత్సవం ఓ చరిత్రాత్మక సన్నివేశంగా మిగిలిపోతుందని ఆయన అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులోని శ్రీరామనగరంలో ఉన్న సమతా స్ఫూర్తి కేంద్రంలో ఫిబ్రవరి 2 నుంచి 12 వరకు నిర్వహించనున్న 'సమతా కుంభ్–2023' కార్యక్రమం ఏర్పాట్లను జీయర్‌స్వామి సోమవారం మీడియాకు వివరించారు. ఇక నుంచి ప్రతిఏటా 'సమతా కుంభ్' పేరుతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గరుడ వాహన సేవను విభిన్నంగా నిర్వహిస్తామన్నారు. అలాగే 18 రూపాల్లో తెప్పోత్సవంలో స్వామి దర్శనం ఇవ్వనున్నారని చెప్పారు. సమతా కుంభ్‌లో భాగంగా లక్ష మందితో భగవద్గీత పారాయణం ఉంటుందన్నారు.

సమాజ శ్రేయస్సు కోసమే రాజకీయాలు..

రాజకీయ పార్టీలు ఒకరినొకరు నిందించుకోవడం సహజమే అయినా అది ఎన్నికల సమయంలోనే ఉండాలని చినజీయర్ అన్నారు. తర్వాత ప్రజల బాగుకోసం అన్ని పార్టీలు కలిసిమెలిసి పనిచేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్‌స్వామి, శ్రీ దేవనాథ జీయర్‌స్వామి, ఉభయవేదాంత విద్వాన్ సముద్రాల వేంకటరంగ రామానుజాచార్యులు, ఎస్వీ రంగ రామానుజాచార్యులు, వికాస తరంగిణి అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ ఎం.జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పరీక్షలతో.. కోవిడ్ కొత్త రకాల గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: మురుగునీటిని తరచూ పరీక్షిస్తుండటం ద్వారా కోవిడ్ రాక, కొత్త రూపాంతరితాలను గుర్తించొచ్చని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంతే కాకుండా సామాజిక స్థాయిలో వ్యాధి వ్యాప్తిని, వైరస్ మోతాదును అంచనా వేసేందుకు ఇది చౌక పద్ధతిగా దోహదపడుతుందన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ జెనెటిక్స్ అండ్ సొసైటీ, నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్, బీమ్ ఎన్విరాన్మెంటల్ ట్రస్ట్ బెంగళూరులో 28 చోట్ల నుంచి మురుగునీటిని సేకరించి జన్యు పరీక్షలు నిర్వహించాయి. గతేడాది జనవరి నుంచి జూన్ వరకు జరిపిన పరీక్షల్లో పాజిటివ్ నమూనాలను ఆర్టీ–పీసీఆర్ పరీక్షలకు జరిపాయి. ఈ ఫలితాల ఆధారంగా వైరస్ వ్యాప్తి, వాటిల్లో జరుగుతున్న మార్పులను తెలుసుకోవడం వీలైందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన శాస్త్రవేత్త డాక్టర్ ఫరా ఇష్తియాక్ తెలిపారు. సాధారణ పద్ధతులతో పోలిస్తే మురుగునీటిలో జన్యువుల కోసం పరీక్షలు జరపడం ద్వారా ఎక్కువ రూపాంతరితాలు గుర్తించామని వివరించారు. ఈ పద్ధతిని భవిష్యత్తులో ఇతర వైరస్‌ల గుర్తింపునకు కూడా ఉపయోగించవచ్చని టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ జెనెటిక్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా తెలిపారు. ఈ అధ్యయనం వివరాలు లాన్సెట్ రీజినల్ హెల్త్–సౌత్ ఈస్ట్ ఆసియా తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

'పాలమూరు- రంగారెడ్డి'కి రూ.13,500 కోట్ల రుణాలు

అంగీకరించిన ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ సంస్థలు



- పర్యావరణ చిక్కులు తొలగితే విడుదల చేస్తామని హామీ
- ఎన్జీటీ స్టేతో రూ.3వేల కోట్ల పాత రుణం నిలుపుదల

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.13,500 కోట్ల అదనపు రుణం ఇవ్వడానికి రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)లు సూత్రప్రాయంగా అంగీకరించాయి. చెరో రూ.6,750 కోట్ల చొప్పున రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చాయి. అయితే, పర్యావరణ అనుమతుల్లేని కారణంగా ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను నిలుపుదల చేస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) విధించిన స్టేతోపాటు ఇతర న్యాయ వివాదాలు తొలగిన తర్వాతే రుణాలు ఇస్తామని నిబంధన పెట్టాయి. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా, అనుమతులు లభించిన తర్వాత స్టే తొలగిపోనుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పర్యావరణ అనుమతులు లేకుండా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల నిర్మాణాన్ని చేపట్టినందుకు రూ.920.85 కోట్ల జరిమానా విధిస్తూ గత నెలలో ఎన్జీటీ ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ పిటిషన్ ఇంకా విచారణకు రావాల్సి ఉంది.

స్టేతో ఆగిన రూ.3వేల కోట్ల రుణం

కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్ల రుణాలను పీఎఫ్‌సీ నుంచి సమీకరించేందుకు గతంలో ఒప్పందం జరగగా, ఇప్పటివరకు రూ.7 వేల కోట్లను పీఎఫ్‌సీ విడుదల చేసింది. ప్రాజెక్టు పనులపై ఎన్జీటీ విధించిన స్టే తొలగిన తర్వాతే మిగిలిన రూ.3వేల కోట్లను విడుదల చేస్తామని పీఎఫ్‌సీ పేర్కొంటోంది.

రోజుకు ఒక టీఎంసీ తరలింపు

న్యాయవివాదాలతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు నిలిచిపోయినా, అప్పటికే రోజుకు ఒక టీఎంసీ సామర్థ్యంతో కృష్ణా జలాల తరలింపునకు వీలుగా పనులు జరిగినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది చివరిలోగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 67 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ఆరు రిజర్వాయర్లను నిర్మిస్తుండగా, తొలి నాలుగు రిజర్వాయర్లయిన నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివేనలకు శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లను ఎత్తిపోసేందుకు వీలుగా పంపులు, మోటార్ల బిగింపు పనులు పూర్తయ్యాయి. చివరి రెండు రిజర్వాయర్లు అయిన ఉదండపూర్, లక్ష్మీదేవిపల్లిలకు నీళ్లను పంపింగ్ చేసే పంపులు, మోటార్లతోపాటు సొరంగం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఉదండపూర్ జలాశయం నుంచి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లను పంపింగ్ చేసేందుకు మధ్యలో 14 కి.మీ. సొరంగాన్ని నిర్మించాల్సి ఉంది. సొరంగానికి ప్రత్యామ్నాయంగా ఉదండపూర్ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లను ఎత్తిపోయాలన్న ప్రతిపాదనలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఒకే సాఫ్ట్‌వేర్‌లో ఆర్టీసీ సమస్త సమాచారం

నల్‌సాఫ్ట్ సంస్థతో టీఎస్‌ఆర్టీసీ అవగాహన ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఓ బోల్టు కొనాలన్నా, దానికి బిల్లు చెల్లించాలన్నా.. బస్సుల నిర్వహణ, రూట్ మ్యాప్, తిరిగిన కి.మీ.లు, వచ్చిన ఆదాయం, బ్యాంకులో జమ, సిబ్బంది హాజరు, పనితీరుపై జాబితా తయారీ, కొత్త బస్సుల కొనుగోలు, సొంత వర్క్‌షాప్‌లో బస్ బాడీల తయారీ.. ఇలా ఆర్టీసీకి సంబంధించిన సమస్త సమాచారం ఓ మీట నొక్కగానే ప్రత్యక్షమయ్యేలా యాజమాన్యం ఓ సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చుకోనుంది. ఒరాకిల్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఈఆర్‌పీ) సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాంతో ఇది సాధ్యం కానుంది. ఈ తరహా ప్రోగ్రామ్స్ తయారీ, సేవలు అందించడంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నల్‌సాఫ్ట్ అనే సంస్థతో ఆర్టీసీ సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, నల్సాఫ్ట్ సీఈఓ వెంకట నల్లూరిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, వినోద్, చీఫ్ మేనేజర్ (ఎఫ్ అండ్ ఏ)విజయ పుష్ప, ఐటీ సీఓ రాజశేఖర్, నల్‌సాఫ్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. తొమ్మిది నెలల్లో ప్రోగ్రాంను సిద్ధం చేసి ఆ సంస్థ ఆర్టీసీకి అందించనుంది.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్, నల్సాఫ్ట్ సీఈఓ వెంకట నల్లూరి

వందేభారత్‌లు సరే.. మరి పట్టాలు!

130 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా ట్రాక్‌ను మార్చకుండానే మరో మూడు రైళ్లకు పచ్చజెండా

ఆ పనులు జరగకుండా వేగంగా వాటి పరుగు అసాధ్యం ● పనులు జరిగాకే నడపాలంటే ఇప్పట్లో పట్టాలెక్కే వీలు లేనట్టే..



సాక్షి, హైదరాబాద్: రైళ్లలో టాప్ ప్రీమియర్ కేటగిరీలోకి వచ్చే వందేభారత్ రైలు సికింద్రాబాద్–విశాఖ మధ్య ఇటీవలే ప్రారంభమై ఎనిమిదిన్నర గంటల్లో గమ్యం చేరుతోంది. ఆ వెంటనే సికింద్రాబాద్–తిరుపతి, కాచిగూడ–బెంగళూరు, సికింద్రాబాద్–పుణే మధ్య మరో మూడు వందేభారత్ రైళ్లు మంజూరయ్యాయి. కోచ్ ఫ్యాక్టరీ నుంచి కొత్త రైళ్లు రాగానే ఆ మూడు పట్టాలెక్కుతాయని ప్రజలు భావిస్తున్నారు. మరి నిజంగా ఇంత తొందరగా ఆ రైళ్లు పట్టాలెక్కుతాయా..?

130 కి.మీ. సామర్థ్యం ఉంటేనే ఇలా ఉంది...

వందేభారత్ రైలు గరిష్ట వేగం గంటకు 160 కి.మీ. (పరీక్ష సమయంలో 180కి.మీ. వేగం కూడా అందుకుంది). అయితే, ఇటీవల పట్టాలెక్కిన సికింద్రాబాద్–విశాఖపట్నం రైలు మాత్రం సగటున గంటకు 90 కి.మీ. మాత్రమే పరుగెడుతోంది. ఆ మార్గంలోని ట్రాక్ వేగ సామర్థ్యం గంటకు 130 కి.మీ. మాత్రమే ఉంది. మూడో లైన్ పనులు, ఇతర సిగ్నలింగ్ అవాంతరాలతో ఆ వేగాన్ని అడపాదడపా అందుకోవటం మినహా నిరంతరాయంగా ప్రయాణించటం సాధ్యం కావడంలేదు. గంటకు 130 కి.మీ. వేగానికి సరిపడా ట్రాక్‌ను పటిష్టపరిచిన మార్గంలోనే ఇలా ఉంటే.. అసలు ఆమేరకు ట్రాక్ పటిష్టం కాని సికింద్రాబాద్–పుణె, బెంగుళూరు, తిరుపతి మార్గాల్లో వందేభారత్ పరుగు ఎలా సాధ్యమన్నది ఇప్పుడు ఎదురవుతున్న ప్రశ్న.

శతాబ్ది సాగటమే కష్టంగా ఉంటే..

సికింద్రాబాద్ నుంచి పుణేకు వికారాబాద్–వాడి–సేడం–సోలాపూర్ మీదుగా వెళ్లాలి. ఈ మార్గంలో సికింద్రాబాద్ నుంచి వాడి వరకు 130 కి.మీ. స్పీడ్‌కు తగ్గట్టుగా కూడా ట్రాక్‌ను పటిష్టం చేయలేదు. అలాంటిది దాదాపు 180 కి.మీ. మేర సామర్థ్యం పెంచాలంటే చాలా సమయం పడుతుంది. శతాబ్ది రైలు ఆ మార్గంలో సగటున 70 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది. ఈ మార్గంలో వందేభారత్ నడిచినా దాని వేగం దాదాపు అంతే ఉండనుంది. వందేభారత్ మంజూరైన నేపథ్యంలో సికింద్రాబాద్ –వాడి మధ్య ట్రాక్‌ను పటిష్ట పరిచే పనులు ఇప్పుడు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

తిరుపతిదీ అదే పరిస్థితి..

హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లేందుకు మూడు మార్గాలున్నాయి. కర్నూలు మీదుగా ఉన్న మార్గంలో ట్రాక్ పటిష్టం చేసే పనులు జరగలేదు. వాడి నుంచి రేణిగుంట వరకు పనులు జరిగినా.. నగరం నుంచి వాడి వరకు పనులు పూర్తికానందున ఆ మార్గం కూడా ఇప్పటికిప్పుడు కుదరదు. ఇక గూడురు మీదుగా వెళ్లే మార్గంలో.. సికింద్రాబాద్–కాజీపేట–విజయవాడ–గూడూరు వరకు 130కి.మీ. స్పీడ్‌కు తగ్గట్టుగా ట్రాక్‌ను మార్చారు. గూడూరు నుంచి తిరుపతి వరకు చేయాల్సి ఉంది. ఈ దారిలో ప్రస్తుతం కృష్ణా ఎక్స్‌ప్రెస్ తిరుగుతోంది. వెరసి మూడు మార్గాల్లో 130 కి.మీ. వేగానికి సరిపడా పనులు పూర్తయిన మార్గం ఒక్కటి కూడా లేదు.

డబ్లింగుకే దిక్కులేదాయె..

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రధాన మార్గం అయిన కర్నూలు రూట్‌లో ఇప్పటివరకు ట్రాక్‌ను పటిష్ట పరిచే పనులే మొదలు కాలేదు. ఈ మార్గంలో ప్రస్తుతం డబ్లింగ్ పనులు నడుస్తున్నాయి. అవి పూర్తయితే గానీ ట్రాక్‌ను పటిష్టం చేసే పనులు ప్రారంభం కావు. సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. త్వరలో ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనలో భాగంగా ఆ రెండో మార్గాన్ని జాతికి అంకితం చేయనున్నారు. మహబూబ్‌నగర్–డోన్ మధ్య డబ్లింగ్ పనులు జరపాల్సి ఉంది. అలాగే, గుత్తి–ధర్మవరం–డోన్ మధ్యలో కొంతమేర జరగాల్సి ఉంది. వెరసి ఈ మార్గం ఇప్పటికిప్పుడు వందేభారత్‌కు అనువు కాదు. ఇక, బెంగుళూరుకు వాడి మీదుగా కూడా వెళ్లే అవకాశం ఉంది. ఆ మార్గంలో సికింద్రాబాద్ నుంచి వాడి వరకు పనులు పూర్తయితేనే సాధ్యం. ఇప్పటికే ఈ మార్గంలో ట్రాక్‌ను 130 కి.మీ.కు తగ్గట్టుగా మెరుగుపరిచి ఉంటే.. మంజూరైన మూడు వందేభారత్ రైళ్లు వెంటనే పట్టాలెక్కే అవకాశం ఉండేది. ఇప్పుడు దానికి తగ్గ వేగంతో ప్రయాణించాలంటే మాత్రం ట్రాక్‌ను పటిష్టం చేసే పనులు పూర్తయ్యే వరకు నిరీక్షించాల్సిందే.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.